thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 220 | కరీంనగర్ శుక్రవారం, 17 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## బెట్టింగ్ యాప్ కేసు..ఈడీ ఎదుట హాజరైన సోనూసూద్

ప్రముఖ నటుడు సోనూ సూద్ తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు విచారణకు హాజరయ్యారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ మనీలాండరింగ్ కేసులో ఆయనను ప్రశ్నించారు. 52 ఏళ్ల సోనూ సూద్ ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కేసు డబ్బు ఆర్జన, పన్ను ఎగవేత వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఆరోపిస్తూ నమోదైంది. ఈ విచారణలో భాగంగా సోనూ సూద్‌ను మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అధికారులు ప్రశ్నించారు.సోనూ సూద్ ఈ కేసులో ఎలాంటి పాత్ర పోషించారనే దానిపై ఈడీ అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఆయన ఓ యాప్‌తో సంబంధం ఉన్న కొన్ని ఆర్థిక లావాదేవీల గురించి సమాచారం ఇవ్వడానికి హాజరయ్యారని తెలుస్తోంది. ఈ విచారణలో సోనూ సూద్ సహకరిస్తున్నట్లు సమాచారం. సోనూ సూద్ ఇటీవల కాలంలో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎంతో పేరు సంపాదించుకున్నారు. కరోనా సమయంలో ఆయన సహాయ కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయి.




# 50 శాతం మించొద్దు!

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీం స్పష్టత

### స్థానిక ఎన్నికల కథ మళ్ళీ మొదటికే! - బీసీ రిజర్వేషన్ల రిట్ పిటిషన్ కొట్టివేత

### పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్ళాలి - రాష్ట్ర ప్రభుత్వా సూచించిన సుప్రీం కోర్టు

### బీసీ రిజర్వేషన్లు.. తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ షాక్

ఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల అంశంలో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. జీవో నెంబర్ 9పై హైకోర్టు విధించిన స్టేను ఎత్తేయాలని దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు నిరాకరించింది. గురువారం వాడి వేడి వాదనల అనంతరం.. తమ తీర్పుతో హైకోర్టు విచారణపై ప్రభావం పడొచ్చని, ఈ దశలో పిటిషన్‌ను స్వీకరించబోమని చెబుతూ ద్విసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలే చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరిట తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబర్ 9ని జారీ చేసింది. అయితే తెలంగాణ హైకోర్టు ఆ జీవోపై స్టే విధిస్తూ.. విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈలోపు రిజర్వేషన్ల పరిమితి మీరకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచించింది కూడా. అయితే.. 42 శాతం బీసీ రిజర్వేషన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను.. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఇవాళ పరిశీలించింది. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత.. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. మెరిట్స్ ప్రకారం విచారణ కొనసాగించాలంది. కావాలనుకుంటే ప్రభుత్వం పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. హైకోర్టులో విచారణ యథాతథంగా కొనసాగుతుందని.. అక్కడే తేల్చుకుని రావాలని పిటిషనర్ తరఫు లాయర్‌కు స్పష్టం చేసింది.

**వాదనలు ఇలా..** తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. రిజర్వేషన్లు నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. తెలంగాణ బీసీ బిల్లులకు రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం ఇవ్వలేదు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపాయి. శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించాం. డేటా బేస్ ఆధారంగా రిజర్వేషన్లు నిర్ణయించుకోవచ్చని ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది దేశంలో ఎక్కడా లేనివిధంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాం. గవర్నర్ బిల్లు పెండింగ్లో పెట్టడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. ఏకాభిప్రాయంతో ఆమోదించిన బిల్లును పెండింగ్ లో పెట్టారు. బిల్లును ఛాలెంజ్ చేయకుండా బిల్లు ద్వారా విడుదల చేసిన జీవోను సవాల్ చేశారు. రిజర్వేషన్లను పెంచుకునే సౌలభ్యం ఇందిరా సహాన్ని జడ్జిమెంట్ లో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టు విధించిన ట్రిపుల్ టెస్ట్ కండిషన్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది డెడికేటెడ్ కమిషన్ ద్వారా సర్వే జరిపి ఎంపరికల్ డేటా సేకరించింది. కమిషన్ సిఫారసు ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించాం. బీసీ జనాభా డేటా ఆధారంగానే బీసీల రిజర్వేషన్లు పెంచాము. ఇంటింటికి తిరిగి సామాజిక ఆర్థిక కుల సర్వే నిర్వహించాం. సమగ్రంగా , సాంకేతికంగా సర్వే జరిపాం. అన్ని వర్గాలతో విస్తృత సంప్రదింపులు జరిపాం. ఇండియాలో ఎక్కడ లేని విధంగా ఈ సర్వే నిర్వహించాం. దీనిపైన స్టే ఎలా విధిస్తారు ?. హైకోర్టు మధ్యంతర తీర్పులో ఎలాంటి సహేతుక కారణాలు లేవు. వెంపరికల్ డేటా ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించి రిజర్వేషన్లు పెంచుకోవచ్చని గౌలి కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది బెంచ్ జోక్యం చేసుకుని.. ఎస్టీ ప్రాంతాలలోనే రిజర్వేషన్ల పెంపుకు మినహాయింపులు ఉన్నాయి కదా ? అని ప్రశ్నించింది. ప్రతివాది మాధవరెడ్డి తరఫు లాయర్ వాదనలు వినిపిస్తూ.. రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండకూడదని సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్పష్టం చేసింది. షెడ్యూల్ ఏరియా ,గిరిజన ప్రాంతాలలో మాత్రమే 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచుకునేందుకు అనుమతి ఉంది. జనరల్ ఏరియాలలో రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచడానికి వీలులేదు. తెలంగాణలో అలాంటి షెడ్యూల్ ఏరియాలు లేవు. కృష్ణమూర్తి కేసులో సుప్రీంకోర్టు ఇదే తీర్పు వెల్లడించింది. మహారాష్ట్ర ,మధ్యప్రదేశ్ లో కూడా సుప్రీంకోర్టు రిజర్వేషన్ల పెంపును తిరస్కరించింది. 50 శాతానికి మించకుండా ఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించింది. ట్రిపుల్ టెస్ట్ లో కూడా 50 శాతానికి మించి రిజర్వేషన్ ఉండదు అని అన్నారు.




హైదరాబాద్, అక్టోబర్ 16: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై మాజీ మంత్రి కేటీఆర్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్లపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఎలక్టోరల్స్‌ను ఈసీ రివిజన్ చేస్తోందని.. ఈ సమ యంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది హైకోర్టు. ఓటో చోరీపై హైకోర్టులో బీఆర్ఎస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. ఈరోజు విచారణ జరిగింది. బీఆర్ఎస్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌తో సంబంధంలేని వారు ఓటరు జాబితాలో చేరారని తెలిపారు. బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘానికి ఆధారాలు సమర్పించామని వాదనలు వినిపించారు. ఈసీ తరఫు లాయర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రిప్రజెంటేషన్‌లపై ఎన్నికల అధికారిని ఆదేశించామని.. నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్ట్ ధర్మాసనం బోగస్ ఓట్లపై ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ విచారణను ముగించింది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో రాష్ట్ర రాజకీయాల్లో మార్పు ఖాయం



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్రంలో ఒక చర్చనీయాంశంగా ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ బూత్ అధ్యక్షులు, కార్యకర్తలతో కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ఈ ఎన్నికను ఎవరూ కోరుకున్నది కాదని.. స్థానిక శాసనసభ్యులు స్వర్గస్థులు కావడం వల్ల ఈ ఎన్నికలు వచ్చాయన్నారు. ఈ ఎన్నిక రాష్ట్ర రాజకీయాలలో మార్పు తెచ్చే ఎన్నిక అని చెప్పుకొచ్చారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, పదేళ్లకుపైగా కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్.. జూబ్లీహిల్స్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదని వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా డ్రైనేజీ పొంగిపొర్లుతోందని.. ఎక్కడ చూసినా చెత్తాచెదారంగా మారిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని పాలించేది కాంగ్రెస్ కాదని.. మజ్లీస్ పార్టీ అంటూ దుయ్యబట్టారు.

**ఆ మూడు కుటుంబ పార్టీలే...** పాతబస్తీలో మజ్లీస్ గుండాల కారణంగా చాలా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు రాష్ట్రాన్ని పాలించాయన్నారు. నాడు కేసీఆర్ పాలనలో మజ్లీస్ పార్టీ భుజాల మీద మోశారని.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే చేస్తోందని తెలిపారు. ఈ మూడు పార్టీలు ఒక్కటే అంటూ వ్యాఖ్యలు చేశారు. వీరందరూ కలిసి బీజేపీ పార్టీని అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ పార్టీ నేతలు మంత్రి పదవులు అనుభవించారని గుర్తు చేశారు. ఈ మూడు పార్టీలు కుటుంబ పార్టీలే అని.. వారి కోసమే పని చేస్తాయని విమర్శలు గుప్పించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని పరోక్షంగా మజ్లీస్ పార్టీ ఏలాలని చూస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌ను మజ్లీస్ పార్టీకి అప్పజెప్పొద్దన్నారు సెంట్రల్ మినిస్టర్ కిషన్ రెడ్డి.

**హామీలు ఏమయ్యాయి?..** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ. 2,500, మోటార్ సైకిళ్లు, తులం బంగారం ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు విపరీతమైన దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఇస్తామన్న రూ. 4,000 ఏమయ్యాయని అడిగారు కేంద్ర మంత్రి. వీటిపై యువకులు, మహిళలు కాంగ్రెస్‌ను నిలదీయాలన్నారు. ఇప్పటికి ఒక్కరికి కూడా కొత్త పెన్షన్ ఇవ్వలేదన్నారు. బీసీలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఇస్తామన్న లక్ష కోట్లు ఏమయ్యా యని.. ఎందుకు ఇవ్వలేదో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు ఇస్తామన్నారని, ఇచ్చారా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఏ హామీని కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కనీసం స్ట్రీట్ లైట్లు కూడా వేయలేదని కేంద్రమంత్రి మండిపడ్డారు.

**వారికి ఓటేస్తే మజ్లిస్‌కు వేసినట్టే..** ముఖ్యమంత్రి తిరిగే రూట్లలో కూడా స్ట్రీట్ లైట్లు లేవన్నారు. తెలంగాణలో బీజేపీ ఎదగకుండా అధికార పార్టీతో కలిసి మజ్లీస్ పార్టీ ప్రయత్నిస్తుందని కిషన్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అది మజ్లీస్ పార్టీకి వేసినట్టే అని అన్నారు. బీఆర్ఎస్‌కు తెలంగాణలో భవిష్యత్ లేదని.. ఆ పార్టీకి ఓటు వేస్తే మూసీలో వేసినట్టే అంటూ కామెంట్స్ చేశారు. బీజేపీ కార్యకర్తలు నవంబర్ 11 వరకు నిబద్ధతతో పని చేయాలని.. ప్రజల మధ్యలో పని చేయాలని సూచించారు. బీజేపీ అభ్యర్థి దీపక్ ప్రజల మధ్యలో ఉన్న నాయకుడన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా పని చేశారన్నారు. బీజేపీ అభ్యర్థి అయిన దీపక్ కోసం పని చేయాలని.. కార్యకర్తలం అందరం కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. మజ్లీస్ పార్టీ కబంధ హస్తాల నుంచి హైదరాబాద్‌ను రక్షించుకోవాలన్నారు. ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా జూబ్లీహిల్స్‌లో న్యాయం గెలవాలని.. ప్రజలే గెలవాలని తెలిపారు. పేద ప్రజలకు బీజేపీ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వెల్లడించారు. అందరికీ ఉచిత బియ్యాన్ని అందిస్తోందన్నారు. దేశానికి ప్రధాన మంత్రి మోదీ ప్రపంచ వ్యాప్తంగా పేరు తీసుకొచ్చారని.. పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు




## 2047 నాటికి మన దేశం వికసిత్ భారత్‌గా మారుతుంది

## 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' సభలో ప్రధాని మోదీ

కర్నూలు, అక్టోబరు16 : ఏపీ ఆత్మగౌరవం.. సంస్కృతికి నిలయంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివర్ణించారు. ఏపీలో అనంత అవకాశాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలోనూ యువశక్తి ఉందని నొక్కిచెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూపంలో ఏపీకి శక్తివంతమైన నాయకత్వం ఉందని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ఏపీకి సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. 16 నెలల్లో అభివృద్ధి డబుల్ ఇంజిన్‌లా దూసుకుపోతోందని ఉద్ఘాటించారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

**ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తున్నాయి..** అభివృద్ధి కోసం ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇవాళ(గురువారం) కర్నూలు జిల్లాలోని నన్నూరులో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్' బహిరంగసభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించారు. ఈ సభలో సోదర, సోదరీమణులకు నమస్కారం అంటూ తెలుగులో మోదీ ప్రసంగించారు. అహోబిళం, మహానంది, మంత్రాలయం స్వాముల ఆశీస్సులు కోరుకుంటున్నామని ఆకాంక్షించారు. ద్వితీయ జ్యోతిర్లింగమైన మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందానని చెప్పుకొచ్చారు. సోమనాథుడు కొలువైన గడ్డపై పుట్టానని ఉద్ఘాటించారు. విశ్వనాథుడికి సేవ చేసే భాగ్యం కలిగిందని పేర్కొన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

**వికసిత్ భారత్..** '2047 నాటికి మన దేశం వికసిత్ భారత్‌గా మారుతుంది. 21వ శతాబ్దం.. 140 కోట్ల భారతీయుల శతాబ్దం. పలు ప్రాజెక్టులతో ఏపీలో కనెక్టివిటీ బలోపేతం అవుతుంది. ప్రాజెక్టులతో పరిశ్రమలకు ఊతం.. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. దేశం అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకం. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. దేశంలోని ప్రతి గ్రామంలో విద్యుద్దీకరణ జరిగింది.

తలసరి విద్యుత్ వినియోగం 1400 యూనిట్లకు పెరిగింది. దేశంలో ఇంధన విప్లవానికి ఏపీ కేరాఫ్‌గా మారింది. ఇళ్లతో పాటు పరిశ్రమలకు తగిన విద్యుత్ అందుతోంది. సహజ వాయువు పైపులైన్‌తో రూ. 15 లక్షల ఇళ్లకు గ్యాస్ సరఫరా అందిస్తున్నాం. చిత్తూరు LPG బాటిలింగ్ ప్లాంటుకు రోజూ 20 వేల సిలిండర్లు నింపే సామర్థ్యం ఉంది' అని పేర్కొన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

**భారత్, ఏపీ అభివృద్ధిని ప్రపంచమంతా గమనిస్తోంది...** 'వికసిత్ భారత్ లక్ష్యం సాధనకు..మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల అభివృద్ధి. సబ్బవరం- షీలానగర్ హైవేతో కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లతో ఉపాధి లభిస్తోంది. భారత్‌ను 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా ప్రపంచం చూస్తోంది. ఏపీ అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి చాలా ముఖ్యం. రాయలసీమ జిల్లాల్లో ఉపాధి కల్పించేలా పలు ప్రాజెక్ట్‌లు వస్తున్నాయి. ప్రజలే ప్రాధాన్యంగా మా ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధే మా విధానం. జీఎస్టీ భారాన్ని కూడా తగ్గించాం. జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండుగగా చేసుకున్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని జరుపుకోవడం ఆనందాన్నిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏపీ సామర్థ్యాన్ని విస్మరించాయి. దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఏపీకి ఉంది. ఏపీ మాత్రం సొంత అభివృద్ధి కోసం పోరాడే దుస్థితి కలిగింది. ఎన్డీఏ హయాంలో ఏపీ ముఖచిత్రం మారుతోంది. నిమ్మలూరు నైట్ విజన్ పరికరాల తయారీ ఫ్యాక్టరీ.. రక్షణరంగంలో కీలక పాత్ర పోషించబోతోంది. కర్నూల్‌ను డ్రోన్ హబ్‌గా మార్చాలన్నది ప్రభుత్వం సంకల్పం' అని వెల్లడించారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.

**మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల అభివృద్ధి..** 'వికసిత్ భారత్ లక్ష్యం సాధనకు..మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల అభివృద్ధి. సబ్బవరం- షీలానగర్ హైవేతో కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లతో ఉపాధి లభిస్తోంది. భారత్‌ను 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా ప్రపంచం చూస్తోంది. ఏపీ అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి చాలా ముఖ్యం. రాయలసీమ జిల్లాల్లో ఉపాధి కల్పించేలా పలు ప్రాజెక్ట్‌లు వస్తున్నాయి. ప్రజలే ప్రాధాన్యంగా మా ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధే మా విధానం. జీఎస్టీ భారాన్ని కూడా తగ్గించాం. జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండుగగా చేసుకున్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని జరుపుకోవడం ఆనందాన్నిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏపీ సామర్థ్యాన్ని విస్మరించాయి.

దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఏపీకి ఉంది. ఏపీ మాత్రం సొంత అభివృద్ధి కోసం పోరాడే దుస్థితి కలిగింది. ఎన్డీఏ హయాంలో ఏపీ ముఖచిత్రం మారుతోంది. నిమ్మలూరు నైట్ విజన్ పరికరాల తయారీ ఫ్యాక్టరీ.. రక్షణరంగంలో కీలక పాత్ర పోషించబోతోంది. కర్నూల్‌ను డ్రోన్ హబ్‌గా మార్చాలన్నది ప్రభుత్వం సంకల్పం' అని పేర్కొన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.




# జర భద్రం: తెలంగాణ పోలీసు శాఖ

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసు శాఖ ప్రకటన జారీ చేసింది. వాట్సప్ గ్రూపుల్లో ఫేక్‌లింక్స్ పంపుతున్నారని.. కేంద్ర ప్రభుత్వ పథకాలంటూ ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఆయా పథకాలకు అర్హత చెక్ చేసుకోవాలని.. తొందరపడి ఎవరూ లింక్‌లు క్లిక్ చేయొద్దని సూచించింది. కేవలం అధికారిక వెబ్‌సైట్లు మాత్రమే వాడాలని పోలీసులు తెలిపారు. అపరిచితులు పంపించే లింక్‌లు, మెసేజ్‌లకు స్పందించవద్దని పేర్కొన్నారు.

# మంత్రి కూతురి ఆరోపణలపై విచారణ చేయాల్సిందే: రామచంద్ర రావు



హైదరాబాద్, అక్టోబర్ 16: డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వివాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ యజమానిని బెదిరించడంలో పెద్దవారి హస్తముందని కొండా కుటుంబ సభ్యులు అంటున్నారని.. దీని వెనుక ఎవరెవరు ఉన్నారో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. 'పోలీసులు ఓ మంత్రి ఇంట్లోకి వెళ్ళారు. మంత్రి కూతురు.. సీఎం రేవంత్ రెడ్డితో పాటు అనేక మందిపై ఎలిగేషన్ చేశారు. సిమెంట్ కంపెనీల యజమానులను బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పారు. కాంగ్రెస్, కరెప్షన్ సమానంగా ప్రయాణం చేస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ దీనిపై వివరణ ఇవ్వాలి. ఇది దోచుకునే ప్రభుత్వంగా మారిపోతోంది. టికెట్‌లు కూడా దోచుకునే వారికే ఇస్తున్నారు' అని మండిపడ్డారు. మంత్రి కూతురు చేసిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం దోచుకున్న సొత్తు పంచుకుంటున్నారని.. ఇప్పుడు దోచుకున్న సొత్తు పెంచుకునేందుకు తప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం దోచుకునే ప్రభుత్వమా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తెలంగాణను దోచుకున్న పార్టీలను ఓడించాలన్నారు. కాంగ్రెస్ డీఎన్‌ఏ.. అవినీతి, తప్పుడు పాలన, దోపిడీ అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలపాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని బీజేపీరాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు వెల్లడించారు. రామచంద్ర రావు ఇంకా మాట్లాడుతూ.. స్థానికంగా తయారైన వస్తువులు కొనుగోలు చేసే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. చేతి వృత్తులు భారత దేశంలో అనేక వస్తువులు ఉన్నాయని.. భూవనగిరి, గద్వాల, సిరిసిల్ల వంటి ప్రాంతాల్లో చేతి వృత్తులకు ప్రత్యేకత ఉందని తెలిపారు. ఇలాంటి వృత్తి చేసేవారు ఈ మధ్య ఆత్మహత్యలు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించేలా స్థానికంగా తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని బీజేపీ ఆలోచన చేస్తోందన్నారు. భారత వస్తువులకు బయట కూడా డిమాండ్ రావాలని.. ఈ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై కూడా ఉంటుందన్నారు. బీజేపీ వచ్చిన తర్వాత లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజంను నిర్మూలిస్తామని చెప్పామని.. నిన్న అనేక మంది మావోలు ప్రభుత్వం ముందు లొంగిపోయారన్నారు. చాలామంది అజ్ఞాతంలో ఉన్న నక్సల్స్ లొంగి పోయారనితెలిపారు. లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం ఫ్రీ భారతదేశంగా మారుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు వెల్లడించారు.




హైదరాబాద్: వ్యూస్ మాయలో పడి విలువలు మరిచిపోతే ఎలా అని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ ప్రశ్నించారు. వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో సజ్జనార్ పోస్ట్ పెట్టారు. "చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారు? చిన్నారులు, యువతకి స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేసి సమాజాభివృద్ధికి దోహదం చేయండి. అంతేకానీ.. ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించవద్దు. గుర్తు పెట్టుకోండి.. ఇది బాలల హక్కుల ఉల్లంఘనే కాదు.. చట్టరీత్యా నేరం. ఇటువంటి చర్యలు పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలను ఉల్లంఘించడమే. పిల్లలను ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం వారిని వేధించడం కిందికే వస్తుంది.


**ఇలాంటి వీడియోలు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయండి...** మైనర్లతో ఈ తరహా కంటెంట్ చేసే వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంది. తక్షణమే వీటిని తొలగించకున్నా.. భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ అప్‌లోడ్ చేసినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు మీ దృష్టికి వస్తే వెంటనే రిపోర్టు చేయండి. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ.. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడం మాత్రమే కాదు.. వారి బాల్యం, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును కాపాడటం కూడా మీ బాధ్యతే అనే విషయం మరిచిపోవద్దు" అని సజ్జనార్ పేర్కొన్నారు.

# వెంకటేశ్, రానా కోర్టుకు రావాల్సిందే: నాంపల్లి కోర్టు



హైదరాబాద్: ఫిల్మ్‌నగర్ దక్కన్ కిచెన్ హెూటల్ కూల్చివేత కేసుపై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సినీ నటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్, సురేశ్ బాబు నవంబర్ 14న తప్పనిసరిగా న్యాయస్థానానికి రావాలని ఆదేశించింది. పర్సనల్ బాండ్ సమర్పించేందుకు కచ్చితంగా రావాల్సిందేనని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను ధిక్కరించి దక్కన్ హెూటల్ కూల్చివేశారన్న ఆరోపణలతో సినీనటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్‌తోపాటు నిర్మాత దగ్గుబాటి సురేశ్‌పై గతంలో కేసు నమోదైన విషయం తెలిసిందే.




# సమంత, తమన్నా, రకుల్ ఫేక్ ఓటర్ ఐడీలు.. సోషల్ మీడియాలో వైరల్

హైదరాబాద్, అక్టోబర్ 16: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టాలీవుడ్ హీరోయిన్లు సమంత, తమన్నా, రకుల్ ప్రీత్ సింగ్ ఫేక్ ఓటర్ ఐడి లిస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఓటర్ల జాబితాలో వీరి లిస్ట్ కనబడటంతో అందరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే అధికారులు రూపొందించిన జాబితాలో నిజంగానే వీరి పేర్లు ఉన్నాయా? లేదా ఎవరైనా దురుద్దేశంతో ఇలా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారా? అనేది తెలియాల్సి ఉంది. వేరే ఓటర్ల ఎపిక్ నంబర్ తో హీరోయిన్ల ఫోటోలు పెట్టి ఓటర్ ఐడీ కార్డులు తయారు చేసినట్లు తెలుస్తోంది. ఫేక్ ఓటర్ ఐడీల ప్రచారంపై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులు సీరియస్ అయ్యారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు.. ఎక్కడ వీటిని ఫ్యాబ్రికేట్ చేశారు? ఎవరు ప్రచారం చేశారు? అన్న అంశాలపై ఎన్నికల సంఘం విచారణ చేపట్టింది. సోషల్ మీడియాలో ఫోటోలు వైరల్ చేయడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదయింది. అటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు దూసుకుపోతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతతో పలు డివిజన్లలో ముమ్మర ప్రచారం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ప్రచారంలో దూసుకుపోతున్నాడు. అటు నిన్ననే తమ అభ్యర్థిపై బీజేపీ ప్రకటన విడుదల చేసింది. ఈ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పేరును బీజేపీ అధిష్టానం ప్రకటించింది. దీంతో ఆయన కూడా ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఈ స్థానానికి ఉపఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే.




హనుమకొండ: మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకేమీ తెలియదని ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన కుమార్తె సుస్మిత హైదరాబాద్‌లో ఏం మాట్లాడిందో తెలియదన్నారు. స్మార్ట్ ఫోన్ చూడటం తనకు రాదని చెప్పారు. సిమెంట్ కంపెనీ యాజమాన్యాలను సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం.. మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోవడం తదితర పరిణామాల నేపథ్యంలో హనుమకొండలో కొండా మురళి మీడియాతో మాట్లాడారు. "నా కుమార్తె, అల్లుడు లండన్‌లో ఉన్నారు.. అక్కడ వ్యాపారం చేస్తున్నారు. నా బిడ్డకు పదవి ఏమీ లేదు.. ఆమె ఏ పార్టీలోనూ లేదు. మంత్రి ఛాంబర్‌కు ఇప్పటివరకు నేను వెళ్లలేదు. భద్రతా కారణాల వల్ల వేర్వేరు కార్లలో నేను, సురేఖ వెళ్తాం. సీఎం రేవంత్‌రెడ్డి నాకు ఎమ్మెల్సీ ఇస్తామన్నారు.. ఇస్తారు. ఆయన సీఎం కావాలని కోరుకున్న వారిలో నేనూ ఒకడిని. సీఎం, మంత్రి పొంగులేటి మా ఇంటికి వచ్చారు.. నన్నెందుకు టార్గెట్ చేస్తారు?" అని కొండా మురళి వ్యాఖ్యానించారు.

# మీడియా ముందుకెళ్లొద్దు.. కొండా సురేఖకు మీనాక్షి ఫోన్



హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండా సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో మాట్లాడారు. మీడియా ముందుకు వెళ్లవద్దని కొండా సురేఖకు ఆమె సూచించారు. కూర్చొని మాట్లాడదామని మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి ఇటీవల తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంటు కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో గట్టిగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లో కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. సురేఖ నివాసంలో ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారన్న సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో మీనాక్షి నటరాజన్ మాట్లాడినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో సమసిపోయేట్లు చూద్దామని ఆమె చెప్పినట్లు సమాచారం.

# 18న బీసీ బంద్‌లో పాల్గొంటాం.. బీఆర్ఎస్ బీసీ నేతలు



హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్ల సాధనకు మద్దతుగా ఈ నెల 18న బీసీ జేఏసీ చేపట్టబోయే బీసీ బంద్‌లో పాల్గొంటామని బీఆర్ఎస్ పార్టీకి చెందిన బీసీ నాయకులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో వీరు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ భవన్ నుంచే వెళ్లి బీసీ బంద్‌లో పాల్గొంటాం. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ డ్రామా చేయడానికి చూసింది. కానీ ఆ డ్రామా వర్కవుట్ కాలేదు. మేము అసెంబ్లీ లోనే చెప్పినం.. ప్రభుత్వం పై వ్యతిరేకత ఉందని. కుల గణన సరిగా జరగలేదు. కులగణన సర్వే పత్రంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటో పెట్టడం తప్పు అని వారు పేర్కొన్నారు.

గవర్నర్ వద్దకు తీర్మానం వెళ్ళక ముందే ఢిల్లీలో ధర్నా చేశారు. మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడా ధర్నాకు రాలేదు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి ఎంజాయ్ చేసి వచ్చారు. పార్టీల పరంగా ఎన్నికలకు వెళ్తామంటే తాము ఒప్పుకోమన్నారు. 42 శాతం రిజర్వేషన్ ఇచ్చాకనే ఎన్నికలకు వెళ్లాలి. చట్ట పరంగా షెడ్యూల్ 9 ప్రకారం ఎన్నికలకు పోవాలి. ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే తీవ్ర పరిమాణాలు ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు వారి వెంట పడుతూనే ఉంటాం. 17 నెలల నుంచి కాంగ్రెస్ నిద్ర పోయింది. చట్టమే లేనిది జడ్జిలు తీర్పు ఎలా ఇస్తారు. అందరూ ఈ నెల 18వ తేదీన న బంద్‌కు సహకరించాలి. ప్రతి బీసీ బిడ్డ బంద్‌లో పాల్గొనాలని తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

# నగరంలో రేవ్ పార్టీ.. భగ్నం చేసిన పోలీసులు

రంగారెడ్డి: మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో రేవ్ పార్టీ కలకలం రేపింది. లింగంపల్లి గ్రామంలోని ఓ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఫాం హౌస్‌పై పోలీసులు దాడి చేసి రేవ్‌పార్టీని భగ్నం చేశారు. రేవ్‌పార్టీలో 25 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 2 లక్షల 40 వేల నగదు, 15 మొబైల్ ఫోన్లు, 11 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రేవ్ పార్టీలో పాల్గొన్న వారిని మంచాల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే.. స్వాధీనం చేసుకున్న వాహనాలలో ఎమ్మెల్సీ వాహనం ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ స్టీకర్ ఉన్న వాహనాన్ని పోలీసులు కనపడకుండా దాచేస్తున్నారని వార్తలు పుట్టుకొస్తున్నాయి. అయితే వాహనంపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్టిక్కర్లు, వాహనం లోపల కండువాలు కూడా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ స్టిక్కర్ కనిపించకుండా వైట్ పేపర్‌ను పోలీసులు అతికించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీలో పాల్గొన్న వారిని పోలీసులు తప్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మధ్యకాలంలో హైదరాబాద్‌లో తరచూ రేవ్ పార్టీ ఉదంతాలు వెలుగులోకి వస్తోన్నాయి. తాజాగా మహేశ్వరం పరిధి గట్టుపల్లి శివారులోని కోర్పోలు చంద్రారెడ్డి రిసార్టులో మంగళవారం రాత్రి జరుగుతున్న రేవ్ పార్టీని ఎస్‌వోటీ బృందం, మహేశ్వరం పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. దీనిలో 72 మందిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. గాజుల రామారానికి చెందిన తిరుపతిరెడ్డి, రాక్ స్టార్ ఫెర్టిలైజర్స్ సైదారెడ్డి వివిధ ప్రాంతాలకు చెందిన డీలర్స్‌తో రేవ్ పార్టీ ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# అక్టోబర్ 17... జి.ఎస్.మేల్కోటే జయంతి




జి.ఎస్.మేల్కోటే, గా ప్రసిద్ధిచెందిన గోపాలయ్య సుబ్బుకృష్ణ మేల్కోటే సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడ, వైద్యులు, పరిపాలనా దక్షుడు. ఆయన సుబ్బుకృష్ణ దంపతులకు ఒడిషా రాష్ట్రంలోని బరంపురంలో 1901 అక్టోబరు 17 విజయ దశమి రోజున జన్మించాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎల్.ఎం.ఎస్ పరీక్షలో 1927లో మొదటి తరగతిలో మొదటి వారుగా ఉత్తీర్ణులై బంగారు పతకం అందుకున్నాడు. దేశీయ వైద్య విధానాన్ని, యోగాసనాల ప్రభావాన్ని జోడించి ఉత్తమ వైద్యులుగా ఖ్యాతి పొందాడు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హైదరాబాదు అధ్యక్షులుగా పనిచేశాడు. ఇతను పతంజలి యోగ పరిశోధనా కేంద్రాన్ని స్థాపించాడు. స్వతంత్ర భారతదేశంలో ఆయన ఎన్నో బాధ్యతాయుత పదవులు నిర్వహించాడు. హైదరాబాదు శాసనసభలో 1952 నుండి 1956 వరకు సభ్యులై మొదట ప్రజా పనుల శాఖలో తర్వాత ఆర్థిక శాఖలో మంత్రి పదవి నిర్వర్తించాడు. ఆయన ముషీరాబాదు నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో రాయచూరు లోకసభ నియోజకవర్గం నుండి తొలిసారిగా పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. 1962 నుండి 1977 వరకు భారత పార్లమెంటు సభ్యుడిగా హైదరాబాదు లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాడు. భారత ప్రభుత్వ ప్రతినిధిగా ఆగ్నేయాసియా ప్రాంతీయ ప్రపంచారోగ్య వ్యవస్థా మహాసభ, కామన్ వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ లలో పాల్గొన్నాడు. హైదరాబాదు లోని ఐ.ఎన్.టి.యు.సి. శాఖకు అధ్యక్షులుగా కొంతకాలం పనిచేశాడు. ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. 1916లో స్వదేశీ ఉద్యమంలో మొదటి సారిగా పాల్గొన్నాడు. ఉప్పు సత్యాగ్రహంలో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం వద్ద, కర్ణాటక రాష్ట్రంలోనూ ఉప్పు తయారుచేసి పోలీసులచే నిర్బంధితుడై హింసలకు గురయ్యాడు. కరాచీ కాంగ్రెస్ లో హైదరాబాదు ప్రతినిధిగా 1931 లో పాల్గొన్నాడు. హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ సభ్యుడై 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947, ఆగస్టు 15 న జాతీయ స్వాతంత్ర్యం సందర్భంగా భారత జాతీయ పతాకాన్ని హైదరాబాదులో ఎగుర వేయటకు ప్రయత్నించి నిజాం ప్రభుత్వం చేత జైల్లో నిర్బంధించబడ్డాడు. పోలీసు చర్య అనంతరం విడుదలయ్యాడు. ఆయన సతీమణి విమలాబాయి కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. వీరి మాతృభాష కన్నడం అయినా వీరు ఆంధ్ర దేశానికి చేసిన సేవ గణనీయం. మెల్కోటే 1982 మార్చి 10 వ తేదీన పరమ పదించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సత్యాన్వేషణే ఆయన ధర్మం ఁ చరిత్ర రచన ఆయన తపస్సు.

## అక్టోబర్ 17...ఆంధ్ర చరిత్ర చతురానన చిలుకూరి వీరభద్రరావు జయంతి



ఆంధ్రుల చరిత్రను శాస్త్రీయ పద్ధతిలో ఆవిష్కరించిన ప్రథమ చరిత్రకారుడు, నిర్భయ పత్రికా సంపాదకుడు, సమగ్ర రచయితగా ప్రసిద్ధి పొందిన చిలుకూరి వీరభద్రరావు తెలుగు జాతి ఆత్మగౌరవ చరిత్రలో ఒక శాశ్వత స్తంభం. ఆయన చరిత్ర పరిశోధన కేవలం శాస్త్రీయ కృషి మాత్రమే కాకుండా, ఒక జాతి ఆత్మను మేల్కొలిపిన పునాదిగా నిలిచింది. ఆంధ్రుల మూలాలు, సంస్కృతి, సాహిత్యం, రాజకీయం అన్నింటినీ సమగ్రంగా ఆవిష్కరించడానికి తన జీవితాన్ని అంకితం చేసినందుకే ఆయనను "ఆంధ్ర చరిత్ర చతురానన"గా గౌరవించారు. 1872 అక్టోబర్ 17న పశ్చిమ గోదావరి జిల్లాలోని రేలంగి గ్రామంలో ఒక పేద కుటుంబంలో జన్మించిన వీరభద్రరావు చిన్నతనం నుంచే అసాధారణ మేధస్సును ప్రదర్శించారు. ఆ కాలంలో ఇంగ్లిష్ విద్య ఒక కొత్త దారిని చూపిస్తున్నప్పుడు, ఆయన పాశ్చాత్య విద్యతో పాటు భారతీయ సంస్కృతిని గుండెల్లో దాచుకున్నారు. విద్యార్జనతో పాటు ఆయనలో దేశభక్తి భావం మేల్కొంది. కష్టసాధ్యమైన పరిస్థితుల్లోనూ విద్యపై అపారమైన ఆసక్తితో సంస్కృతం, ఆంధ్ర భాషల్లో ప్రావీణ్యం సాధించారు. ఆయన విద్యార్జన కేవలం పుస్తక పరిధిలో మాత్రమే కాకుండా చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించి అర్థం చేసుకునే లోతైన జ్ఞానాన్వేషణగా మారింది. వీరభద్రరావు వృత్తి ప్రారంభం పత్రికా సంపాదకత్వంలో జరిగింది. ఆ కాలంలో పత్రికలు ప్రజల్లో చైతన్యం కలిగించడంలో ప్రధాన పాత్ర పోషించేవి. ఆయన పనిచేసిన దేశోపకారి, ఆంధ్ర దేశాభిమాని, విబుధ రంజని, ఆంధ్రకేసరి, సత్యవాది వంటి పత్రికలు జాతీయోద్యమానికి, ఆత్మగౌరవ ఉద్యమానికి వేదికలుగా నిలిచాయి. ఆయన రచనలు నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఉండేవి. ఏదైనా సామాజిక అన్యాయం, రాజకీయ మోసం, విద్యా వెనుకబాటు గమనించినప్పుడు ఆయన కలం ధర్మ యోధునిలా స్పందించేది. ఆ కాలంలో తెలుగునాట పత్రికా సంపాదకత్వం అంటే కేవలం వ్యాసరచన కాదు ఁ ప్రజా చైతన్యానికి దిశానిర్దేశం. ఆ పాత్రను ఆయన అత్యంత సమర్థంగా నిర్వర్తించారు. అయితే ఆయన ఖ్యాతికి మూలం పత్రికా రంగం కాక, చరిత్ర పరిశోధనే. ఆంధ్రుల చరిత్ర రచనకు ఆయన చేసిన కృషి అసమానము. 1909 నుండి 1912 వరకు మద్రాసు (చెన్నై)లో నివసిస్తూ ఆయన ఐదు సంపుటాల ఆంధ్రుల చరిత్ర గ్రంథాన్ని రచించారు. విజ్ఞాన చంద్రికా మండలి ప్రచురించిన ఈ గ్రంథాలు తెలుగువారి జాతీయ చైతన్యానికి మూల స్తంభాలయ్యాయి. చరిత్రను కేవలం వృత్తాంతాల సమాహారంగా కాకుండా, ఆంధ్రుల ఆవిర్భావం, వలసలు, రాజకీయ వ్యవస్థ, సంస్కృతి, భాష, సాహిత్యం, సామాజిక నిర్మాణం వంటి అన్ని కోణాల నుండి విశ్లేషించిన ఆయన కృషి ఆధునిక చరిత్రా రచనకు మార్గదర్శకం అయింది. ఆయన పరిశోధనా వైఖరి పూర్తిగా స్వతంత్రంగా ఉండేది. నిజాన్ని నిర్భయంగా చెప్పడం ఆయన ధర్మంగా భావించేవారు. తన సిద్ధాంతాలను నిరూపించడానికి ఆరోగ్యం, ఆస్తి, సమాజ ఒత్తిడిని కూడా లెక్క చేయకుండా పరిశోధనలో తలమునకలయ్యారు. "సత్యమే సత్పరిశోధన లక్షణం" అనే నమ్మకంతో ఏ మూలాధారాన్నీ అనవసరంగా తిరస్కరించకుండా శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేశారు. ఆంధ్రుల చరిత్ర ప్రచురణ అనంతరం ఆయన సిద్ధాంతాలు విస్తృత చర్చలకు దారితీశాయి. ఆ కాలంలో చరిత్రా గ్రంథాల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆయన పద్ధతి కొత్తదిగా, కొందరికి వివాదాస్పదంగా అనిపించింది. కొంతమంది పండితులు ఆయన నిర్ధారణలపై విమర్శలు చేశారుబీ కొంతమంది పుస్తక రూపంలో ప్రతివాదాలు కూడా రాశారు. అయినప్పటికీ, ఆంధ్ర చరిత్రను శాస్త్రీయ పద్ధతిలో స్థాపించడానికి మొదటి అడుగు ఆయనదే. అందుకే 1928లో నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన ఆయనను "ఆంధ్ర చరిత్ర చతురానన" అనే బిరుదుతో సత్కరించారు. ఈ బిరుదు ఆయన కీర్తికి మకుటం ధరింప చేసినట్లయింది. వీరభద్రరావు రచనా ప్రస్థానం విస్తృతమైనది. ఆంధ్రుల చరిత్రతో పాటు ఆయన రాజమహేంద్రపుర చరిత్రము, జీర్ణ కర్ణాట రాజ్య చరిత్రము, తిక్కన సోమయాజి, తిమ్మరుసు మంత్రి, శ్రీనాథ కవి, శివాజీ చరిత్ర, వరలక్ష్మీ విలాసము, హిందూ సంసారము వంటి అనేక గ్రంథాలను రచించారు. ఆయన రచనలు వాస్తవాధారితమైనవి, చరిత్రలో వ్యక్తుల ప్రాముఖ్యతను నిష్పాక్షికంగా చిత్రించినవి. ఆయన చరిత్రను కేవలం రాజుల వృత్తాంతంగా కాకుండా ప్రజల జీవన స్రవంతిగా చూపారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రసంగాలు, వ్యాసాలు, పాఠశాలల్లో సదస్సులు నిర్వహించారు. ఆయన ప్రేరణతో అనేక గ్రామాల్లో విద్యా కేంద్రాలు, గ్రంథాలయాలు స్థాపించ బడ్డాయి. ఆయన సాహిత్య విమర్శకుడిగానూ పేరుపొందారు. కట్టమంచి రామలింగారెడ్డి వంటి ప్రముఖ విమర్శకులు వీరభద్రరావు గారి విమర్శన దృష్టిని ప్రశంసించారు. ఆయన వాక్యనిర్మాణం, భాషా పటిమ, విశ్లేషణా గాంభీర్యం తెలుగు శాస్త్రీయ రచనలో ఒక కొత్త దారిని చూపించాయి. వీరభద్రరావు అధికార, పదవుల పట్ల అసక్తి చూపలేదు. తన కృషి విలువను కాలం గుర్తించక పోయినా, సత్యాన్వేషణలో తగ్గలేదు. పేదరికం, అనారోగ్యం, విమర్శలు ఆయనను కదిలించలేక పోయాయి. ఆయన జీవితం ఒక యజ్ఞం ఁ ఆంధ్రుల చరిత్ర యజ్ఞం. 1939లో ఆయన కన్ను మూశారు. కానీ ఆయన సృష్టించిన ఆంధ్రుల చరిత్ర గ్రంథం ఆంధ్ర భూమికి శాశ్వత వారసత్వంగా నిలిచింది. చిలుకూరి వీరభద్రరావు కృషి తరం తరాలకు ఆదర్శంగా నిలిచింది. విద్య, చైతన్యం, దేశభక్తి అనే మూడు స్తంభాలపై ఆయన జీవితం నిర్మించ బడింది. ఆంధ్ర చరిత్ర ఉన్నంతకాలం చిలుకూరి వీరభద్రరావు పేరు నిలిచి ఉంటుంది. ఆయన పరిశోధనా పద్ధతి, రచనా ధోరణి, జ్ఞాన నిబద్ధత ఇవన్నీ నేటి చరిత్రకారులకు మార్గదర్శకంగా, ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆంధ్రుల ఆత్మగౌరవ గాథకు ప్రాణం పోసిన చరిత్రకారుడు చిలుకూరి వీరభద్రరావే.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**

# ట్రంప్ ఇమిగ్రేషన్ పాలసీ.. భారీగా తగ్గిన భారత విద్యార్థి వీసాలు

మాస్ డిపోర్టేషన్స్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు . అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నతవిద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది. ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది. సాధారణంగా యూఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్ర దేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు.. చైనా విద్యార్థులకు యూఎస్ 86,647 వీసాలు జారీ చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్య కంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం. ఈ ఏడాది మేలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగును తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వెట్టింగ్ కోసం వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే తర్వాత వీసా ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపిస్తున్నాయి.

# అమెరికా - చైనా: ప్రపంచం ఎటుపోతోంది?



ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రశక్తులైన అమెరికా – చైనా మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధం ఇప్పుడు ఒక కీలక మలుపు తీసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లతో మొదలైన ఈ ఉద్రిక్తతలు, కేవలం రెండు దేశాలకే కాకుండా, ప్రపంచ ఆర్థిక సమతౌల్యాన్ని పూర్తిగా కుదిపేసే ప్రమాదంలో పడేస్తున్నాయి.

**వాణిజ్య యుద్ధం కొత్త దశలోకి...** చైనా ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌లు విధించడం, దానికి ప్రతీకారంగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు పెంచడం ఒక పాత కథ. కానీ, తాజాగా బీజింగ్ తీసుకున్న నిర్ణయం ఈ యుద్ధాన్ని మరింత తీవ్రం చేసింది. అమెరికా యాజమాన్యంలోని లేదా యూఎస్ జెండాలతో వచ్చే నౌకలపై ప్రత్యేక ఛార్జీలు వసూలు చేయనున్నట్లు చైనా ప్రకటించింది. అయితే, చైనాలో తయారైన నౌకలకు ఈ ఫీజుల నుంచి మినహాయింపు ఇవ్వడం గమనార్హం.

దీనికి ప్రతిగా అమెరికా కూడా చైనా నౌకలపై ఇలాంటి ఛార్జీల వసూళ్లను ప్రారంభించింది. సముద్ర మార్గాల్లో రవాణాపై కూడా ఈ ఉద్రిక్తతలు ప్రభావం చూపడం, గ్లోబల్ సప్లై చైన్ (సరఫరా గొలుసు)పై మరింత ఒత్తిడిని పెంచుతుంది.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం...** ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ఇలా పరస్పరం టారిఫ్‌లు, ఛార్జీలు విధించుకోవడం వల్ల ప్రభావం ఈ రెండు దేశాలకే పరిమితం కాదు. దిగుమతులపై పన్నులు (టారిఫ్‌లు) పెరగడం వల్ల ఆయా ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఇది అంతిమంగా వినియోగదారులపై భారాన్ని మోపుతుంది, ద్రవ్యోల్బణం పెరగడానికి దారితీస్తుంది. సరఫరా గొలుసుల అంతరాయం: నౌకలపై ఛార్జీలు పెరగడం,దిగుమతులు కష్టమవడం వల్ల అంతర్జాతీయంగా వస్తువుల సరఫరా గొలుసులు దెబ్బతింటాయి. ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఈ అస్థిరత కారణంగా మార్కెట్లపై నమ్మకం కోల్పోయి, తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవచ్చు. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఇంధన ధరలు, ముడిసరుకుల వ్యయం పెరగడం వల్ల తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది.

**ఆర్థిక సంక్షోభం అంచున ప్రపంచం?...** సాధారణంగా వాణిజ్యం అనేది పరస్పర లాభాల కోసం, ఆర్థిక వృద్ధి కోసం పనిచేయాలి. కానీ, అమెరికా–చైనా మధ్య ఇది రాజకీయ ఆయుధంగా మారుతోంది. ఈ పోరాటం ఆర్థికపరమైన ఉపద్రవాలకు దారితీయవచ్చునని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ప్రపంచం మళ్లీ ఆర్థిక అస్థిరత వైపు పయనిస్తోంది....** ఈ రెండు అగ్రరాజ్యాలు తమ వాణిజ్య విధానాలతో ఒకదానినొకటి దెబ్బతీసుకునే ప్రక్రియలో, అంతిమంగా నష్టపోయేది ప్రపంచమే. అమెరికా–చైనా వాణిజ్య యుద్ధంలో ఏ దేశం గెలిచినా, ఓడిపోయేది మాత్రం మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే అనేది ప్రస్తుత పరిస్థితులను బట్టి చెప్పవచ్చు. ప్రపంచం గ్లోబలైజేషన్ నుంచి పరిరక్షణాత్మకత వైపు మళ్లుతోంది, ఇది భవిష్యత్తులో తీవ్ర ఆర్థిక సంక్షోభాలకు దారితీసే అవకాశం ఉంది.

# మనిషి ఆయుష్షు 150 ఏళ్లు.. విటాలీ ఆసక్తికర వ్యాఖ్యలు..

ప్రపంచంతో పోలిస్తే భారతీయుల ఆయుర్దాయం కేవలం 60 సంవత్సరాలు మాత్రమే.. మన పూర్వీకులు (పురాన గాథలను పక్కన పెడితే) ఎక్కువగా 100 ఏళ్లు.. కొందరు 120 సంవత్సరాలు బతికారు. కానీ నేడు ఆయుర్దాయం రోజు రోజుకు తగ్గుతుంది. ఒకప్పుడు 100 ఏళ్లు జీవించడం ఒక అద్భుతం.

ఇప్పుడు 150 ఏళ్లు జీవించగలమనే ఆలోచన పరిశోధనల వేదికపై నిలుస్తోంది. రష్యా శాస్త్రవేత్త విటాలీ కొవల్యోవ్ ఇటీవల మాట్లాడుతూ '150 ఏళ్లు బతకడం ఇక ఊహ కాదు' అన్నమాట ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని కనబరిచింది. '150 ఏళ్లు జీవించబోయేవారు ఇప్పటికే పుట్టి ఉన్నారు. వారికి ఇప్పుడు 20 లేదా 30 ఏళ్లు ఉండొచ్చు.' అంటూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం ఒక శాస్త్రీయ ప్రకటన కాదు.. ఇది మానవ చరిత్రలోని ఒక లోతైన ఆకాంక్ష. మరణం నుంచి విముక్తి పొందాలనే మానవ ప్రయత్నం ప్రయోగశాలల గోడల మధ్య జరుగుతోంది.




**విటాలీ కొవల్యోవ్ ఆసక్తికర వ్యాఖ్యలు..** విటాలీ కొవల్యోవ్ వోల్గోగ్రాడ్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త. ఆయన 'వృద్ధాప్యం వెనక్కి తిరగలేని ప్రక్రియ' అనే సంప్రదాయ భావనను సవాల్ చేస్తున్నారు. అతని ప్రకారం.. మానవ కణాల పునరుత్పత్తి సామర్థ్యం, డీఎన్ఏ రిపేర్ మెకానిజం, టెలోమియర్ పొడవు నియంత్రణ వంటి అంశాలను శాస్త్రం ఇప్పుడు అర్థం చేసుకుంటోంది. ప్రయోగశాలల్లో సెల్ రీజెనరేషన్, యాంటీ ఏజింగ్ మాలిక్యూల్స్, జన్యు మార్పుల ఆధారంగా మన శరీర వృద్ధాప్యం నెమ్మదిగా తిప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో కొత్త బయో–ఇంజినీరింగ్ సాంకేతికతలు, 'లాంగివిటీ ఫార్ములాస్', నానోమెడిసిన్ అనే రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

**150 ఏళ్ల జీవితం విజయమా?...** 150 ఏళ్లు జీవించడమనే భావన కేవలం వైద్య శాస్త్ర ప్రకారం.. విజయమే కాదు.. అది సమాజం పట్ల దృక్పథం మారిపోయే అంశం. ఒక వ్యక్తి 150 ఏళ్లు జీవిస్తే ఉద్యోగాలు, పింఛన్లు, కుటుంబ సంబంధాలు, జనాభా సవాళ్లు, వనరుల వినియోగం అన్నీ పూర్తిగా మారిపోతాయి. ఇది మానవ చరిత్రలో ఒక జీవన విప్లవం. వయస్సు పెరగడం అంటే జ్ఞానం పెరగడం అన్న భావన ఉన్నప్పటికీ, దీర్ఘాయువు సమాజంపై మిశ్రమ ప్రభావాన్ని చూపిస్తోంది. ఎక్కువ మంది ఎక్కువ కాలం జీవిస్తే, జనాభా సమతుల్యత, ఆర్థిక స్థిరత్వం, పర్యావరణ వనరుల వినియోగంపై ఒత్తిడి పెరుగుతుంది. శాస్త్రం మన జీవన ప్రమాణాన్ని పొడిగించగలదేమో కానీ, విలువలను పొడిగించగలదా..? అనేది ఇప్పుడు కొందరికి కలుగుతున్న ప్రశ్న.

# నాలుగు రోజుల వర్క్ వీక్.. ప్రతిపాదించిన ఫిన్ ల్యాండ్ ప్రధాని.. ఉద్యోగుల్లో హర్షం..

ప్రపంచం వేగంగా పరుగెడుతోంది. టెక్నాలజీ, గ్లోబలైజేషన్, కాంపిటిషన్ ఇవన్నీ మన జీవితాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేశాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం ఎప్పుడూ కలుగుతూనే ఉంటుంది.. మనం పని కోసం జీవిస్తున్నామా..? లేక జీవించడానికి పని చేస్తున్నామా..? దీనికి ఫిన్‌లాండ్ మాజీ ప్రధాని వద్ద సరైన జవాబు ఉందట. అది ఆమె తీసుకురాబోతున్న సాహసోపేత ప్రతిపాదన 'వారానికి 4 రోజుల మాత్రమే పని చేయాలి, రోజుకు 6 గంటలు చాలు' అని. 'ప్రతి ఒక్కరూ కుటుంబంతో సంతోషకరమైన సమయాన్ని గడపాలి.. పని జీవితంలో ఒక భాగం కావాలి కానీ.. అదే జీవితం కాదు.' అన్నారు. ఆమె ఆలోచనలు ఉద్యోగ నియమాల్లో మార్పు కాదు.. అది జీవన విలువల్లో విప్లవంగా చూడాలి.

**ఫోర్ డేస్ వర్క్ వీక్ తో లాభమా..? నష్టమా..?...** భారత్ తో పాటు చాలా దేశాల్లో వీకెండ్ (కొన్ని ఆఫీసులకు మాత్రమే) అంటూ రెండు రోజుల సమయం కేటాయిస్తున్నారు. ప్రపంచంలో చాలా మంది నాయకులు 'తక్కువ పని అంటే తక్కువ ఉత్పాదకత' అని భావిస్తారు. కానీ ఫిన్‌లాండ్ ప్రతిపాదన దానికి విరుద్ధం. తక్కువ పని రోజులు ఉన్న దేశాల్లో ఉద్యోగులు ఎక్కువ ఉత్సాహంగా, సృజనాత్మకంగా పనిచేస్తారని తేలింది. ఉదాహరణకు, స్వీడన్‌లో ఒక కంపెనీ 6 గంటల




వర్క్‌డే ప్రయోగం చేసింది. ఫలితం? ఉద్యోగుల ఉత్సాహం 20 శాతం పెరిగింది, సిక్ లీవులు తగ్గాయి, పని నాణ్యత గణనీయంగా మెరుగుపడింది. ఫిన్‌లాండ్ ప్రధాని ఆ భావనను సామాజిక స్థాయికి తీసుకువెళ్లారు 'ప్రజలు సంతోషంగా ఉంటే, దేశం సమృద్ధిగా ఉంటుంది.' అని ఆమె అన్నారు.

**వర్క్ అండ్ లైఫ్ సమతుల్యత...** ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులు 'వర్క్–లైఫ్ బ్యాలెన్స్' కోసం పోరాటం చేస్తున్నారనే చెప్పాలి. ముఖ్యంగా ఇండియాలో ఇది ఎక్కువ. కరోనా మహమ్మారి తర్వాత రిమోట్ వర్క్, ఫ్లెక్సిబుల్ హవర్స్ వంటి పద్ధతులు కొత్త సాధనంగా మారాయి. కానీ ఇంకా చాలా సంస్థల్లో ఉద్యోగులు సమయానికి మించి పని చేయడం, ఒత్తిడి, మానసిక అలసటతో బాధపడుతున్నారు. నాలుగు రోజుల వర్క్ వీక్ ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపవచ్చు. ఇది కేవలం ఆర్థిక లాభం కాదు.. అది మానసిక ఆరోగ్యం, కుటుంబ బంధాలు, వ్యక్తి గత సంతోషంను కాపాడే మార్గం.

**భారత్ కు సాధ్యమా?....** భారత్ వంటి దేశంలో ఈ విధానం తక్షణం అమలు చేయడం కష్టమైనదే. దేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా సేవల, పరిశ్రమల, కార్మిక ఆధారిత రంగాలపై ఆధారపడి ఉంది. కానీ టెక్ సెక్టార్, ఐటీ, క్రియేటివ్ ఇండస్ట్రీలు వంటి రంగాల్లో ఇది సాధ్యమే. ఉదాహరణకు, కొన్ని భారత కంపెనీలు ఇప్పటికే 4 రోజుల వర్క్ వీక్ ప్రయోగాలు ప్రారంభించాయి. ఫలితాలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. ఫిన్‌లాండ్ వరుసగా ఐదేళ్లుగా 'ప్రపంచంలోని అత్యంత సంతోష దేశం'గా నిలుస్తోంది. దీనికి కారణం కేవలం ఆర్థికాభివృద్ధి కాదు.. అక్కడి ప్రజల జీవన నాణ్యత, మానసిక ఆరోగ్యం, సమానత్వంపై దృష్టి పెడతాయి.ఫిన్‌లాండ్ ప్రధాని ప్రతిపాదన అదే దిశలో ఒక కొత్త అడుగు. ఆమె చెప్పిన 'సంతోషం కూడా ఒక ప్రొడక్షనే' అన్న మాట ఇప్పుడు ప్రపంచానికి మార్గదర్శనం అవుతోంది.

చురకలు



చురకలు

## సంపాదకీయం

# పహల్గామ్ తరహా మరో దాడికి పాక్ కుట్ర?

జాతీయ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఇండియన్ ఆర్మీ తక్షణ చర్యలకు సిద్ధంగా ఉందని పశ్చిమ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ స్పష్టం చేశారు. పహల్గామ్‌లోని ఘోర ఉగ్రదాడికి సమానం అయిన మరో దాడికి పాకిస్థాన్ వల్ల అవకాశముందని ఆయన హెచ్చరించారు. ఇలాంటి దూశ్చర్యానికి ఎదురుగా స్థిరమైన, మరింత శక్తివంతమైన ప్రతీకారం అందిస్తామని, అవసరమైతే 'ఆపరేషన్ సిందూర్ 2.0'ను అమలు చేసే విషయంలో భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. లెఫ్టినెంట్ జనరల్ కటియార్ మాట్లాడుతూ.. పాకిస్థాన్ సంబంధిత కదలికలన్నింటిపై భారత సైన్యం నిఘా వేస్తున్నదని.. వీలైనంత వరకు శత్రువు ఉగ్రకార్యకలాపాలను నిరోధిస్తామని చెప్పారు. అయితే పాకిస్థాన్ స్వార్థ ప్రయోజనాల కోసం ఘర్షణలను కొనసాగించాలని కోరుకుంటున్నప్పుడే.. మరో సారికి దూశ్చర్య చేస్తే భారత సైన్యం మరింత గట్టి సమాధానం ఇవ్వాల్సి వచ్చే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.


**ఆపరేషన్ 'సిందూర్' ఎ ఇంకా ముగియలేదు**... లెఫ్టినెంట్ జనరల్ కటియార్ గుర్తు చేస్తూ.. పహల్గామ్ దాడి తర్వాత ప్రారంభించిన భారీ కౌంటర్–టెర్రర్ చర్యైన 'ఆపరేషన్ సిందూర్' పూర్తికాలేదని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ప్రధానంగా నియంత్రణ రేఖ వెంబడి చొరబడే ఉగ్రవాది బృందాలపై దాడులు చేయడం, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడం మొదలైన వాటిని లక్ష్యంగా పెట్టుకుంది. పాకిస్తాన్‌కి తగిన సమాధానం వచ్చింది అయినప్పటికీ, శత్రువు మార్గం మార్చకపోవడం వల్ల అవసరమైతే చర్యలు కొనసాగతామని తెలిపారు.

**వరుసగా భారత ఆర్మీ అధికారుల హెచ్చరికలు...** ఈ నెల ప్రారంభంలోనే భారత వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏ.పి. సింగ్ ఒక కీలక ప్రకటన ద్వారా ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత చర్యలలో కనీసం 11 పాకిస్థానీ సైనిక విమానాలు ధ్వంసమయ్యాయని, అలాగే పాకిస్థాన్ సైనిక మౌలిక సదుపాయాలకు భారీ నాశనం కలిగిందని వెల్లడించారు. తాము ఎదుర్కొంటున్న నష్టాలపై ఇస్లామాబాదు చేస్తున్న వాదనలు 'కల్పిత కథలు' మాత్రమేనని ఆయన చెప్పినట్లు చర్యల యొక్క పరిమాణాన్ని భారత అధికారులు ప్రకటించారు. ప్రకటనలో హ్యాంగర్లు, రాడార్ వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్స్, రన్‌వేలు వంటి ప్రత్యేక సదుపాయాలను భారత్ ధ్వంసం చేసిందన్నారు.

**సరిహద్దు విజ్రంభణల్లో ప్రభుత్వ– సైనిక సిద్ధత...** లెఫ్టినెంట్ జనరల్ కటియార్ స్పష్టీకరించినట్టుగా, భారత సైన్యం పూర్తిచేయదగ్గంత స్థాయిలో సన్నద్ధతతో ఉంది. పాకిస్థాన్‌పై గట్టి ప్రతిస్పందన అవసరమైతే దానిని అవసరం మేరకు అమలు చెయ్యాలని ఆయన అంటున్నారు. పశ్చిమ సరిహద్దులపై ఉన్న శాంతి, హింస నివారణం కోసం కొనసాగుతున్న నిఘాకృషి, సంబంధిత నిఘా కార్యాచరణలని భారత కమాండ్ అధికారులు మరింత బలోపేతం చేయనున్నారు.

**ఏది మారినా అపసంభావ్యత...** పహల్గామ్ దాడి వంటి ఘోర సంఘటనలు దేశీయ భావోద్వేగాలకు తోడ్పడతాయి. అదే సమయంలో రక్షణ వ్యవస్థల చురుకుదనం, ప్రతిస్పందన సామర్థ్యం మీద కూడా ప్రశ్నలుంటాయి. అయితే అధికారి వ్యాఖ్యలు, ఆపరేషన్ సిందూర్ వంటి కార్యాచరణలు శాంతి స్థితిని బలోపేతం చేయడానికి కాకుండా ప్రతికూల ఫలితాలకూ దారితీసే ప్రమాదం ఉన్నప్పటికీ.. సరిహద్దుల దగ్గర జరిగిన లేదా జరగబోయే పరిస్థితులపై ప్రభుత్వ నిశ్చిత నిర్ణయమే తాత్కాలికంగా కీలకంగా ఉంటాయి. లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ ఇచ్చిన తాజా హెచ్చరికలు దేశీయ ప్రజలకు ఎ సైన్యం ప్రతిస్పందించడానికి సిద్ధంగా ఉందని, ప్రభుత్వాలు కూడా సజాగ్రతతో నిర్ణయాలు తీసుకుంటున్నాయని ఒక సంకేతాన్ని పంపుతున్నాయి. అదే సమయంలో ప్రాంతీయ విజృంభణలకు అంతర్జాతీయ సానుకూల చర్యల అవసరమని ఈ సందర్భంలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. భద్రతా అంశాలపై అధికారుల వ్యాఖ్యలు ప్రజలలో ఆందోళన కలగజేసినప్పటికీ, ప్రధాని కేంద్రం, రాష్ట్ర అధికారులతో కలిసి సరిహద్దు పరిస్థితులు, సైన్య స్పందనలు, డిప్లొమటిక్ చానల్స్ ద్వారా ఒత్తిడి తగ్గింపుపై చెప్పుకున్న చర్యలపై కూడా దారి చూపాల్సి ఉంటుంది. ప్రజల శాంతి, భద్రత ప్రాధాన్యం మరింత సమన్వయం, పారదర్శకతతోనే సాధ్యమవుతుంది.

# అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్ - అక్టోబర్ 17...షోయబ్ ఉల్లాఖాన్ జన్మదినం




పెన్నును గన్నుగా మార్చి, అక్షరాలను బుల్లెట్లుగా ప్రయోగించి, నాటి నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా రాజీలేని రచనలతో నిజాం ప్రభుత్వానికి నిద్దుర పట్టనీయకుండా వణికించిన షోయబ్ ఉల్లా ఖాన్ అక్షర వీరుడు. ప్రజల కోసం కలం పట్టి ప్రాణాలను తృణప్రాయంగా వదలిన ధీరుడు. పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన నిజాయితీ పరుడు. తన రచనలతో తెలంగాణ పాత్రికేయ చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కలం యోధుడు. లక్ష్య సాధనలో ప్రాణ త్యాగం చేసిన అమరుడు. నిఖార్సైన వాడి వేడితో కూడిన తన రచనల ద్వారా నిజాం ప్రభుత్వ విధానాలను, రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన నిబద్ధత కలిగిన పాత్రికేయుడు. తన స్వేచ్ఛా రచన జీవితానికి చరమగీతం పాడుతుందని తెలిసినా వెనుకంజ వేయని మేరు నగ ధీరుడు. అపూర్వ త్యాగ ధనుడు. షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17 న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో జన్మించాడు. తండ్రి హబీబుల్లా ఖాన్. తల్లి లాయహున్నీసా బేగం. వారి కుటుంబం ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. షోయబ్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి బిఎ, జర్నలిజం డిగ్రీ పూర్తి చేశాడు. బొంబాయిలో ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్ష కూడా ఉత్తీర్ణుడైనాడు. తన కుమారునిలో గాంధీ మహాత్ముని పోలికలున్నాయని భావించి హబీబుల్లాఖాన్... 'షోయబుల్లా గాంధీ' అని ముద్దుగా పిలుచుకునే వాడు. గాంధీ లాగానే షోయబ్ కూడా తాను నమ్మిన మార్గంలో ప్రయాణించడంలో నిబద్ధతను, మొండితనాన్ని ప్రదర్శించాడు. తెలంగాణ అగ్నిగోళంలా మండుతున్న కాలమది. నిరంకుశ పాలన, దోపిడీ, దౌర్జన్యాలు సాగదంటూ సామాన్యుడు సమరం సాగిస్తున్న సమయమది. అది పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న కాలం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని గడ్డుకాలం. ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రజాస్వామ్య కాంక్షతో దుర్మార్గ పాలనను ఎదురించే చైతన్యంతో క్యాంపస్ నుంచి షోయబుల్లా ఖాన్ బయట కొచ్చాడు. సమ సమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపన బలంగా ఉన్న షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచు కున్నాడు. చిత్తశుద్ధి, అంకితభావం, నిబద్ధత కలిగిన జర్నలిస్ట్ గా జీవితం ప్రారంభించాడు. మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాదకుడిగా చేరాడు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, ఆయన తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచ కాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను సంధించాడు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు. కణకణ మండుతున్న నిప్పుకణికల్లాంటి షోయబుల్లాఖాన్ అక్షరాలకు ప్రచురణ అవకాశం అప్పటికే ముందుముల నర్సింగ రావు నిర్వహణ లోని రయ్యత్ పత్రిక కల్పించింది. ఆయన స్వతంత్ర భావ ప్రకటనలకు ఆ పత్రిక వేదిక అయింది. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను మూసి వేయించింది. నిజాం దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సొంత పత్రిక ఉంటేనే మంచిదను కున్నాడు షోయబుల్లా ఖాన్. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు సహాయంతో భార్య, తల్లి నగలను అమ్మి ఇమ్రోజ్ ను స్థాపించాడు. 1947 నవంబర్ 17న మొదటి సంచిక వెలువడింది. బూర్గుల రామకృష్ణారావు ఇంట్లో ఇమ్రోజ్ ఆఫీస్ ఉండేది. ఉర్దూలో ఇమ్రోజ్ అంటే ఈ రోజు. పాలక వర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడు. 'ఇమ్రోజ్' దిన పత్రిక తొలి సంచిక 1947 నవంబరు 17 వ తేదీన వెలువ డింది. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాశాడు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరి అని పేర్కొన్నాడు. పదునైన విమర్శనాస్త్రాలు సంధించాడు. ఎక్కడ ఏ మూలన నిజాం ఏలుబడిలో ఆగడాలు చెలరేగుతున్నా, ఎక్కడ ఆర్మీ క్యాంప్స్ ఉన్నా వాటి గురించి నిర్భయంగా రాసేవాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావాల్సిందేనని తన రాతలతో స్పష్టం చేసేవాడు. నిజాంకు వ్యతిరేకంగా ఉన్న ముస్లిం విద్యావంతుల అభిప్రాయాలను ప్రచురించే వాడు. నిజాం మొండితనానికి, రజాకార్ల ఉన్మాదానికి ఎక్కువ బలవుతోంది పేద ముస్లిం కుటుంబాలు, యువకులేనని ఎన్నో సార్లు ఆవేదన చెందాడు. రచనల ద్వారా బహిర్గతం చేశాడు. కమ్యూనిస్టులు, ఆర్యసమాజ్ వారు, విద్యార్థులు, యూత్ లీగ్ ఎవరు పోరాటాలు చేసినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్తలన్నీ ప్రముఖంగా ప్రచురించాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావడమనేది షోయబుల్లా ఖాన్ కల. లక్ష్యం. దాని కోసం ఆత్మార్పణ కైనా సిద్ద పడ్డాడు. నడి రోడ్డు మీద ప్రాణాలను బలి పెట్టాడు. రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ 1948 ఆగష్టు 19 సభలో షోయబ్ చేతులు నరికి వేస్తామని బహిరంగం గానే హెచ్చరించాడు. 1948 అగష్టు 21న.. కాచిగూడ లోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఇమ్రోజ్ ఆఫీసులో పని పూర్తి చేసుకుని అర్ధ రాత్రి బావమరిది ఇస్మాయిల్ ఖాన్ తో కలిసి ఇంటికి బయలు దేరిన షోయబుల్లాను ఒక్కసారిగా పదిమంది దుండగులు చుట్టుముట్టి ఆయన వార్తలు రాసే కుడి అర చేతిని ముష్కరులు నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. అడ్డుకో బోయిన ఇస్మాయిల్ నూ తీవ్రంగా గాయ పరిచి గానీ వదల్లేదు. నెత్తిటి మడుగులో కొట్టుమిట్టాడిన షోయబుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా 1948 ఆగస్టు 22 న తెల్లవారు జామున షోయబ్ తుది శ్వాస విడిచాడు. నిజాం సర్కార్ షోయబ్ అంతిమ యాత్రను నిషేధించింది. అంతిమ యాత్ర పోలీసు బందూకుల మధ్య జరిగింది. గోషామహల్ మాలకుంట శ్మశాన వాటికలో ఆయన ఖననం జరిగింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దారిద్ర్య నిర్మూలనలో పాలకుల వైఫల్యాలు - అక్టోబర్ 17...అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం

పేదరిక నిర్మూలన పేరిట ప్రత్యేకంగా ఏటా ఓ రోజును కేటాయించి జరుపుకొంటూనే ఉన్నాం. అదే అక్టోబర్ 17 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం. 'అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం' ప్రతి ఏటా అక్టోబర్ 17న నిర్వహించ బడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులను అర్థం చేసుకుని, పేదరిక నిర్మూలన కోసం కృషి చేసేందుకు ఐక్యరాజ్య సమితి 1990 అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని అధికారికంగా ప్రకటించింది. హింసకు అత్యంత హీనరూపం పేదరికం అనేది మహాత్మాగాంధీ మాట. దారిద్ర్యం ఒక సామాజిక, ఆర్థిక సమస్య. ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా ఉంది. సమాజంలో ఒక వర్గం కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికం లేదా దారిద్ర్యం అంటారు. పేదరికంతో బాధపడుతున్న వారిని "పేదలు" అంటారు. పేదలకు ప్రధాన ఆదాయ వనరు ఉపాధి. కాబట్టి, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సరైన ఉపాధి అవ కాశాలు లేని ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కష్టమైన పని. పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారు తున్నాయి". ప్రజల చేతుల్లో డబ్బు ఉన్నంత మాత్రాన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినట్లు కాదు, వారికి విద్య, వైద్యం, రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలి. అవన్నీ లేవంటే సమగ్ర అభివృద్ధి జరగడం లేదని భావించాలి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్నది ఒకటి. కానీ, ఆ గడువు పూర్తయ్యే నాటికి కూడా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు "పేదలకు బాగానే అందు తున్నాయి. కానీ, నిరుపేదలకు అందడం లేదు". కొందరి గుప్పిట్లోనే సంపద 'దారిద్యానికి అంతం పలికి సంపదను సమానంగా పంపిణీ చేద్దాం' పేరిట ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ఆసక్తికర అంశాలను వెల్లడించింది.101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్లలోపువారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకుపోయి ఉన్నారు. 1990 నుంచి 2015 వరకు ప్రపంచంలో అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (రోజుకు 1.90




డాలర్లు (దాదాపు రూ.135) లేదా అంతకంటే తక్కువ ఆదాయం) వారి సంఖ్య 190 కోట్ల నుంచి 73.5 కోట్లకు తగ్గింది. అంటే, 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే, 2015 నాటికి అది 10 శాతానికి తగ్గింది. 2015 నాటికి అసమానతల వల్ల వృద్ధిలో వెనకబాటు, దారిద్ర్య నిర్మూలనలో సాను కూలంగా పెరిగేటట్లు చేయడం తొలి లక్ష్యం, వయసు, లింగం వైకల్యం, జాతి, పుట్టుక, మతం, ఆర్థిక వంటి వైరు ద్యాలతో నిమిత్తం లేకుండా 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవస రానికి అనుగుణంగా ఉండాలనేది భావన. 2012లో అంతర్జాతీయంగా 90 కోట్ల మంది రోజుకు 1.90 డాలర్ల కంటే తక్కువ కోట్లకు పడిపోయింది. ఈ గణాంకాలు ఎలా ఉన్నా, దుర్భర దారిద్యం ప్రపంచ మానవాళిని దారుణంగా వేధిస్తోంది. 'క్రెడిట్ న్యూస్' నివేదిక ప్రకారం కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ప్రపంచం లోని సగానికిపైగా సంపద కేంద్రీకృతమై ఉంది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగాల్లో మానవ మేధ గగన సీమలను చుంబిస్తున్నా సర్వకాల సర్వావస్థల్లో విస్తరిస్తున్న పేదరి కానికి అడ్డుకట్ట వేయడంలో దారుణ వైఫల్యం వెక్కిరిస్తోంది. నేటికీ లక్షల మంది చిన్నారుల బాల్యం దోపిడికి గురవుతోంది. పేదరికంలో మగ్గుతున్న చిన్నారులు తమ హక్కుల్ని, ఆరోగ్యాన్ని, పోషకాల్ని, విద్యావకాశాలను కోల్పోతున్నారు. ఇవాళ అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం జరుపు కొంటున్నాం. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్నారు. కానీ, ఆ లక్ష్యాలు సాకారమయ్యే అవకాశం కనుచూపు మేరలో కనిపించక పోవడమే బాధాకరం. అవమానాల నుంచి, వెలివేతల నుంచి బాధా సర్పదష్టులనూ విముక్తి కలిగించి, అందరి భాగస్వామ్యంతో పేదరికాన్ని పునాదుల నుంచి పరిమార్చడమే నినాదంగా పేదరిక నిర్మూలన దినోత్సవం జరుపుతున్నారు. సర్వత్రా పెనువేగంతో విస్తరిస్తున్న అసమానతలు ఇప్పుడు ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. భారత దేశంలో వ్యవసాయం 50 శాతం శ్రామికులకు జీవనాధారం కల్పిస్తోంది. ఈ రంగం అనుబంధ వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలను పెద్ద సంఖ్యలో అందించ గలదు. 2022 కల్లా రైతుల ఆదాయాలను సమయాల్లోనే కాదు, పంటలు విరగ పండిన సంవత్సరాల్లోనూ రైతులకు అరకొర ధరలైనా దక్కడం లేదు. అన్నదాతల ఆదాయాలు పెరగనంత వరకు పేదరికాన్ని నిర్మూలించలేం. ఇక భారతీయ శ్రామికుల్లో 92 శాతం అసంఘటిత రంగాల్లోనే పని చేస్తున్నారు. వారికి వేతనాలు బహు తక్కువ. పింఛన్ల వంటి సామాజిక భద్రత భృతులేవీ లభించవు. పైగా పని పరిస్థితులు దుర్భరం. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారిపోతున్న దృష్ట్యా సంఘటిత రంగ కార్మికులు సరికొత్త ఉద్యోగాల్లో మహిళల వాటా సైతం పెరగాలి. ఇతర దేశాల్లో 50 నుంచి శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత దేశంలో వారి సంఖ్య కేవలం 24 శాతం. స్థూలంగా చూస్తే భారత్, చైనాలు రెండింటిలో అసమానత ఒకేరకంగా ఉన్నట్లు కనిపించినా భారతీయ పేదలు కనీస అవసరాలు కూడా తీరని దుస్థితిలో ఉన్నారు. విద్య, వైద్యం, ఇతర సేవలూ సరిగ్గా అందడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా... ఏళ్లయినా రైతులకు ఇప్పటికీ గిట్టుబాటు ధరలను అందించ లేక పోవడం విచారకరం. అనావృష్టి పీడిత ప్రతి పౌరుడికి కొంత ఆదాయం అందించడానికి సార్వజన కనీస ఆదాయ పథకం పెట్టాలని ప్రపంచ మంతటా ప్రతిపాదనలు వస్తున్నాయి. ఈ పథకాన్ని మొదట వృద్ధుల సంక్షేమం కోసం అమలు చేయవచ్చు. దేశ జనాభాలో ఎనిమిది శాతంగా ఉన్న వృద్ధులకు దీనివల్ల ఎంతో ఊరట కలుగుతుంది. తరవాత మిగతా లబ్ధిదారులకు క్రమంగా ఈ పథకాన్ని వర్తింప జేయవచ్చు. అనారోగ్యం ఉపాధి కోల్పోవడం, పంట నష్టం వంటి అనూహ్య విపత్తులతో అతలా కుతలమయ్యే పేదలకు కనీసాదాయ పథకం ఎంతో కొంత ఆసరా ఇస్తుంది. అదే సమయంలో పేదలకు సరైన ఉపాధి కల్పించడం ఎంతో ముఖ్యం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నులు... జగద్గురు శ్రీ శ్రీ చంద్రశేఖర భారతీ తీర్థ మహాస్వాములు - ఆశ్వయుజ కృష్ణ పక్ష ఏకాదశి మహాస్వామి జయంతి




భారతదేశం ఆధ్యాత్మికతకు పుట్టినిల్లు. వేదవాంగ్మయ స్ఫూర్తి, గురుపరంపరా పద్ధతి, ధర్మసంరక్షణ అనే విలువలను యుగయుగాలుగా నిలబెట్టిన పీఠాలలో శృంగేరీ శ్రీ శారదా పీఠం ఆదిశంకర భగవత్పాదులచే స్థాపించబడినది. ఈ పీఠానికి గౌరవప్రదమైన స్థానం కలిగించిన మహామహోపాధ్యాయులలో జగద్గురు శ్రీ శ్రీ చంద్రశేఖర భారతీ తీర్థ మహాస్వాములు (1892–1954) ప్రథమ శ్రేణిలో నిలిచారు. శ్రీ చంద్రశేఖర భారతీ స్వాములు 1892 అక్టోబర్ 16న మైసూరు సమీపంలోని శ్రింగగిరి పట్టణంలో శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, లక్ష్మీ అమ్మగారల దంపతులకు జన్మించారు. జన్మతః మేధావిత్వం, భక్తి, వినయం ఆయనలో సమసమంగా ఉండేవి. చిన్ననాటి పేరు నరసింహ శర్మ. బాల్యంలోనే వేదమంత్రాలు, సూత్రాలు, తర్కశాస్త్రాలు, సంస్కృత సాహిత్యం మీద అసాధారణ పాండిత్యం సంపాదించారు. గురువులు ఆయనలో బ్రహ్మజ్ఞానానికి అర్హత ఉందని గుర్తించారు. వేదాల అర్థాన్ని కేవలం జ్ఞాపకశక్తి తోనే కాక హృదయ పూర్వకంగా గ్రహించడం ఆయన ప్రత్యేకత. శృంగేరీ పీఠాధిపతిగా ఉన్న జగద్గురు సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ స్వాములు ఈ మేధావి బాలుడిని తన వారసుడిగా గుర్తించి 1912లో సన్యాస దీక్షనిచ్చారు. ఆ సమయంలో ఆయనకు "శ్రీ చంద్రశేఖర భారతీ తీర్థ" అనే యోగపేరు లభించింది. ఆ రోజుతోనే ఆయన జీవితం వేదాంతమయమై పోయింది. సన్యాస మార్గంలో ఆయన అచంచలంగా నిలబడి, ఆదిశంకరాచార్యుల ఆత్మ స్వరూపమై భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని మళ్లీ ప్రజ్వలింప జేశారు. జ్ఞానానికి ఆయన నిర్వచనం సున్నితమైనదే అయినా లోతైనది. "ధర్మం అంటే మనసు, వాక్కు, కర్మ ఏకతలో ఉండడం" అని ఆయన చెప్పేవారు. ఆయన బోధనలో వేదాంతతత్వం లోకోపకారానికి మార్గం చూపింది. జ్ఞానం అంటే జీవితాన్ని సరిగా జీవించడం, సేవ అంటే భగవంతునికి సమర్పణ అని ఆయన వ్యాఖ్యానం. గీతా, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భాష్యాలు అన్నింటి మీద ఆయనకు లోతైన అవగాహన ఉండేది. పీఠాధిపతిగా ఉన్నప్పటికీ ఆయనలో గర్వం, అధికారం అనే భావాలు లేవు. కేవలం ధర్మసేవే ఆయన ధ్యేయం. శృంగేరీ పీఠాన్ని ఆయన కాలంలో ఆధ్యాత్మిక విద్యా కేంద్రంగా మార్చారు. వేదపాఠశాలలను పునరుద్ధరించి వేదపండితులకు సాయమందించారు. భారతీయ సంస్కృతిని కాపాడే ఆవశ్యకతను ఆయన పునఃపునః గుర్తు చేశారు. "జీవితమంతా సేవే యజ్ఞం. ప్రతి క్షణం భగవత్ చింతనే సాక్షాత్కారం" అనే ఆయన వాక్యాలు నేటికీ ఆధ్యాత్మిక మార్గదర్శకం. ఆయన ధ్యాన, తపస్సులే జీవితం. సమాధి స్థితిలో ఉన్నప్పుడు ఆయన రూపం దివ్యకాంతితో మెరిసేది. జ్ఞానయోగి, భక్తయోగి, తపస్వి – ఈ మూడింటి సమన్వయమూర్తి ఆయనే. 1954 సెప్టెంబర్ 26న ఆయన బ్రహ్మలీనులయ్యారు. ఆ సమయాన శృంగేరీ, తుంగా నది పరిసరాలు ఆధ్యాత్మిక మౌనంతో నిండిపోయాయి. ఆయన బృందావనం శృంగేరీ సమీపంలోని నరసింహవనంలో ఉంది. ప్రతి సంవత్సరం ఆయన జయంతి సందర్భంగా ఆరాధనోత్సవాలు జరుగుతాయి. ఆయన వారసత్వాన్ని శ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వాములు, భారతీ తీర్థ స్వామి, అనంతరం ప్రస్తుత పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ విధుశేఖర భారతీ స్వాములు కొనసాగిస్తున్నారు. ఈ పరంపర సనాతన ధర్మానికి దీప్తినిచ్చే ఆధ్యాత్మిక వృక్షంలా విస్తరించింది. శ్రీ చంద్రశేఖర భారతీ తీర్థ మహాస్వాములు ఆధ్యాత్మికతకు జీవమూర్తి. ఆయన జీవితం మనకు తపస్సు, జ్ఞానం, భక్తి ఏకతను నేర్పుతుంది. ఆత్మజ్ఞానం అనే పరమార్థాన్ని ఆయన సాధించి చూపారు. ఆయన వచనం ప్రకారం %–% "జ్ఞానం కేవలం బుద్ధి కాదు, అది హృదయ స్ఫూర్తి. ఆత్మను తెలుసుకోవడమే పరమసత్యం." ఈ వాక్యం ఆయన జీవిత తాత్పర్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఆయన జయంతి సందర్భంగా ఆయన బోధనలను స్మరించుకుంటూ, ధర్మపథంలో నడుస్తూ, మన మనస్సుల్లో జ్ఞానదీపాన్ని వెలిగిద్దాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# కన్నీటి ఊట.. కష్టాల మేట..!

సూర్యాపేట: ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి కురిసిన అకాల వర్షం పత్తి, వరి రైతులను ఆగమాగం చేసింది. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి.. పొలాల్లో వరి నేలవాలడంతో కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు చేనుల్లోని పత్తి తడిసి నేలరాలుతోందని వాపోతున్నారు.

**వరి** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి 12,87,781 ఎకరాల్లో సాగవుతోంది. ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలయ్యాయి. ధాన్యాన్ని విక్రయించేందుకు ఆయా ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అధికారులు కేంద్రాలను ప్రారంభించినా.. తూకాలు కావడం లేదు. ఫలితంగా భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. కొన్ని చోట్ల వరదలో కొట్టుకుపోయింది. కోత దశలో ఉన్న పైర్లు నేలవాలి నష్టం కలిగింది.

**ఉప్పుతో ఉపకారం:** తడిసిన ధాన్యం, పొలాల్లోని వరి కంకులు మొలకెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ సూచించారు. పొలాల్లో గింజలు నేలకు తాకితే నీరు నిల్వ ఉండకుండా కాల్వలు తీయాలి. వరిపైరు గాలివానకు నేలవాలకుండా జడలు కట్టుకోవాలి. పొలంలో తేమ ఉంటే లీటరు నీటికి 2 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలి. తడిసిన ధాన్యానికి క్వింటాకు కిలో చొప్పున ఉప్పు కలిసి ఆరబెట్టాలి. అప్పుడు మొలక శాతం తగ్గి రంగు మారకుండా కాపాడుకోగలుగుతాం.

**పత్తి** మూడు జిల్లాల్లో మొత్తం 7,65,130 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. వరుస వర్షాలు.. తెగుళ్లతో పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. ఏదోలా తేరుకున్నాం.. ఏరివేతలు చేపట్టి ఇళ్లకు తరలించే సమయంలోనే అకాల వర్షానికి చేనుల్లోని దూది అంతా తడిసి ముద్దయిందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. పొలంలో వరద చేరి పత్తి ఏరివేతలకూ వీలులేకుండా ఉంది. ఇలానే రెండు రోజులపాటు కురిస్తే పత్తి



మొలకెత్తనుందని వాపోతున్నారు. ఈసారి వానలతో పెట్టుబడులు కూడా పూడేలా లేదని ఆందోళన చెందుతున్నారు.

**పత్తిలో సస్యరక్షణ:** పూత, కాత, కాయ పగిలే దశలో ఉన్న పత్తి పంటను వర్షాలకు నష్టం జరగకుండా తగిన సస్యరక్షణ చర్యలతో కాపాడుకోవచ్చని గడ్డిపల్లి కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ పేర్కొన్నారు. కాయపై మచ్చలు, కాయలు కుళ్లకుండా ముందస్తుగా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 0.1గ్రా. ప్లాంటామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణ, మొక్క ఎదుగుదలకు 2.5 గ్రా. కార్బండిజం, మ్యాంకోజెబ్, 5గ్రా. 13:0:45 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**దిగుబడి తగ్గింది: ఉప్పుల శ్రీనివాస్, నూతనకల్**

గతేడాది రెండెకరాల్లో పత్తి సాగు చేస్తే ఎకరాకు 8 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. విక్రయిస్తే ఖర్చులు పోను రూ.27 వేలు మిగిలాయి. ఈసారి వరుస వర్షాలకు పంటంతా దెబ్బతింది. ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉంది. ఎకరాకు రూ.25 వేల చొప్పున ఖర్చు చేస్తే చివరకు ఎకరాకు రూ.7 వేలు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది.

# మార్పుతోనే 'స్వచ్ఛ'త!

సూర్యాపేట : స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో పురపాలికలు మెరుగైన ర్యాంకు సాధించాలంటే ప్రజల్లో మార్పు రావాలి. ఇందుకు పుర అధికారులు కూడా సహకారం అందించాలి. కానీ.. జనం ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పారబోస్తున్నారు. మున్సిపల్ వాహనాలు వచ్చినప్పుడు ఇంటి వద్ద లేకపోతే సాయంత్రం కాలనీల్లో కుప్పగా పడేస్తున్నారు. వీటిలో మార్పు వస్తే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించే అవకాశం ఉంటుంది. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పరిశుభ్రతపై పుర అధికారులు అవగాహన కల్పించారు.

**ఇలా చేద్దాం**

గృహాల్లో ఉత్పత్తి అయిన తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించేలా ప్రణాళిక రచించాలి. ఇప్పటికే కొన్ని పురపాలికల్లో అమలవుతుండగా మిగతా ప్రాంతాల్లో కార్యాచరణకు దిగడం లేదు. చెత్త సేకరణ ఆటోలు ఇళ్ల ముందుకు వెళ్లినప్పుడు వేర్వేరుగా వ్యర్థాలను ఇవ్వాలని సిబ్బంది చైతన్యపర్చాలి. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పారేయొద్దని అవగాహన కల్పించాలి. ఆయా బడుల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను చైతన్య కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలి.



**నా వంతు కర్తవ్యం' నినాదంతో..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో స్వచ్ఛతా హీ కార్యక్రమంలో 'నా వంతు కర్తవ్యం' అనే నినాదంతో ముందుకెళ్లారు. తడి చెత్తతో ఎరువులు తయారీ కావడంతో వారికి వీటిపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు తదితర వస్తువులను పొడి చెత్త కింద సిబ్బందికి అందించాలని సూచించారు. తద్వారా ఆటోల్లో చెత్త తీసుకెళ్లేటప్పుడు సిబ్బందికి పని సులువవుతుంది. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు దోహదపడనుంది.

**మెరుగైన ర్యాంకుకు కృషి: హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట**

వచ్చే ఏడాది స్వచ్ఛసర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధనకు కృషి చేస్తున్నాం. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛతా హీ కార్యక్రమాలలో ప్రజలను పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాం. పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛతకు కృషి చేస్తాం.

# స్మార్ట్ లైట్ల మాయ.. వెలగకముందే బిల్లుల రికార్డు



కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి పనులు చేశారు. సిమెంటు రహదారులు నిర్మించిన చోట రోడ్డుకు ఇరువైపులా వీధిదీపాల కోసం ప్రత్యేక స్తంభాలు వేశారు. రాత్రి పూట లైట్లు వెలగాల్సి ఉండగా, ఏళ్ల తరబడి అంధకారం నెలకొంది. ఇదేమిటని గత పాలకవర్గ సభ్యులు అప్పట్లోనే ప్రశ్నించారు. విద్యుత్తు నియంత్రికలు, ప్రత్యేకంగా మీటర్ల కెపాసిటీ పెంచాలనే కారణాలతో దావేసే ధోరణి అవలంబించారు. కొన్ని ప్రాంతాల్లో వెలగకపోవడంతో స్మార్ట్ లైట్ల మాయలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.

**అనేక చోట్ల అలంకారప్రాయంగా..**

స్మార్ట్‌సిటీ స్తంభాలకు వీధిదీపాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. అశోక్‌నగర్, కాపువాడ రోడ్డు, మల్కాపూర్ రహదారి, భాగ్యనగర్, ఆదర్శనగర్ నుంచి కోర్టు రోడ్డు, గాంధీరోడ్డు, పోచమ్మవాడ తదితర ప్రాంతాల్లో కొన్ని స్తంభాలకు లైట్లు ఉండగా అవి వెలగడంలేదు. యజ్ఞవరాహస్వామి ఆలయం రోడ్డులో 25 స్తంభాలు ఉన్నాయి. అందులో ఒక్కటీ వెలగడం లేదు.

**దొరకని విడిభాగాలు**

స్మార్ట్ స్తంభాలకు ఎల్ఈడీ వీధిదీపాలు బిగించగా, వాటి విడిభాగాలు దొరకడం లేదు. నాణ్యత లేని లైట్లు బిగించారు. రెండేళ్ల నిర్వహణ మరిచారు. అంబేద్కర్ స్టేడియంలో 24 వీధి దీపాలకు ఉన్న విడిభాగాలు దొంగలు ఎత్తుకెళ్లగా, కొత్తవి అమర్చేందుకు సిద్ధంకాగా, విడిభాగాలు ఎక్కడా దొరకడం లేదు. స్థానికంగా దొరకని, నాసిరకం లైట్లు, విడిభాగాలు పెట్టారనే ఆరోపణలున్నాయి. వీధిదీపాలు వెలగకపోవడం, ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా ఉంచారనే ఫిర్యాదులు వస్తుండటంతో తప్పని పరిస్థితిలో నగర పాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఒక్కో రోడ్డులో వీటిని పరిశీలిస్తూ కేబుళ్లు కొనుగోలు చేస్తూ లైట్లకు మరమ్మతులు చేస్తున్నారు. కొన్ని చోట్ల కొత్తవి బిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో బల్దియాకు రూ.లక్షల్లో భారం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

**పరిశీలించకుండా.. హడావుడిగా..**స్మార్ట్‌సిటీ స్తంభాలకు సంబంధించిన వీధిదీపాలు వెలుగుతున్నాయా? లేవా? అనేవి కూడా గతంలో పని చేసిన ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించలేదు. ప్రస్తుతం వెలగడం లేదని క్షేత్రస్థాయికి వెళ్లి ఆరా తీస్తే విషయం తెలుసుకొని అవాక్కయ్యారు. స్తంభాలకు కేబుళ్లు వేయకుండానే వదిలేశారు. ఒక్కో స్తంభం మధ్యలో 40 మీటర్ల దూరం ఉంటుంది. మొత్తం స్తంభాలకు కేబుల్స్ వేసి లైట్లు వెలిగించిన తర్వాతే బిల్లులు రికార్డు చేయాల్సి ఉండగా, హడావుడిగా చేశారు. **తనిఖీ చేయిస్తాం: ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, నగరపాలక సంస్థ** స్మార్ట్‌సిటీ లైట్లకు సంబంధించిన విషయాలపై ఇంజినీరింగ్ అధికారులతో తనిఖీ చేయిస్తాం. వీటికి సంబంధించిన దస్త్రాలు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# పుష్కరకాలం పూర్తి.. ఏదీ అభివృద్ధి?



మల్లాపూర్: వచ్చే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రభుత్వం అవసరమైన మేర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్నా.. ఆ దిశగా దృష్టి సారించకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన పుష్కరాల సమయాల్లో కొద్దినెలల ముందే హడావుడిగా పనులు మంజూరుచేసి ప్రారంభించినప్పటికి.. సకాలంలో అవి పూర్తికాక గతంలో భక్తులు తీవ్ర ఇబ్బందుల మధ్యే స్వామివారిని దర్శించుకొన్నారు. నేటికి కొన్నిచోట్ల పనులు నిర్మాణ దశలోనే ఉండటం గమనార్హం. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వాల్గొండ రామలింగేశ్వరాలయంతోపాటు దేవాదాయశాఖ పరిధిలో ఉన్న వెంకట్రావుపేట గంగ గౌరీశ్వర దేవస్థానం పరిధిలోని గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి లక్షల్లో భక్తులు వస్తుంటారు.

**పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి**

ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్న వాల్గొండ రామలింగేశ్వరాలయం(త్రికూటలయం)ను జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఉమ్మడి ఏపీ ప్రభుత్వ హయాం నుంచి టూరిజంశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నా అవి బుట్టదాఖలే అవుతున్నాయి. వాల్గొండ గోదావరి ఒడ్డున రిసార్టులు నిర్మించడంతోపాటు నదిపై వంతెన నిర్మాణం చేపట్టి బోటింగ్ సైతం ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతం అనువైందిగా ఎంపికచేసినా ముందడుగు పడలేదు. పుష్కరఘాట్‌లను విస్తరించడం, దుస్తులు మార్చుకునే గదులు, పారిశుద్ధ్యం నిర్వహణ వంటి పనులు చేయాల్సిఉంది.

**ఏకో టూరిజంపై నీలినీడలు**

వెంకట్రావుపేట గంగ గౌరీశ్వర ఆలయం ప్రకృతి రమణీయతతో ఉంటుంది. నది అందాలు, ప్రకృతి సెలయేళ్లు భక్తులను కనువిందు చేస్తున్నాయి. పూర్తిగా అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న రేవులో గౌరీశ్వర దేవస్థానం నిర్మాణానికి పదేళ్లు గడుస్తున్నా.. అడుగు ముందుకు పడటంలేదు. కేవలం స్లాబ్ వరకు పూర్తయిన అనంతరం పుష్కరాలు రావడంతో పనులు అక్కడే నిలిపివేసి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత ఆలయ నిర్మాణాన్ని పట్టించుకోలేదు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని ఏకో టూరిజంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. వచ్చే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతమున్న రహదారిని రెండు వరుసలుగా విస్తరించడం, విద్యుత్తు సౌకర్యం, దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేయడంతోపాటు ఆలయ పనులు చేపట్టాల్సి ఉంది.

# అంగన్‌వాడీలకు మహర్దశ



జగిత్యాల : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు ఇక తీరనున్నాయి. స్లాబు లీకేజీలు, కిటికీలు సక్రమంగా లేకపోవడం, వెలసిపోయిన గోడలకు సంబంధించి కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 1065 కేంద్రాలుండగా.. వీటిలో సొంత భవనాలు 286, ఉచిత అద్దె భవనాలు 239, అద్దెకు సంబంధించి 540 ఉన్నాయి. వీటిలో గర్భిణులు, బాలింతలు, టీహెచ్ఆర్ తీసుకుంటున్న వారు, చిన్నారులు లబ్ధి పొందుతున్నారు.

**తొలగిన స్థానిక కోడ్ అడ్డంకి**

ప్రస్తుతం ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో వెంటనే అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నా పెద్ద మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదన్న ఉద్దేశంతో సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. గతంలో ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

**రూ.2.50 లక్షల చొప్పున**

ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల చొప్పున మరమ్మతుల కోసం 56 కేంద్రాలకు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. ఈ పనులు పంచాయతీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అయితే సొంత భవనాలున్న మరో 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు అవసరమని నివేదించగా, నిధుల మంజూరుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

**పర్యవేక్షణ తప్పనిసరి**

ప్రభుత్వం చేపట్టే పనులంటేనే ఒకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. గతంలో మల్యాలలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో మరమ్మతులు చేపట్టిన రేకుల షెడ్డులో వర్షం నీరు లీకవడంతో నిర్వాహకులు, లబ్ధిదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఇందులో నట్టు, బోల్ట్ సక్రమంగా బిగించకపోవడం కారణమని గుర్తించి సరిచేశారు. ఈ లెక్కన మరమ్మతు పనులకు ఎంపిక చేసిన అంగన్‌వాడీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన అవసరముంది.

**సక్రమంగా జరిగేలా చూస్తాం**

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేశారు. మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులకు కొంత ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం కోడ్ తొలగిపోవడంతో అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమమైంది. త్వరలో మరమ్మతు పనులు మొదలవుతాయి. సక్రమంగా అభివృద్ధి జరిగేలా పర్యవేక్షిస్తాం. డా.నరేశ్, జిల్లా సంక్షేమాధికారి

# నిర్మాణం పూర్తి చేస్తే.. భూముల్ని సస్యశ్యామలం చేస్తా

మోత్కూరు : ప్రజాప్రతినిధుల్లారా..పార్టీ నాయకుల్లారా..! నేను గుర్తున్నానా..?.. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, నిరసనల ఫలితంగా మీ ప్రాంతంలోని పడావు భూములకు సాగు నీరందించి సస్యశ్యామలం చేయాలని 2005 ఏప్రిల్ 10న అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి శంకుస్థాపన చేసిన బునాదిగానికాల్వను. మూసీనది ద్వారా మక్తాఅనంతారం నుంచి బీబీనగర్, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలం ధర్మారం చెరువు వరకు 98.64 కి.మీ.కాల్వను తవ్వి 5,500 ఎకరాలకు పైగా సాగునీరందించాలని నా నిర్మాణాన్ని చేపట్టారు. ఈ కాల్వ రెండు దశలకు కలిపి రూ.14.53 కోట్లు కేటాయించారు. పనులు నత్తనడకన సాగి ఆగిపోయాయి. మళ్లీ ఉద్యమాలు, పోరాటాలు, నిరసనలు.. 2016లో అప్పటి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కృషితో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కాల్వ కోసం రూ.71 కోట్లు మంజూరు చేయగా.. 2017 నవంబరు 5 పనకబండ వద్ద పనులు ప్రారంభించా



రు. మళ్లీ నత్తనడకన సాగి ఆగిపోయాయి. మళ్లీ ఉద్యమాలు, పోరాటాలు, నిరసనలు.. 20 ఏళ్లు గడిచిపోయాయి. కాల్వ పూర్తికాలేదు. ఈ కాల్వ కోసం ఎదురు చూసీచూసీ రైతుల కళ్లు కాయలు కాస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఈ ప్రాంతం వాడిగా, తన స్వగ్రామం ధర్మారం చెరువు వరకు ఉన్న ఈ కాల్వను పూర్తిచేయించేందుకు తీవ్ర కృషి చేయడంతో నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.268.65 కోట్ల నిధులను 2024 అక్టోబరు 16న మంజూరు చేసి టెండర్లు పూర్తిచేశారు. పనులు మాత్రం పునఃప్రారంభం కాలేదు. మోత్కూరు మండలం నుంచి ధర్మారం వరకు కాల్వ నిర్మించాల్సి ఉంది. ఆత్మకూరు(ఎం) మండలం నుంచి మోత్కూరు మండలం వరకు కాల్వ అభివృద్ధి, భూనిర్వాసితులకు పరిహారం అందించాల్సి ఉంది. ఈ కాల్వ ద్వారా మూసీనది నీరు కాకుండా బస్వాపురం ప్రాజెక్టు నుంచి నల్గొండ జిల్లా ప్రాంతానికి వెళ్లే కాల్వ ద్వారా గోదావరి జలాలు అందిస్తే పంటలు బాగా పండుతాయని రైతులు అంటున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నాపై దృష్టి సారించి పనులు పునఃప్రారంభించి, పూర్తిచేస్తే.. ఈ ప్రాంతంలోని బీడు భూములను సస్యశ్యామలం చేస్తా.

# తాకట్టు పెడితేనే.. సౌర వెలుగులు!

కొత్తగూడెం: కేంద్రం అమలుచేస్తున్న పీఎం-కుసుమ్(ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకం.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల రైతులకు అందనంత దూరంలో నిలుస్తోంది. ఈపథకంలో భాగంగా రైతులు తమ భూముల్లో గ్రిడ్‌కు అనుసంధానించేలా సౌరవిద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటుచేసుకోవచ్చు. దీనికి అయ్యే వ్యయంలో కొంతమొత్తాన్ని రైతు భరించాలి. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ద్వారా రుణం పొందాలి. రుణం పొందాలంటే బ్యాంకులు కచ్చితంగా భూములను తాకట్టు(మార్టిగేజ్) అడుగుతున్నాయి. ఉభయ జిల్లాల్లో ఈ పథకానికి ఎంపికైన చాలామంది భూములు 1/70 చట్టం పరిధిలో ఉండటం అడ్డంకిగా మారింది.

**చట్టం ఏం చెబుతోంది..?**

గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు తమ భూములను తాకట్టుపెట్టడానికి లేదా బదిలీ చేయటానికి 1/70 చట్టం అనుమతివ్వదు. గిరిజనేతర రైతుల భూములకు భద్రత లేదనే కారణంతో బ్యాంకులు రుణాలిచ్చేందుకు నిరాకరిస్తున్నాయి. గిరిజనులైనప్పటికీ అసైన్డ్ భూములను తాకట్టు పెట్టేందుకు నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. 'నిబంధనల ప్రకారం రుణమివ్వాలంటే తాకట్టు తప్పనిసరి. 1/70 చట్టం పరిధిలో ఉన్నందున తాకట్టు పత్రాలు చట్టబద్ధంగా చెల్లవు. అందుకే రుణాలు



ఇవ్వలేకపోతున్నాం' అని భద్రాద్రి జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ రాంరెడ్డి 'ఈనాడు'కు తెలిపారు.

**భద్రాద్రి జిల్లాలోనే అధికం..**భద్రాద్రి జిల్లాలో అత్యధిక భూభాగం 1/70 చట్టం పరిధిలో ఉంటుంది. పీఎం-కుసుమ్ పథకానికి దరఖాస్తు చేసుకున్న చాలామంది రైతులకు బ్యాంకు రుణాలు అందని పరిస్థితి నెలకొంది. ఈ జిల్లాలో 13 దరఖాస్తులు పథకానికి ఎంపికవగా పదకొండు అర్జీలకు సంబంధించి న భూములకు 1/70 చట్టం వర్తిస్తుంది. ఖమ్మం జిల్లాలో 35 దరఖాస్తులు రాగా మూడు అర్జీలు మాత్రమే ఈ చట్టం పరిధిలోకి వస్తాయి.

**ప్రభుత్వం జోక్యం చేసుకుంటేనే..**

ఈసమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాని రైతులు కోరుతున్నారు. బ్యాంకు రుణాలు మంజూరయ్యేందుకు తాకట్టు నిబంధనలను సడలించేలా లేదా ఈప్రాంత రైతులకు ప్రభుత్వమే ప్రత్యేకంగా హామీ ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని వేడుకుంటున్నారు. 2026 మార్చి 31నాటికి సౌర ప్లాంట్ల ఏర్పాటుకు గడువు ఉంది. ఆలోపు పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 1/70 చట్టం పరిధిలోని భూములకు బ్యాంకు రుణం ఆలస్యమవుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆయా భూముల్లో ప్లాంట్లు ఏర్పాటుచేస్తాం' అని టీజీ రెడ్కో మేనేజర్ అజయ్‌కుమార్‌కు తెలిపారు.

## వడ్డీ.. మెట్రో నడ్డి విరుస్తోంది!

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో ప్రైవేటు యాజమాన్యం నుంచి ప్రభుత్వానికి మారాలంటే ఈక్విటీని ఎల్ అండ్ టీకి చెల్లించడంతోపాటు ఆ సంస్థ చేసిన రుణాల మొత్తాన్ని సర్కారుకు బదలాయించుకోవాలి. ఈ రుణాలపై చెల్లిస్తున్న వడ్డీలు ప్రస్తుతం అధికంగా ఉన్నాయి. ఇదే మెట్రో నడ్డివిరుస్తోంది. దీంతో తక్కువ వడ్డీకి అప్పులు ఇచ్చే అంతర్జాతీయ సంస్థల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్వేషిస్తోంది. ఇందుకోసం ఏజెన్సీలతో చర్చిస్తోంది. రుణాల సమీకరణలో విస్తృత అనుభవం ఉన్న బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్(బీసీజీ) వంటి వాటితో కసరత్తు చేస్తోంది. **రూ.13వేల కోట్లు..** మెట్రోను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించిన సంగతి తెలిసిందే. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ కొంత ఈక్విటీగా.. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణంగా తీసుకుంది. ఈక్విటీ రూ.2000 కోట్లను



చెల్లించేందుకు సర్కారు ముందుకొచ్చింది. అప్పులు రూ.13 వేల కోట్లు ఉన్నాయి. వీటిపై 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.940 కోట్లను వడ్డీ రూపంలో చెల్లించింది.

వార్షికంగా సగటున రూ. వెయ్యి కోట్లు... ప్రభుత్వం వార్షికంగా సగటున రూ.1000 కోట్లు మొదటి దశకు చెల్లించడమంటే ఆర్థికంగా భారం అవుతుంది. ఈ భారం సగానికి తగ్గాలంటే తక్కువ వడ్డీకే రుణాల బదలాయింపు జరగాలి. కొత్త ప్రాజెక్ట్‌లకు జైకా, ఏడీబీ వంటి సంస్థలు రెండు మూడు శాతానికే రుణాలు మంజూరు చేస్తుంటాయి. ఇప్పటికే పూర్తైన ప్రాజెక్ట్‌లకు ఇస్తాయా అనే సందేహాలు ఉన్నాయి. గతంలో ఇచ్చారని అధికారులు అంటున్నారు.

## విద్యార్థి చూపు.. నగరం వైపు

బొంరాస్‌పేట: డిగ్రీ చదువులపై విద్యార్థులకు ఆసక్తి తగ్గుతోంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తరవాత డిగ్రీ కళాశాలల్లో చేరడానికి ముందుకు రావడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఏటా దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసినా చేరికలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. హైదరాబాద్ నగరంలోని కళాశాలలతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాటిలో విద్యార్థులు చాలా తక్కువగా చేరుతున్నారు. దీంతో భారీగా సీట్లు మిగిలిపోయాయి.

**నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో..**

జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ పట్టణాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. వాటిలో బీఏ, బీకాం కంపూటర్స్,



బీఎస్సీ, ఫిజికల్, లైఫ్ సైన్సెస్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆయా కోర్సుల్లో మొత్తం 1,660 సీట్లు ఉన్నాయి. వాటిని భర్తీ చేయడానికి దోస్త్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. అర్హతలనుబట్టి మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకసారి స్పాట్ అడ్మిషన్లను నిర్వహించగా.. 658 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరారు. ఇంకా 1,002 సీట్లు ఖాళీగా ఉన్నాయి. పరిగిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేదు. జూనియర్ కాలేజీలోని మూడు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వసతి ప్రధాన సమస్యగా మారింది. ఇంటర్ పూర్తయిన తరవాత ఆర్థిక స్తోమత లేని తల్లిదండ్రులు పిల్లలను ఉపాధి కోసం వివిధ పనులు చేయడానికి పంపుతున్నారు. లేదంటే పార్ట్‌టైంగా ఏదో ఒక పని చేసి చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో నగరంలోని కాలేజీల్లో చేరుతున్నారు. అలాగే ఆర్థికంగా ఉన్నవారు ఇంజినీరింగ్, వైద్యవిద్య వైపు మళ్లుతున్నారు. దీంతో సీట్లు మిగులుతున్నాయని అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు.

## అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?

సంగారెడ్డి, వానాకాలం సీజన్ ధాన్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ సన్నాహాలు మొదలుపెట్టింది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగాయి. మిల్లర్లు తరుగు పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కయి అవినీతికి తెరలేపారనే ఆరోపణల నేపథ్యంలో పౌరసరఫరాల శాఖకు చెందిన విజిలెన్స్ విచారణ చేపడుతోంది. ప్రస్తుత సీజన్‌లోనైనా అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా ఉమ్మడి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

సొమ్ము చేసుకుంటున్నారు!

మెదక్ జిల్లాలో రూ.39.69 కోట్ల విలువైన ధాన్యం సేకరణలో గోల్‌మాల్ జరిగినట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. 24 మిల్లుల్లో ధాన్యం దించుకోకుండానే నకిలీ ట్రక్‌షీట్లు సృష్టించారనే విమర్శలపై విచారణ నిర్వహిస్తున్నారు. 2022–23 యాసంగి ధాన్యాన్ని 72 రైసుమిల్లులు టెండర్ దక్కించుకున్నాయి. రూ.175 కోట్ల విలువైన ధాన్యం ఇవ్వకుండా మొండికేస్తున్నాయి. మిల్లర్లు సొమ్ముచేసుకున్నట్లు సమాచారం.

సిద్దిపేట జిల్లాలో కొందరు వ్యాపారులు సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా గడువులు కోరుతున్నారు. వారు వేరే వ్యాపారులకు లీజుకిచ్చి లావాదేవీలు నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

ధాన్యం బకాయిల్లేని మిల్లులకే సీఎమ్మార్ కేటాయింపులుంటాయని వికారాబాద్ జిల్లా అధికారులు తెలిపారు. గతేడాది 26 మంది మిల్లర్లు సీఎమ్మార్ కింద ధాన్యం తీసుకున్నారు. వారి నుంచి 75 శాతమే సేకరించారు.

**ఆదేశాలు పక్కాగా అమలైతేనే..**

గత వానాకాలం నుంచే మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుంటోంది. కొందరు గ్యారంటీలు ఇవ్వకుండానే ధాన్యం తీసేసుకుంటున్నారు.గత వారం పౌరసరఫరాల శాఖ జారీ చేసిన నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీ సమర్పించిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కాంటా తదనంతరం ధాన్యం తరలింపుతో భద్రపరిచే భాధ్యత పూర్తిగా కొనుగోలు కేంద్రాలదేనని మార్గదర్శకాలలో స్పష్టంగా ఉంది.

ఎఫ్ఎక్యూ (నిర్దేశిత నాణ్యతా ప్రమాణాల) నిబంధనలకు అనుగుణంగా తరుగు తీసుకుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారు. ట్రక్‌షీట్‌లో మార్పులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# ఆధునిక వైద్యం పేదలకు వరం



హైదరాబాద్: నిమ్స్‌లో రోగులకు ఆధునిక చికిత్సలు అందించేందుకు హెూమోగ్రాఫ్ట్ వాల్వు బ్యాంకుతో పాటు ప్రస్తుతం ఉన్న ల్యాబ్‌లను ఆధునికీకరించి.. కొత్త పరికరాలను సమకూర్చుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో శరవేగంగా ఇవి రూపుదిద్దుకుంటున్నాయి. ప్రస్తుతం దవాఖానాలో 2 వేల పడకలు ఉన్నాయి. కొత్తగా నిర్మిస్తున్న బ్లాక్‌ల్లో మరో 2 వేలు పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఏటా 20–30 శాతం రోగుల సంఖ్య పెరుగుతోంది. అందుకు తగ్గట్టు విస్తరణ, సేవలను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

**స్టెమ్‌సెల్ ల్యాబ్..** నిమ్స్‌లో స్టెమ్‌సెల్ ల్యాబ్ పూర్తయ్యింది. మిలీనియం బ్లాక్ ఆరో అంతస్తులో ఏర్పాటు చేశారు. రక్త క్యాన్సర్లు, తలసీమియా, అప్లాస్టిక్ ఎనీమియా, కార్డియాక్ సమస్యలకు సంబంధించి మూలకణథెరపీ అందుబాటులోఉంది. ముఖ్యంగా రక్త క్యాన్సర్లతో బాధపడే వారికి ఇక్కడ మూలకణ మార్పిడిలు చేస్తున్నారు. ఇప్పటివరకు 86 మందికి ఈ చికిత్సలు అందించారు. ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేస్తారు.

**వైరాలజీ ..**

ప్రస్తుతం ఉన్న వైరాలజీ ల్యాబ్‌ను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారు. ఆర్టీపీసీఆర్,రియల్‌టైం పీసీఆర్, ఎలీజా, కన్వెన్షనల్ మైక్రో బయోలాజికల్ సాంకేతికతతో పరీక్షలు చేస్తున్నారు. కరోనా, హెపటైటిస్, డెంగీ, ఇన్ఫ్లూయెంజా, హెచ్1ఎన్1 తదితర వైరస్‌లపై పరిశోధనలుజరపనున్నారు.

**హెూమోగ్రాఫ్ట్ వాల్వు బ్యాంకు..**

తొలిసారి నిమ్స్‌లో హెూమోగ్రాఫ్ట్ వాల్వు బ్యాంకు ప్రారంభించనున్నారు. బ్రెయిన్‌డెడ్ లేదా ప్రమాదంలో మృతిచెందిన దాతల నుంచి గుండె వాల్వులను భద్రపరుస్తారు. క్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సలు, ఇన్‌ఫెక్షన్లు ఇతర కారణాలతో వాల్వులు పనిచేయని వారికి వాటిని అమర్చుతారు. ఇప్పటివరకు మెటల్ లేదా జంతువుల నుంచి సేకరించిన వాల్వులను అమర్చుతున్నారు. ఇకనుంచి హ్యూమన్ వాల్వులే వినియోగించడంతో ఇన్‌ఫెక్షన్ల శాతం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం దేశంలో 6 చోట్ల ఈ బ్యాంకులున్నాయి.

**ఫంగస్ ప్రయోగశాల ..**

ఫంగస్ ల్యాబ్‌ను సైతం ఆధునికీకరిస్తున్నారు. ప్రస్తుతం ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు సంబంధించి అడ్వాన్స్‌డ్, కన్వెన్షనల్ డయాగ్నొస్టిక్స్ పరీక్షలు చేస్తున్నారు. కొత్తటెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఫంగల్ కారక వ్యాధులు పెరుగుతున్న దృష్ట్యా పరిశోధనలకు పెద్దపీట వేయనున్నారు.

**ఎన్‌జీఎస్ ..** నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) ల్యాబ్‌ను అత్యాధునిక సాంకేతికతతో తీర్చిదిద్దారు. ల్యాబ్‌ను మరింత బలోపేతం చేయనున్నారు. జన్యు వ్యాధులపై ఇక్కడ వైద్యులు, విద్యార్థులు పరిశోధనలు సాగిస్తున్నారు. ఎన్‌జీఎస్ విధానంలో జన్యు వ్యాధులు, ఇన్ఫెక్షన్ డీసిజెస్, క్యాన్సర్ జీనోమిక్స్ తదితర విభాగాలపై పరిశోధనలను పెంచనున్నారు. వీటితోపాటు జెనిటిక్ కౌన్సెలింగ్, క్లినిక్ డయోగ్నొస్టిక్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

# కిస్తీలు మాయం.. వడ్డీలు భారం



తాండూరు: స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రభుత్వం వ్యక్తిగతంగా స్త్రీనిధి రుణాలు అందిస్తోంది. వాటిని తీర్చేందుకు ప్రతినెలా చెల్లించిన కిస్తీల సొమ్మును కొందరు సొంతానికి వాడుకున్నారు. అధికారులు బాధ్యులను గుర్తించి మూడేళ్లయినా చర్యలు మాత్రం తీసుకోలేదు. కొందరి నిర్లక్ష్యం కారణంగా వందలాది మంది మహిళలపై వడ్డీ భారం పడుతోంది.

1,085 సంఘాల్లో 12,109 మంది సభ్యులు..

తాండూరు మండల పరిధి 33 పంచాయతీల్లో 1,085 స్వయం సహాయక సంఘాలున్నాయి. వాటిలో 12,109 మంది మహిళలు సభ్యులుగా నమోదయ్యారు. వీరందరికీ ఏటా రూ.3 కోట్లకుపైగా స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.25వేల నుంచి రూ.3లక్షల వరకు మంజూరు చేస్తున్నారు. రుణాలను తిరిగి నెలనెలా సులభ వాయిదాల్లో చెల్లించేందుకు అవకాశం కల్పించారు. బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా చరవాణిలో దరఖాస్తు చేస్తే రుణ మొత్తాన్ని నేరుగా బ్యాంకు ఖాతాలో వేస్తున్నారు.

**రూ.22 లక్షలు గోల్‌మాల్..**

ఐనెల్లిలో డ్వాక్రా మహిళల నిరక్షరాస్యత, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని రుణ వాయిదాల సొమ్మును కొందరు దుర్వినియోగం చేశారు. ఇక్కడి మహిళలు నెలనెలా సీసీకి, మహిళా సంఘాల అధ్యక్షురాలికి కిస్తీ డబ్బులను ఎప్పటికప్పుడు అందించారు. ఆ సొమ్మును మహిళల బ్యాంకు రుణ ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా సొంతానికి వాడుకున్నారు. కొన్ని నెలలుగా బకాయిలుండటంతో అనుమానం వచ్చిన ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చి విచారిస్తే మహిళలు చెల్లించిన రుణ కిస్తీల సొమ్ము రూ.22 లక్షలు దుర్వినియోగమైనట్లు తేల్చారు. 2022లో విషయం వెలుగులోకి వచ్చినా.. అధికారులు బాధ్యుల నుంచి సొమ్ము వసూలు చేయకపోవడం గమనార్హం. మూడేళ్లు దాటినా వసూలుకు వెనకాడుతుండటంపై స్వయం సహాయక సంఘాల మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెలనెలా సక్రమంగా వాయిదాలు కట్టినా బ్యాంకు ఖాతాల్లో బకాయిల కారణంగా కొత్తవి రావడం లేదని మహిళలు వాపోతున్నారు. బ్యాంకర్లు నెలనెలా వడ్డీ విధిస్తుండటంతో ఆర్థికభారం పడుతోందని అంటున్నారు.

**రికవరీ చేస్తాం..**

నెల కిందటే బదిలీపై ఇక్కడికి వచ్చా. డ్వాక్రా మహిళలు చెల్లించిన స్త్రీనిధి వాయిదాల సొమ్ము దుర్వినియోగానికి సంబంధించి దస్త్రాలను పరిశీలిస్తా. బాధ్యుల నుంచి కిస్తీల సొమ్మును వసూలు చేసి సంబంధిత మహిళల రుణ ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తా. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆందోళన చెందొద్దు.

బాలయ్య, ఏపీఎం, తాండూరు

# శవ పరీక్షకు వెళ్తే తిప్పలే

కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంచి వైద్య సేవలు అందుతాయని పేరున్నా.. కనీస సౌకర్యాల లేమి మాత్రం ఇబ్బంది పెడుతోంది. శవ పరీక్ష కోసం ఆసుపత్రికి వచ్చిన వారు కూర్చోవడానికి, నిలబడటానికి సరైన షెడ్డు లేకపోవడంతో ఎండలో ఉంటూ వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారు. అక్కడున్న ఓ బాదం చెట్టు కింద మూడు సిమెంట్ బెంచీలు వేసి వదిలేశారు. ఎక్కువ మంది వస్తే మాత్రం నిల్చోవలసిందే.

ఎవరైనా చనిపోతే దూర ప్రాంతాల నుంచి ఇక్కడకు పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తీసుకొస్తారు. వారితో అనుబంధాన్ని మరిచిపోలేని కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు అక్కడకు వస్తుంటారు. అయితే వారికి ఇక్కడ సరైన వసతులు కల్పించలేదు. మూత్రశాలలు లేక తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. పరీక్ష పూర్తవడానికి దాదాపు ఆరేడు గంటలపాటు వేచి ఉండాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో సాయంత్రం ఆసుపత్రికి మృతదేహాన్ని తీసుకొస్తే పోలీసుల ఫిర్యాదు అనంతరం శవపరీక్ష పూర్తయ్యేసరికి మరుసటి రోజు ఉదయం 10 నుంచి 11 గంటల సమయం పడుతోంది. అప్పటి వరకు అక్కడికి వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నారు. వేరే జిల్లాల నుంచి కూడా ఇక్కడికి వస్తుంటారు.

మృతదేహంతో వచ్చిన కుటుంబ సభ్యులు, మహిళా బంధువులు రోదిస్తూ కదలకుండా ఉండటంతో నీరసించిపోతుంటారు. షెడ్డు, తాగునీరు, మూత్రశాలల సదుపాయాలు లేవు. ఆసుపత్రి లోపల ఉన్నా.. కొత్తగా వచ్చిన వారికి అవి తెలియవు. కొంత దూరంలో కూడా ఉంటాయి. దీంతో వారు ఇబ్బందిపడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: డాక్టర్ వీరారెడ్డి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

శవపరీక్ష గది వద్ద ఉన్న ఇబ్బందులను పరిశీలించి.. ఇక్కడికి వచ్చే వారికి సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రి ముందున్న మూత్రశాలలు వాడుకునేలా సిబ్బందికి సూచిస్తాం.

## అతివలు.. ప్రగతి రథ సారథులు

పెద్దపల్లి : స్వశక్తి సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మండల సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల బాధ్యతలు కట్టబెట్టింది. వీటి కొనుగోలుకు రూ.30 లక్షలు కేటాయించింది. వీటిని సద్వినియోగం చేసుకున్న అతివలు ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారు. చిరు వ్యాపారాల నుంచి ఆర్టీసీ బస్సుల నిర్వహణ చేస్తూ ముందుకు సాగుతున్నారు.

**సంఘటితంతో సాధికారత**

చిన్న పరిశ్రమల నిర్వహణ కుటుంబ పోషణకే సరిపోతుండగా రెట్టింపు ఆదాయం పెంచేందుకు మహిళాశక్తిలో భాగంగా క్యాంటిన్, పెరటి కోళ్ల పెంపకం, పాడి గేదెలు, మొబైల్ ఫిష్ వాహనం, సౌర విద్యుత్తు, మీ సేవ ఇలా పలు రకాల యూనిట్లు పంపిణీ చేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి ఆర్టీసీ నిర్వహణ పగ్గాలు వీరికి అప్పజెప్పారు. ఔత్సాహిక మహిళలు వీటిని సద్వినియోగం చేసుకుని పొదుపు మంత్రం జపిస్తూ ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు.

**లాభాల బాట**

తొలి విడతలో ముత్తారం ఉండగా రెండో విడతలో పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం, కమాన్‌పూర్, అంతర్గాం మండలాలకు వచ్చాయి. ఒక్కో సమాఖ్యకు ప్రభుత్వం రూ.30 లక్షలు, మండల సమాఖ్య నుంచి రూ.6 లక్షలు అప్పు తీసుకుని కొనుగోలు చేశారు. బస్సుల నిర్వహణ బాధ్యతలు ఆర్టీసీ చూస్తుంది. మండల




సమాఖ్యలకు నెలకు ఆర్టీసీ రూ.69,750 చెల్లిస్తుంది. రూ.30 లక్షలు తిరిగి చెల్లించడమా, కార్పస్‌ఫండ్ కింద ఇస్తారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. నెలకు రూ.69,750 జమ: స్వప్నరెడ్డి, ఓదెల మండల సమాఖ్య నిర్వాహకులు

ఆర్టీసీ బస్సు కొనుగోలు నిధులు మంజూరు చేయడం సంతోషం. రూ.30 లక్షలు ఇస్తే మరో రూ.6 లక్షలతో బస్సు కొనుగోలు చేశాం. ప్రతి నెల రూ.69,750 ఆర్టీసీ మా ఖాతాలో జమ చేస్తోంది.

**ఆత్మవిశ్వాసం పెరిగింది: శ్రీలత, అంతర్గాం సమాఖ్య నిర్వాహకులు**

మా మండల సమాఖ్యకు నాలుగు నెలల కిందట ఆర్టీసీ బస్సు ఇచ్చారు. ఏడేళ్లపాటు ఒప్పందం కుదిరింది. వంటింటికే పరిమితమైన మాకు ఆర్టీసీ నిర్వహణ బాధ్యత ఇవ్వడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది.

సభ్యులకు తోడ్పాటు: శిరీష, కమాన్‌పూర్ సమాఖ్య నిర్వాహకులు

మాకు కేటాయించిన బస్సును గోదావరిఖని డిపో పరిధిలో నడిపిస్తున్నాం. ఆర్టీసీ చెల్లించే అద్దె సొమ్మును సభ్యులకు వినియోగించుకోనున్నాం. బస్సు నిర్వహణ బాధ్యత ఆర్టీసీ చూసుకుంటుంది.

## ఏఐ పాఠాలు.. కోడింగ్ శిక్షణ

పెద్దపల్లి : నిత్య జీవితంలో సాంకేతికత అంతర్భాగమైంది. ఏ పని చేయలన్నా టెక్నాలజీపై ఆధారపడాల్సి వస్తోంది. ఆధునిక యుగంలో విద్యార్థులకు సాంకేతిక పాఠాలు అందించేందుకు బడుల్లో ఏఐ బోధన అమలవుతోంది. సాంకేతికను నేర్చుకోవడమే కాకుండా విద్యార్థులను కోడింగ్ తయారీలో సృష్టికర్తలుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తోంది. ఈ మేరకు ఏఐ బోధన, కోడింగ్ ఇతర సాంకేతికతను ఎలా నేర్పించాలనే అంశాలపై ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. గతేడాది తొలి విడతలో ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ బోధన అమలు చేశారు. ప్రస్తుతం ఉన్నత బడుల్లో ఏఐ పాఠాలు బోధించేందుకు ఫిజికల్ సైన్స్, గణితం సబ్జెక్టు బోధకులకు మూడు రోజులు, ఆంగ్లం, సాంఘికశాస్త్ర సబ్జెక్టుల బోధకులకు ఒక రోజు చొప్పున శిక్షణ ఇస్తున్నారు. ముందుగా ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఒకరిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. వీరంతా జిల్లాలో ఉపాధ్యాయులకు



తర్ఫీదు ఇస్తున్నారు.

**ఆవిష్కరణాత్మక ఆలోచనలకు పదును**

భవిష్యత్తులో విద్యార్థులను ఆధునిక సాంకేతికత వైపు మళ్లించేందుకు ఏఐ బోధన కీలకంగా మారింది. తరగతి గదిలో కోడింగ్, డేటా సైన్స్, ఏఐ టూల్స్, డిజైన్ థింకింగ్ వంటి రంగాలపై పట్టుసాధించనున్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత ఆవిష్కరణాత్మక ఆలోచనలు పెంపొందుతాయి. ఉద్యోగాలకు మాత్రమే కాదు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదుగుతూ బాల్య దశలోనే సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించనున్నారు.

**మెరుగైన బోధనకు దోహదం: పీఎం షేక్, సమగ్రశిక్షా జిల్లా సమన్వయకర్త** ఆధునిక విద్య అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం. కంప్యూటర్లపై ఏఐ పాఠాలు, కోడింగ్, ఇతర అంశాలను నేర్పిస్తున్నాం. విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.

**సాంకేతికతపై లోతైన విజ్ఞానం: కిషోర్, డీఆర్పీ(రీసోర్స్ పర్సన్)**

కార్పొరేట్ స్థాయిలో కృత్రిమ మేధస్సు, కోడింగ్, డిజిటల్ అక్షరాస్యతపై లోతైన విజ్ఞానం అందనుంది. కోడింగ్‌లో సృష్టికర్తలుగా మారనున్నారు. కొత్త కోణంలో సమస్యలకు పరిష్కారం చూడటంతోపాటు ఆలోచన శక్తి పెరగనుంది. పిల్లల భవిష్యత్తుకు ఉన్నత బాటలు వేయనున్నారు.

చురకలు



# వణికిస్తున్న డెంగీ.. మలేరియా

కొత్తగూడెం: జిల్లాలో డెంగీ, మలేరియా కోరలు చాస్తోంది. కేవలం 12రోజుల వ్యవధిలో మలేరియా పాజిటివ్ కేసులు 43, డెంగీ కేసులు 34 నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఆగస్టు 19నాటికి మలేరియా 11, డెంగీ 54 కేసులుండగా.. ప్రస్తుతం మలేరియా 54, డెంగీ 88గా నమోదయ్యాయి. గత కొన్ని రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు.. ముసురుతో కూడిన వర్షాల కారణంగా అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయి. వైరల్ జ్వరాలు, జలుబులతో పాటు విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా ఆళ్లపల్లి మండలంలో డెంగీ కేసులు అధికంగా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

**జులైలో అయిదు.. ఆగస్టుకు 88**

జిల్లాలో నెల వ్యవధిలోనే పరిస్థితులు మారిపోయాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు డెంగీ కేసులు ఐదు నమోదు కాగా.. ఆగస్టు చివరి నాటికి అవి 88కి చేరాయి. కేవలం ఒక్క నెలలోనే 83 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ అధికారిక లెక్కలు. ప్రైవేటు ఆసుపత్రుల్లో, ఇతర నగరాల్లో చికిత్స పొందుతున్న జిల్లా వాసులు అనధికారికంగా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇవి కాకుండా జలుబు, దగ్గు, తీవ్ర ఒళ్లు నొప్పులు, కళ్లమంట, శ్వాస సంబంధిత వ్యాధి బాధితులు జిల్లా సర్వజనాసుపత్రికి బారులుదీరుతున్నారు. ఇంటో ఒకరు వ్యాధి బారిన పడితే వరుసగా కుటుంబ సభ్యులందరికీ వ్యాపిస్తోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య లేమి, నిధుల కొరత, తేమ వాతావరణం కారణంగా సెప్టెంబరులోనూ సమస్య తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పడకేసిన పారిశుద్ధ్యం**

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తోడు.. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఏజెన్సీలో ఇదే సమస్యతో వ్యాధులు ప్రబలుతున్నట్లు అర్థమవుతోంది. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా దోమల నివారణ చర్యలను గాలికొదిలేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కల్పన ఆశించిన స్థాయిలో లేకపోవటం



ప్రతికూలంగా మారింది. జిల్లాలో మలేరియా హైరిస్క్ విభాగం కింద 80గ్రామాలు, డెంగీ హైరిస్క్ విభాగం కింద 162 గ్రామాలు ఉన్నట్లు అధికారులు ప్రకటించడమే ఇందుకు నిదర్శనం.

**స్వీయ సంరక్షణ చర్యలే కీలకం**

వ్యాధులు విజృంభించకుండా స్వీయ జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్త పడాలి. వర్షాకాలంలో కాచివడపోసిన నీటిని తాగడం ఉత్తమమని, వేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను తీసుకోవాలని, జ్వరం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో కేసులు
మలేరియా: 54
డెంగీ: 88

'వైద్యశాఖ పరంగా గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహిస్తున్నాం. ఇంటింట జ్వర సర్వే నిర్వహించి, పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల మందు పిచికారి చేయిస్తున్నాం.' డా.స్పందన, మలేరియా జిల్లా ప్రోగ్రాం అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# కొత్త ప్రాజెక్టులపైనే తగ్గింపు

హైదరాబాద్: కొన్ని రకాల నిర్మాణ సామగ్రిపై ఈనెల 22 నుంచి జీఎస్టీ తగ్గింపు అమల్లోకి రానుంది. తద్వారా నిర్మాణ వ్యయం తగ్గే అవకాశం ఉంది. ఎంత మేరకు తగ్గుతుందనే దానిపై బిల్డర్లు మదింపు చేస్తున్నారు. ఆ ప్రకారం కొనుగోలుదారులకు బదిలీ చేస్తారా? అంటే బిల్డర్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. సిమెంట్, టైల్స్, మార్బుల్స్ వంటి సామగ్రిపై జీఎస్టీ శ్లాబులను మార్చారు. సిమెంట్ సరఫరాదారులు ధరలు తగ్గిస్తే గృహ కొనుగోలుదారులకు ఆ ప్రయోజనాన్ని అందిస్తామని కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) తెలిపింది.



2-2.5 శాతం వరకు.. తగ్గింపు కొత్త ప్రాజెక్టులపైనే ఉంటుందని, నిర్మాణంలో ఉన్నవాటిపై కాదనే అభిప్రాయం కొందరు బిల్డర్లు వ్యక్తం చేస్తున్నారు. 'స్టీల్‌పై జీఎస్టీ 18 శాతంలో మార్పు లేదు. సిమెంట్‌పై 28 నుంచి 18 శాతానికి మార్చారు. కొన్నింటిపై ఇప్పుడు 5 శాతం ఉంటే 18 శాతానికి పెంచారు. ఇవన్నీ మదింపు చేశాక జీఎస్టీ రేట్ల సవరణతో నిర్మాణ వ్యయం రెండు నుంచి రెండున్నర శాతం తగ్గే అవకాశం ఉంది. కానీ ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 60 శాతం వరకు సామగ్రి కొనుగోలు చేసి ఉంటారు. అంతేకాకుండా ముందు కొనుగోలు చేసిన వారి కంటే... తర్వాత కొనుగోలు చేసే వారికి తక్కువ ధరకిస్తే సమస్యలు వస్తాయి. ఈ నేపథ్యంలో పాత ప్రాజెక్టుల్లో ధరలు తగ్గించడం కంటే ప్రొడక్ట్ అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉంది. దీనిపై అధ్యయనం చేసున్నాం. కొత్త ప్రాజెక్టులకు మాత్రం తగ్గింపు వర్తిస్తుంది' అని బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన 'నగరం లోపల నగరం- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్'పై సమావేశంలో ఏఎస్‌బీఎల్ సంస్థ సీఈవో అజితేష్ కొరుపోలు అన్నారు. కేవలం ఆఫీస్ కారిడార్ అనే పరిమితిని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ దాటిందని .. నివాస, వినోద, ఆహార కేంద్రాలతో నగరంలోనే నగరంగా ఎదిగిందని పేర్కొన్నారు.

# నాలా.. ఎన్నాళ్లిలా?



హైదరాబాద్: ఏటా వర్షాల వల్ల నగరంలో లక్షల కుటుంబాలు నష్టపోతున్నాయి. యంత్రాంగం మాత్రం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతోంది. ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలతో.. నాలాలపై ఉన్న ఆక్రమణలన్నింటినీ తొలగిస్తామంటూ.. నాలా విస్తరణ పనులకు టెండర్లు పిలుస్తోంది. భూసేకరణ చేపట్టలేక.. రెండు, మూడేళ్లకు పనులను ఆపేస్తోంది. వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డీపీ) రెండో దశ పనులే అందుకు నిదర్శనం. ఏడాది కిందట రూ.667కోట్ల అంచనా వ్యయంతో పనులు మొదలవగా.. ఇప్పటి వరకు 10శాతం పురోగతి కూడా లేదు.

రెండోదశ 10 శాతమే.. 2021లోఎస్ఎన్‌డీపీ తెరపైకి తెచ్చారు. మొదటి దశ పనులు 2023 నాటికి 80శాతం పూర్తయ్యాయి. భూసేకరణ జరగక.. మిగిలినవి పూర్తవలేదు. ఏడాది కిందట మొదలైన రెండో దశ పనులు భూసేకరణ సమస్యతో కేవలం 10శాతమే జరిగాయి.

**2020లో..**

జీహెచ్ఎంసీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సర్వే చేపట్టి 80శాతం ముంపు పరిష్కారానికి 12వేల ఆక్రమణలను తొలగించాల్సి ఉందని తేల్చారు. బాధితులకు నష్టపరిహారం, రెండు పడక గదులు ఇచ్చి.. ఆక్రమణలను తొలగించాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశించారు. స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో.. కూల్చివేతలు నిలిచాయి.

హడావుడి నిర్ణయంతో..

కిర్లోస్కర్, వోయంట్స్ కమిటీల ప్రతిపాదనల మేరకు ఎస్ఎన్‌డీపీ-2 పనులకు టెండర్లు పిలిచారు. క్షేత్రస్థాయిలో 3మీటర్లు, 5మీటర్లు ఉన్న నాలాను.. ఒకేసారి 21మీటర్లకు విస్తరించాలని ప్రణాళిక ఇవ్వడంతో.. ఇంజినీర్లు చేతులెత్తేశారు. నాలాలపై అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు ఉన్నాయి. కూల్చితేగానీ పనులు జరగవంటూ పక్కకు జరిగారు.

**ఇవిగో ఉదాహరణలు..**

సున్నంచెరువు, కామునిచెరువు, మైసమ్మ చెరువు, పరికి చెరువు, పటేల్ చెరువు తదితర ప్రాంతాల్లోని వరద నాలాల విస్తరణకు ప్రణాళిక రూపొందించినా ముందుకుసాగడం లేదు.

# దళారెందుకు.. దర్జాగా విక్రయించు!



సంగారెడ్డి : అన్నదాతలు పండించిన పత్తిని దళారుల జోక్యం లేకుండా.. వారు నేరుగా విక్రయించి లబ్ధి పొందేందుకు భారత పత్తి సంస్థ(సీసీఐ) కసరత్తు చేస్తోంది. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచడంతో పాటు 'కపాస్ కిసాన్' యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. వచ్చే నెల మొదటి వారంలో పత్తి సేకరణ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కపాస్ కిసాన్ యాప్‌పై కర్షకులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

**గతంలో అక్రమాలు**

ఉమ్మడి మెదక్ జిల్లాలో 4.90 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అతివృష్టి కారణంగా దిగుబడులపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది సిద్దిపేట జిల్లాలో తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్)ల జారీలో భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. విజిలెన్స్ అదికారులు మార్కెటింగ్‌శాఖ అధికారుల పాత్రపై విచారణ జరుపుతున్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనూ సీసీఐ అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై రైతులకు నష్టం చేశారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను రూపొందించింది.

**సంగారెడ్డిలో నాలుగు.. సిద్దిపేటలో ఐదింటిలో..**

సంగారెడ్డి జిల్లాలో నాలుగు కేంద్రాలలో, సిద్దిపేట జిల్లాలో ఐదింటిలో ప్రయోగాత్మకంగా యాప్ వినియోగించి.. పత్తి కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. సీసీఐ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని సంగారెడ్డి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ రియాజ్ వెల్లడించారు.

**ఎలా పనిచేస్తుందంటే..**

పత్తి పండించిన రైతులందరూ కపాస్ కిసాన్ యాప్‌ను చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకోవాలి.

వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద పంట నమోదు సమయంలో ఇచ్చిన చరవాణి నంబర్ ఆధారంగా ఓటీపీతో లాగిన్ కావాలి.

రైతు పేరు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పట్టా పాసుపుస్తకం నంబరు, పత్తి సాగు చేస్తున్న విస్తీర్ణం తదితర వివరాలు నమోదు చేయాలి.

పంట విస్తీర్ణం తదితర వివరాలన్నీ సీసీఐకి చేరుతాయి. ఫలితంగా రైతు పేరుతో సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పంట తీసుకొచ్చే దళారులు, వ్యాపారులను నియంత్రించే అవకాశం ఉంటుంది.

పత్తి అమ్మేయాలనుకున్న రైతులు ఏ కొనుగోలు కేంద్రంలో, ఎప్పుడు విక్రయిస్తారో ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

# శివారులో భూ సేకరణకు శ్రీకారం



మొయినాబాద్: నగర శివారులోని విలువైన ప్రభుత్వ భూములపై సర్కారు దృష్టిపెట్టింది. గత ప్రభుత్వ హయాంలోనే రాజధానికి ఆనుకొని ఉన్న భూముల వివరాలు సేకరించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ ప్రారంభించింది. ఇప్పటికే మొయినాబాద్ పురపాలిక పరిధిలోని ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటుకు 99.14 ఎకరాలను సేకరించిన సర్కారు తాజాగా ఇదే పురపాలిక పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో 383.07 ఎకరాలను తమ ఆధీనంలోకి తీసుకొనే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే ఆ భూముల సర్వే, ఇతర వివరాలను సేకరించింది. స్థానికులను ఒప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ భూసేకరణ దేనికి అన్నది మాత్రం రహస్యంగా ఉంచింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

సాగులో ఉన్నది కొంతే..

ఇక్కడ ఎకరం రూ.5 కోట్ల వరకు ధర పలుకుతోంది. అవుటర్ రింగురోడ్డుకు 10 కి.మీ.ల సమీపంలోనే విలువైన సర్కారు భూములుండగా వాటిని తిరిగి తమ ఆధీనంలోకి తీసుకుంటోంది. సుమారు రూ.2వేల కోట్లు విలువ చేసే ఇక్కడి భూముల్లో ఏం ఏర్పాటు చేస్తారన్నది మాత్రం చెప్పడంలేదు. మొయినాబాద్ పురపాలిక పెద్దమంగళారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు-149లో 155.12ఎకరాలు, సర్వే నంబరు-218లో 227.35 ఎకరాలున్నాయి. ఇందులో 52 ఎకరాలను గతంలోనే ప్రభుత్వం 16మంది పేదలకు ఇచ్చింది. మిగిలిన భూముల్లో అదే గ్రామానికి చెందిన పేదలు అనధికారికంగా పంటలు సాగు చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్‌కు ఎగువనే ఇవి ఉన్నాయి. ఈ ప్రాంతం జీవో నంబరు-111 పరిధిలో ఉంది. కాలుష్యకారక పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి లేకపోవడంతో పర్యావరణ హితానికి చెందిన సంస్థలే కొలువుదీరేఅవకాశాలున్నాయని తెలుస్తోంది.

**పరిహారం ప్రకటన..**

పేద రైతులకు ఇచ్చిన 52 ఎకరాలకు తీసుకుని వారికి పరిహారం ఇవ్వనుంది. ఎకరానికి 800 గజాల స్థలం చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. మిగిలినవారికి 300 గజాల చొప్పున పట్టాలివ్వాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. వీటిపై రెవెన్యూ అధికారులు ఇటీవలే గ్రామస్థులతో సమావేశమై ప్రభుత్వ ఆలోచనను వివరించారు. వ్యతిరేకత రాకపోవడంతో ప్రక్రియలో వేగం పుంజుకునే అవకాశాలున్నాయి.

మండలం: మొయినాబాద్
రెవెన్యూ గ్రామం: పెద్దమంగళారం
సేకరిస్తున్న భూమి : 383.07 ఎకరాలు
ఎకరం ధర: సుమారు రూ.5కోట్లు

# అర్ధరాత్రి.. ఆకాశానికి చిల్లు!

కొత్తగూడెం: భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు పలుచోట్ల ఆకాశానికి చిల్లుపడిందా అన్నరీతిలో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. అనేక చోట్ల లోలెవల్ వంతెనలు, రహదారుల పైనుంచి వరద చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు కాలనీల్లోకి వాననీరు చేరికతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో నాలుగు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ములకలపల్లి మండలం పూసుగుడెం పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాదారం వద్ద పాములేరు వాగు ఉద్ధృతితో పాల్వంచ-దమ్మపేట రోడ్డు కోతకు గురైంది. ఇల్లెందు పట్టణంలోని చర్చి ఏరియాకు వెళ్లే రహదారిపై వరద నీరు భారీగా చేరడంతో సుమారు 30కుటుంబాలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

చుంచుపల్లి మండలంలోని ఎన్‌కే నగర్ పంచాయతీ పరిధిలోని ఇళ్ల చుట్టూ వాననీరు చేరింది. విద్యానగర్ వద్ద కొత్తగూడెం-ఖమ్మం ప్రధాన



రహదారిని వరద చుట్టుముట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దమ్మపేటలో భారీ వర్షం నమోదు కావడంతో వరద నీరు రోడ్లపైకి చేరింది. దుకాణ సముదాయాలను చుట్టేసింది.

పాల్వంచలోని శ్రీనివాస కాలనీలోని రహదారిపైకి వర్షపు నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి 18వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు.

గోదావరి తగ్గుముఖం

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం రాత్రి 11గంటలకు 47.80 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి 8గంటల వరకు 42.70అడుగులకు తగ్గింది.


కొత్తగూడెంలో (192.4 మి.మీ), ఇల్లెందులో(150.6), చుంచుపలి (147.6), లక్ష్మీదేవిపల్లి(121.2), అశ్వారావుపేట(111.6), అన్నపురెడ్డిపల్లి(105.4) వర్షం కురిసింది. అత్యల్పంగా భద్రాచలం (5 మి.మీ), ఆళ్లపల్లి (16.5), దుమ్ముగూడెం(18.4), బూర్గపాడు(19.6) నమోదైంది. జిల్లాలోసాధారణ వర్షపాతం 9.6మి.మీ కాగా.. 75.6 మి.మీ కురవటం గమనార్హం. 688శాతం అధికంగా నమోదైంది. కిన్నెరసాని రిజర్వాయర్ గేట్లు 3 ఎత్తి 15 వేల క్యూసెక్కుల వరదనీటిని సోమవారం దిగువకు విడుదల చేశారు. ఎగువన కురిసిన వర్షాలకు నీటిమట్టం 405.70 అడుగులకు చేరింది.

# సారథి.. ఏం తీరిది!

ఖమ్మం: రవాణా శాఖ సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 'సారథి' వెబ్‌సైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 1నుంచి మూడో విడతలో నిజామాబాద్, ఖమ్మం, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లోని మొత్తం 10 ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు ప్రారంభించారు. జిల్లాలో ఖమ్మం, వైరా, సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో నూతన సేవలకు సంబంధించి కేవలం ఒకే దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంపై అవగాహన, ప్రచారం కొరవడటమే దీని కారణమని స్పష్టంగా అర్థమవుతోంది.

దేశ వ్యాప్తంగా రవాణా శాఖ సేవలను సులభంగా పొందేందుకు వీలుగా కేంద్రం %www.sarathi.parivahan.gov.in% పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సైట్‌లో నమోదైన సేవలను దేశంలో ఎక్కడినుంచైనా పొందే వెసులుబాటు ఉంటుంది. గతంలో ఓ రాష్ట్రంలోని వాహనాలు, వాహనదారుల సమాచారం మరో రాష్ట్రంలో తెలిసే అవకాశం ఉండదు. నూతన విధానంలో ఎక్కడి సమాచారం పొందొచ్చు. ప్రమాద సమయంలో వ్యక్తులు, వారి పూర్తి వివరాలు, వాహనాల సమాచారం తెలుసుకునేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది.

రాష్ట్రంలో తొలి విడతగా రవాణా శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రయోగాత్మకంగా 'సారథి' అమలు చేశారు. రెండో విడతలో 13 ఆర్టీఏ కార్యాలయాలను ఎంపిక చేశారు.



తొలిరోజు వచ్చిన దరఖాస్తులు: 1

**సేవలు ఇలా..!**

వాహనదారులు, దరఖాస్తుదారులు వెబ్‌సైట్ హోం పేజీలోని డైలాగ్ బాక్సులో తెలంగాణ రాష్ట్రం పేరును ఎంపిక చేసుకోవాలి. తర్వాత అందించే అన్ని రకాల సేవలు పేజీలో కన్పిస్తాయి. అవసరమైనదాన్ని ఎంపిక చేసుకొని వివరాలు నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ పత్రాలతోపాటు సేవలకు సంబంధించిన ఆధార పత్రాలు రవాణా శాఖ కార్యాలయంలో సమర్పించాలి. అధికారులు పరిశీలించి అప్రూవల్ చేస్తారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్సు సేవలు మాత్రమే అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**ప్రచారం నిల్**

గత నెలలో సారథి వెబ్‌సైట్‌పై జిల్లా నుంచి ముగ్గురు ఉద్యోగులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత పోర్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లలేదు. ప్రచార విషయంలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్థానిక ఆర్టీఏ అధికారులంటున్నారు. గమనించాల్సిన అంశమేమిటంటే జిల్లాలోని ఉద్యోగులు, అధికారులకు సైతం సారథిపై పూర్తిస్థాయి అవగాహన కొరవడింది. ఫలితంగా తొలి రోజు కేవలం ఒకే దరఖాస్తు వచ్చింది. ప్రస్తుతం తెలంగాణ రవాణా శాఖ వెబ్‌సైట్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తడం లేదు. ప్రభుత్వం, అధికారులు నూతన విధానంపై యుద్ధప్రాతిపదికన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

## వహ్వా.. బడిబువ్వ

కర్నూలు : ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాన్నిస్తున్నాయి. పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి బడికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ఇంటర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. దీంతో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని చెప్పవచ్చు.

**90 శాతం మందికి లబ్ధి**

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద 90 శాతం మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారు. నంద్యాల జిల్లాలోని 1,362 పాఠశాలల్లో 1.25 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో సుమారు 1.10 లక్షల మంది విద్యార్థులు



మధ్యాహ్న భోజనం తింటున్నట్లు అధికారులు లెక్కించారు. కర్నూలు జిల్లాలోని 1,430 పాఠశాలల్లో 2,48 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 2 లక్షల మంది బడిలో భోజనం చేస్తున్నారు.కర్నూలు జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 6,500 మందికి గాను 6 వేల మంది, నంద్యాల జిల్లాలో 6 వేల మందికి గాను 5,800 మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు.

**మూడు దశల్లో పర్యవేక్షణ**

పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. నిత్యం వండే ఆహార పదార్థాలకు సంబంధించిన ఫొటోలను ప్రధానోపాధ్యాయులు ఎండీఎం యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇందులో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఎంఈవోలు పరిశీలించి జిల్లా విద్యాశాఖకు సమాచారం చేరవేస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలయ్యే విధంగా జిల్లా మానిటరింగ్ అధికారులు పర్యవేక్షిస్తారు.

## కురిసింది.. ముంచింది

భీమవరం: ఉభయ జిల్లాల్లో వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. పలుచోట్ల విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. ఏలూరు జిల్లాలో అత్యధికంగా కైకలూరులో 87.4 మి.మీ., పశ్చిమలో ఉండిలో 56.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. కైకలూరులో ఎంపీడీవో, సబ్ ట్రెజరీ కార్యాలయాలు నీటమునిగాయి. పిడుగుపాటుకి టి.నరసాపురం మండలం వల్లంపట్లలో పలు ఇళ్లలో విద్యుత్తు వస్తువులు కాలిపోగా, బుట్టాయగూడెం మండలంలో కొత్తపేటలో రెండు చూడి ఆవులు మృత్యువాతపడ్డాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఆచంట ఉండి నియోజకవర్గాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి డ్రెయిన్లలో మురుగునీరు రహదారులపైకి చేరడంతో



కాలువలను తలపించాయి.

**ఉండిలో కుండపోత**

ఉండిలో కురిసిన కుండపోత వర్షంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో మురుగునీరు రెండు, మూడు అడుగుల వరకు నిలిచిపోయింది. ఈ దశలో ద్విచక్ర వాహనాలపై కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితులు తలెత్తాయి. పాములపర్రు గ్రామ పరిధిలోని వెంకట్రాజపురం కాలనీలోని కొన్ని ఇళ్ల మెట్ల వరకూ నీరు చేరింది. పల్లపు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రానికి కూడా వర్షపు నీరు పూర్తిగా బయటకు వెళ్లలేదు. మరోవైపు దోమల బెడద బాగా పెరిగింది.

## బర్లీ పొగాకు నిషేధమెలా?

ఒంగోలు : జిల్లాలో నల్లబర్లీ పొగాకు నిల్వలు పేరుకుపోవడంతో ఈ ఏడాది సాగును ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. పొగాకు కంపెనీలతో ఒప్పందం ఉంటేనే తెల్లబర్లీ సాగు చేపట్టాలని ఆదేశాలిచ్చింది. దీనిపై రైతులకు అవగాహన కల్పించేవారు లేకపోవడం సమస్యగా మారింది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేల్కొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే విధంగా రైతులను చైతన్యపరచాల్సి ఉంది. గతేడాది నల్లబర్లీ పొగాకు భారీఎత్తున సాగు చేయడంతో జిల్లాతోపాటు పొరుగున బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో 20 వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తయింది. వీటిని కొనుగోలుకు కంపెనీలు ముఖం చాటేయడంతో రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సి వచ్చింది. రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేపట్టింది. జిల్లా నుంచే వేయి మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయగా, వందల మెట్రిక్ టన్నుల నల్లబర్లీ పొగాకు నిల్వలున్నాయి. వీటి కొనుగోలు ఎప్పుడు చేస్తారా.. అని రైతులు ఎదురుచూస్తున్నారు. ఇదే మాదిరిగా తెల్లబర్లీ పొగాకు నిల్వలు భారీఎత్తున ఉన్నాయి. ఇప్పటికే నిల్వలు పేరుకుపోవడంతో ప్రభుత్వం నల్లబర్లీ పూర్తిగా నిషేధించగా, తెల్లబర్లీ ఎవరైతే కొనుగోలు చేస్తారో ఆ కంపెనీతో ఒప్పందం ఉంటేనే సాగు చేయాలని ఆదేశాలిచ్చింది. కమిటీల ఏర్పాటు: నల్లబర్లీ, తెల్లబర్లీ సాగు కట్టడి చేసేందుకు మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసింది. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు కమిటీలో ఉన్నారు. ఎక్కడైనా సాగు చేస్తే సంబంధిత మండల వ్యవసాయాధికారిపై చర్యలు తీసుకునేలా ఆదేశాలున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం అవగాహన అంతంత మాత్రంగా ఉంది. కంపెనీతో ఒప్పందం ఉందని చెప్పి తెల్ల బర్లీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రాయితీపై విత్తనాలు అందిస్తాం: బర్లీ సాగుపై ఆంక్షలు ఉన్నందున అపరాలు, మొక్కజొన్న, మిల్లెట్స్ సాగు చేపట్టాల్సిందిగా రైతులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. రాయితీపై విత్తనాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు వ్యవసాయాధికారులను కలిసి రాయితీ విత్తనాలు పొందవచ్చు.

## నిజాలకు పాతర.. పాత రోడ్డుతో అక్రమాల జాతర!



విశాఖపట్నం: అది జన సంచారం అంతంతమాత్రంగా ఉండే రహదారి. కొన్ని దశాబ్దాలుగా కొన్ని చోట్ల 40 అడుగులు, మరికొన్ని చోట్ల 60 అడుగుల వెడల్పుతో ఉంది. ఇక్కడున్న సిమెంట్ ఫ్యాక్టరీ దాటి ముందుకెళితే రైల్వేట్రాక్‌లు, మేహాద్రి రిజర్వాయర్, కొండలున్నాయి. ముమ్మందూ ఇదే పరిస్థితి ఉంటుంది. అలాంటి చోట రోడ్డు విస్తరణ అంటూ టీడీఆర్‌ల కొట్టేసే వ్యూహం కలకలం రేపుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని ఇద్దరు నేతలు కలిసి పావులు కదుపుతుండటంతో దస్త్రాలు శరవేగంగా సిద్ధమవుతున్నాయి.

గతంలో: అరకు వెళ్లే మార్గంలో బీఆర్‌టీఎస్ నుంచి నాయుడుతోట కూడలి–ఆంధ్ర సిమెంట్ కంపెనీ– పొర్లుపాలెం కూడలి వరకు 2.6 కి.మీ. మేర వంద అడుగులుగా విస్తరించేందుకు రహదారి అభివృద్ధి ప్రణాళిక చేశారు. రోడ్డు విస్తరణ వల్ల వేపగుంట, వెంటాపురం ప్రాంతాల్లోని వివిధ సర్వే నెంబర్లలో 50,012 చదరపు మీటర్లు ప్రైవేటు స్థలం నష్టపోతారని, రూ.700 కోట్ల టీడీఆర్ ఇవ్వాలని తొలుత పావులు కదిపారు. అభ్యంతరాలు రావడంతో కొన్ని రోజులుగా దస్త్రాలు పక్కన పెట్టేశారు.

తాజాగా: వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ రోడ్లపై అభ్యంతరాలు ఆహ్వానించగా ఇక్కడ 40 అడుగులుగా రోడ్డును విస్తరించాలని అనకాపల్లి జిల్లా పరిధిలోని ఓ నేతతో లేఖ ఇప్పించారు.

ఇప్పటికే 40 అడుగుల పాత రోడ్డు ఉన్నా మళ్లీ లేఖ ఇవ్వడం గమనార్హం. విస్తరణ వల్ల 18,230 చదరపు మీటర్ల పరిధిలో ప్రైవేటు/సింహాచలం ఆలయ భూములపై ప్రభావం ఉంటుందని దస్త్రాలు సిద్ధం చేశారు. వాస్తవానికి ప్రైవేటు వ్యక్తుల భూములుంటే గతంలో మేహాద్రి రిజర్వాయర్ పైపులైన్లు వేసినప్పుడో, ఇరవై ఏళ్ల కిందట ఆంధ్ర సిమెంట్స్ కంపెనీ రోడ్డు వేసినప్పుడో టీడీఆర్‌లు ఎందుకు ఇవ్వలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గూడు పుఠాణి

మొదట 40 అడుగుల రోడ్డుకు టీడీఆర్‌లు తీసుకుంటే '22ఏ' రికార్డుల్లోని సింహాచల దేవస్థాన భూములకు, కొండపోరంబోకుగా ఉన్న భూములకు ప్రైవేటువనే రాజ ముద్ర పడుతుంది. ఆ తర్వాత వంద అడుగుల విస్తరణ కథ నడిపి మళ్లీ టీడీఆర్‌లు కొట్టేయొచ్చని పన్నాగం పన్నారనే అంశం చర్చనీయాంశమవుతోంది. ఇక్కడ టీడీఆర్‌లు ఇస్తే ఓ నేత భారీగా లబ్ధిపొందే అవకాశం ఉంది. ఇందుకు మరో నేత సహకారం అందిస్తున్నట్లు సమాచారం.

## రిజిస్ట్రేషన్ల కళ.. కాసులు గలగల



నక్కపల్లి : ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చి పెట్టే శాఖల్లో రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఒకటి. ఈ ఆర్థిక సంవత్సరం సగం పూర్తికాగా, జిల్లాలో ఇచ్చిన లక్ష్యాన్ని మించి ఆదాయం సమకూరింది. ఏడాది పూర్తయ్యేలోగా శతశాత లక్ష్యాన్ని పూర్తిచేసే దిశగా అన్ని కార్యాలయాలు సాగుతున్నాయి.జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఇందులో ప్రధానంగా కొన్ని కార్యాలయాల పరిధిలో భారీగా రిజిస్ట్రేషన్లు జరగడంతో లక్ష్యాలను దాటిపోయాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం సగానికి పైగా మాత్రమే వచ్చింది. ఈ ఏడాది ఆరంభం తర్వాత నుంచి అన్ని ప్రాంతాల్లో క్రయ, విక్రయాలు జోరందుకున్నాయి. ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు భారీ ఎత్తున పెట్టుబడులు తెస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పరిశ్రమలుండటం, నూతనంగా మరిన్ని వస్తుండటం రియల్ బూమ్ క్రమేపీ పెరుగుతోంది.ముఖ్యంగా నక్కపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, సబ్బవరం కార్యాలయాల పరిధిలో భారీ లక్ష్యాలు విధించగా, దాదాపు ఇవన్నీ లక్ష్యాలను దాటేశాయి. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సారి ఆర్థిక సంవత్సరం అర్ధభాగంలోనే చాలా మంచి పురోగతి వచ్చింది. ఫలితంగా కార్యాలయాలు క్రయ, విక్రయదారులతో రద్దీగా ఉంటున్నాయి.

ఈ ఏడాది లక్ష్యం రూ. 319 కోట్లు లక్ష్యం విధించారు. తొలి ఆరునెలల్లో రూ. 146.37 కోట్ల లక్ష్యానికి గాను, రూ. 161.88 కోట్ల ఆదాయం సమకూరింది. అదేవిధంగా గతేడాదితో పోల్చితే వృద్ధి రేటు గణనీయంగా పెరగడం విశేషం

**సేవలు మెరుగుపడ్డాయి**

రిజిస్ట్రేషన్ల విషయంలో తీసుకువచ్చిన సంస్కరణలతోపాటు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అమలు ధరల హేతుబద్ధీకరణతో ఆదాయం పెరిగింది. ముఖ్యంగా పారిశ్రామీకరణ ప్రభావంతో ఎలమంచిలి, నక్కపల్లి కార్యాలయాల్లో ఆదాయం భారీగా వచ్చింది. దీనికి తోడు రిజిస్ట్రేషన్లలో వేగం పెరగడం, వెనువెంటనే డాక్యుమెంట్లు అందించడం వంటి సేవలు బాగా మెరుగుపడ్డాయి. ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్నీ చేరుకుంటాం. కె.మన్మథరావు, జిల్లా రిజిస్ట్రార్

## రాయింబవళ్లు తవ్వకాలే



బనగానపల్లి: ఆలయ భూములపై అక్రమార్కులు కన్నేశారు. నాపరాతి గనులు ఉండటంతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అవకాశంగా విలువైన రాయిని తరలించేస్తున్నారు. బనగానపల్లి మండలం పలుకూరులో రామేశ్వరస్వామి ఆలయానికి 40 ఎకరాల విలువైన భూములున్నాయి. గ్రామ సమీపంలోని సర్వే నంబరు 308లో నాలుగు ఎకరాల్లో నాపరాతి గనులు ఉన్నాయి. వీటిపై కన్నేసిన అక్రమార్కులు రోజూ 4, 5 ట్రాక్టర్లలో విలువైన రాయిను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేయింబవళ్లు తవ్వకాలు చేస్తున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. మొత్తం నాలుగు ఎకరాల్లో ఓవైపు నుంచి సుమారు రెండు ఎకరాల్లో తవ్వకాలు సాగుతున్నాయి. ఏటా సుమారు రూ.22 లక్షలకుపైగా నాపరాతిని అమ్మేసుకుంటున్నారు.

**లీజుకు ఇవ్వక.. తవ్వకాలు అడ్డుకోక**

అక్రమార్కుల చెరలో సుమారు రూ.2 కోట్ల విలువైన భూమి ఉంది. ఈ భూములను లీజుకిస్తే రూ.6 కోట్లకుపైగా విలువ చేసే నాపరాయి వెలికితీసే అవకాశముంది. దేవాదాయ శాఖకు పెద్దఎత్తున ఆదాయం సమకూరుతుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. పదేళ్ల కిందట అధికారులు దాడులు జరిపారు. అప్పటినుంచి తవ్వకాలు ఆగిపోయాయి. తర్వాత ఎవరూ దృష్టి సారించకపోవడంతో గత రెండేళ్లుగా యథాస్థితికి చేరింది.

**ఫిర్యాదు చేసినా ఫలితం లేదు**

ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ పూజారి భాస్కరయ్య పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ప్రయోజనం శూన్యమే. కొందరు అధికారులు మాత్రం తూతూమంత్రంగా ఆలయ భూముల్లో పర్యటించి ఎలాంటి తవ్వకాలు జరగడం లేదంటూ నివేదికలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వారు వస్తున్నట్లు అక్రమార్కులకు సమాచారం అందడం.. ఆ సమయంలో గని గుంతల్లో పనులు ఆపేయడం.. వారు వెళ్లిపోయాక తిరిగి ప్రారంభించడం సదా మామూలైంది. "అక్రమ మైనింగ్ విషయాన్ని ఉన్నతస్థాయి అధికారులకు నివేదిక పంపాం. ఈ గనిని లీజుకు వేలం వేసి ఆలయానికి ఆదాయం వచ్చేలా చూడాలని చెప్పా. మా పరిధిలో అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటామని" ఈవో బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

## దారి మరిచిన వైకాపా

నంద్యాల : నంద్యాల–పులిమద్ది రహదారిలో వంతెన నిర్మాణానికి ఎన్డీబీ కింద ప్రతిపాదించారు. గత ప్రభుత్వ హయాంలో పనులే ప్రారంభం కాలేదు. వంతెనతోపాటు కల్వర్టుల నిర్మాణాలను పక్కన పెట్టారు. ప్రస్తుతం రహదారి పనులు చేపట్టాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది.ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు) రహదారులపై గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. గుత్తేదారులకు బకాయిలు చెల్లించలేదు. వాటా నిధులు విడుదల చేయలేదు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టాల్సిన రహదారులను గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకపోవడంతో ప్రస్తుత కూటమి సర్కారుపై పెను భారం పడింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు రహదారుల పనులను కుదించి ఎండీఆర్, స్టేట్ హైవే కింద కొత్తగా చేపట్టనున్నారు.

**రూ.352 కోట్లు మంజూరు చేసినా..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దెబ్బతిన్న రహదారుల అభివృద్ధి, విస్తరణకు 2021లో ఎన్డీబీ రుణం కేటాయించింది. మొత్తం 16 రహదారులను



165 కి.మీ. పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.352 కోట్లు మంజూరు చేసింది. ఇందులో 70 శాతం బ్యాంకు రుణం ఇస్తుండగా.. రాష్ట్ర వాటా 30 శాతంగా ఉంది. బ్యాంకు తన రుణాన్ని జమ చేయగా నాటి వైకాపా సర్కారు రాష్ట్ర వాటాను జత చేయలేదు. ఫలితంగా రహదారుల పనులు ఆగిపోయాయి. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో మాత్రమే రెండు పనులు పూర్తయ్యాయి.

**వినియోగించుకోలేక..**

ఎన్డీబీ నిధులను గత ప్రభుత్వం వినియోగించుకోలేకపోయింది. గతంలో ఈ పథకం కింద చేర్చిన రహదారులను ప్రస్తుతం ఎండీఆర్, స్టేట్ హైవే కింద తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. నిధులు మాత్రం తగ్గిపోయాయి. ఎన్డీబీ కింద రహదారుల వెడల్పు, పటిష్టతతో పాటు రహదారి పొడవునా అవసరమైన కల్వర్టులు, వంతెనలు నిర్మించ తలపెట్టారు. ప్రస్తుతం కేవలం రహదారుల అభివృద్ధి పనులు మాత్రమే చేయనున్నారు.

గతంలో నంద్యాల జిల్లాలోని శిరువెళ్లమెట్ట–గోస్పాడు రహదారి అభివృద్ధిలో భాగంగా రెండు వరుసలతోపాటు వంతెనల నిర్మాణాలను ప్రతిపాదించారు. ప్రస్తుతం కేవలం రోడ్డు పనులకు మాత్రమే నిధులు విడుదలయ్యాయి. కర్నూలు జిల్లాలో ధణాపురం–హొళగుంద రోడ్డుకు గతంలో ప్రతిపాదించిన నిధుల్లో 30 శాతం వరకు కోత పెట్టారు. మదిరె–కాత్రికి, నదిచాగి–బాపురం, కరివేముల–ఆరేకల్లు రహదారులకు గతంలో రూ.20 కోట్ల వరకు కేటాయించగా ప్రస్తుతం రూ.15.60 కోట్ల నిధులు కేటాయించారు.

## కుప్పతిప్పలు

ఎమ్మిగనూరు : వ్యవసాయ మార్కెట్‌కు ఏటా లక్షల బస్తాల పంట ఉత్పత్తులు అమ్మకానికి వస్తాయి. దిగుబడుల విక్రయాలతో మార్కెట్‌కు సెస్సు ద్వారా రూ.కోట్ల ఆదాయం వస్తోంది. కానీ పంట అమ్మే సమయంలో వానొస్తే కప్పేందుకు టార్పాలిన్లు లేని దుస్థితి ఏర్పడింది. ప్రతిపాదనలు పంపినా దిక్కులేదు. మార్కెట్‌లోని వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం అస్తవ్యస్తంగా మారి రైతుల పాలిట శాపంగా మారింది.

**ఏడు లక్షల సంచులు రాక**

వ్యవసాయ మార్కెట్‌లో ఏటా 6–7 లక్షల సంచుల వరకు వేరుసెనగ, ఆముదాలు, కందుల విక్రయాలు జరుగుతున్నాయి. ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలతోపాటు అనంతపురం సరిహద్దు ప్రాంతం నుంచి పంట ఉత్పత్తులను అమ్మేందుకు మార్కెట్‌కు తెస్తారు. సెస్సుల ద్వారా గతేడాది రూ.8.50 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.3 కోట్లు లభించింది.

**తడిసిపోతున్న దిగుబడులు**

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మార్కెట్లో కుప్పగా పోసి టెండర్‌కు పెడతారు. తూకాలు వేసేందుకు సాయంత్రం అవుతుంది. అకస్మాత్తుగా వర్షాలు కురిస్తే దిగుబడులు తడిసిపోతున్నాయి. గత ఏడాది భారీ వర్షం కురిసి టెండరు సమయంలో వేలాది వేరుసెనగ, ఇతర దిగుబడుల బస్తాలు తడిసి రైతులు నష్టపోయారు. దిగుబడులు తడవకుండా కప్పేందుకు మార్కెట్లో టార్పాలిన్లు లేవు. ఏజెంట్లు రైతుల నుంచి రూ.వేల కమీషన్ తీసుకుంటున్నా.. వారి వద్ద టార్పాలిన్లు లేవు. కనీసం 200 టార్పాలిన్లు అవసరం. ఇందుకు రూ.6–8 లక్షల వ్యయం అవుతుంది. రైతుల సంక్షేమం కోసం ఇంతమాత్రం నిధులు



కేటాయించలేని పరిస్థితిలో మార్కెట్ అధికారులు ఉండటం గమనార్హం.

**వర్షం వెళ్లే మార్గం లేక**

మార్కెట్‌ను 23 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. సీజన్‌లో సుమారు మూడు వందల మంది రైతులు.. 15 వేల బస్తాలు అమ్మేందుకు తెస్తారు. వర్షం వస్తే నీరు మార్కెట్ ఆవరణ నుంచి బయటకు వెళ్లే మార్గం సరిగా లేదు. అస్తవ్యస్తంగా మారడంతో మార్కెట్లోనే నిలిచిపోతోంది. వాన నీరు వెళ్లే మురుగు కాల్వలు ఆక్రమణకు గురయ్యాయి. " మార్కెట్లో దిగుబడులు టెండర్‌కు పెట్టినప్పుడు తడవకుండా వంద టార్పాలిన్లకు ప్రతిపాదనలు పంపాం. వర్షం నీరు మార్కెట్లో నిల్వకుండా చర్యలు తీసుకుంటామని" ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి అన్నారు.

చురకలు

శుక్రవారం 17 అక్టోబర్ 2025

## జూద స్థావరాలపై డ్రోన్లతో నిఘా

ఒంగోలు : కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్న జూదంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జీవితాలను అతలాకుతలం చేస్తున్న జూదం, కోడిపందేలపై సామాన్యులు ఆకర్షితులు కాకుండా వరస దాడులు చేస్తున్నారు. పోలీసుల దాడులతో ఉలిక్కిపడి వారికి చిక్కకుండా తమ కార్యకలపాలు సాగించేందుకు కొందరు వ్యసనపరులు కొండలు, గుట్టలు ఎంచుకుని గుట్టుచప్పుడు కాకుండా జూద శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ తరహా దందాకు చెక్ పెట్టేందుకు పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. డ్రోన్ల సాయంతో కొండలు, గుట్టలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పద ప్రాంతాల్లో జిల్లావ్యాప్తంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో డ్రోన్లతో పెట్రోలింగ్ చేపడుతున్నారు. ఇలా గుర్తించిన స్థావరాలపై ఆకస్మికంగా మెరుపు దాడులు చేస్తున్నారు. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు జిల్లాలో బాధ్యతలు చేపట్టిన అనంతరం జూదాన్ని అరికట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. శిబిరాల నిర్వాహకులను గుర్తించి వారిపై కఠిన చర్యల దిశగా కసరత్తు చేస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలో జిల్లాలో పెద్దఎత్తున దాడులు చేసి వందల సంఖ్యలో నిందితులను పట్టుకుని వారి వద్ద



నుంచి నగదు, కోళ్లు, కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు.

**ఫిర్యాదు చేయండిలా...**

జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు, జూద శిబిరాలు నిర్వహిస్తుంటే స్థానిక పోలీసులతో పాటు డయల్-112కు సమాచారమివ్వాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

గత నెలరోజుల్లో నమోదైన కేసులు

జూదం కేసులు: 57

పట్టుబడిన నిందితులు: 302 మంది

స్వాధీనం చేసుకున్న సొత్తు: రూ.7.09 లక్షలు

కోడిపందెం కేసులు: 6

పట్టుబడిన నిందితులు: 39 మంది

పట్టుకున్న కోళ్లు: 32

స్వాధీనం చేసుకున్న కోడి కత్తులు: 16

## మారాలి తీరు.. మార్చాలి రూపు!

నెల్లూరు: ఇది బుచ్చి-దగదర్తి రోడు 21 కి.మీ. నిర్మాణానికి రూ. 40 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేయగా- ఇప్పటి వరకు అయిదు కి.మీ. మాత్రమే పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. పనులు ప్రారంభమైనట్లు కనిపించినా.. అడుగు ముందుకు పడలేదు. కొందరు రోడ్డును ఆక్రమించుకోవడం.. మరికొందరి పొలాలు తీసుకోవాల్సి రావడం తదితరాలు పనుల పురోగతికి అడ్డంకిగా మారింది. ఆ మార్గంలో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) రుణంతో జిల్లాలో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతల రహిత రహదారులే లక్ష్యంగా పెండింగ్ బకాయిలు చెల్లించినా... గుత్తేదారుల నిర్లక్ష్యమో.. అధికారుల పట్టింపులేని తనమో.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**అప్పటి నుంచి ఇప్పటి వరకు..**

ఎన్‌డీబీ రుణ సాయంతో.. గత ప్రభుత్వంలో.. మండల కేంద్రాల మధ్య, గ్రామాల నుంచి ప్రధాన మార్గాలకు అనుసంధానంగా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారు. 2021లో ఆరింటికి ఆమోదం లభించగా.. సుమారు రూ. 89 కోట్లతో మొత్తం 56.59 కి.మీ. మేర అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 2023 మార్చి వరకు గడువు విధించారు. కొవిడ్ కారణంగా అదే ఏడాది డిసెంబరుకు గడువు పొడిగించగా.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఆరింటిలో మూడే మొదలవగా.. అవి కూడా నిలిచిపోయాయి. ఇప్పటి వరకు ఒకటి పూర్తవగా.. రెండు రోడ్లను రద్దు చేశారు.

**అలా మొదలెట్టి.. ఇలా వదిలేశారు**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటికే ప్రారంభమై ఆగిపోయిన రోడ్లపై దృష్టి పెట్టింది. దాంతో కావలి-తుమ్మలపెంట, బుచ్చి-దగదర్తి, రాజుపాళెం- ఇస్కపల్లి పనులు జరుగుతున్నాయి. రూ. 33.50 కోట్లతో చేపట్టిన 20.23 కి.మీ. పొడవైన రాజుపాళెం- ఇస్కపల్లి రహదారిని అభివృద్ధి చేస్తే.. పదికిపైగా గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగుతాయి. దాంతో ఇప్పటి వరకు ఇక్కడ 24 కల్వర్టులు పూర్తి చేశారు. త్వరలోనే నార్త్‌ఆములూరు దగ్గర వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. కానీ, కొన్ని రోజులుగా పనులు జరగడం లేదు. కావలి నుంచి తుమ్మలపెంట వెళ్లే రహదారిని రూ. 14.76 కోట్ల అంచనాతో.. మొత్తం 8.30 కి.మీ. రోడ్డు వేస్తుండగా.. ఇప్పుడు ఓ కొలిక్కి వచ్చాయి. గంగవరం మీదుగా కోవూరు, తోటపల్లిగూడూరు-సీవన్‌పల్లి రహదారులు రద్దయ్యాయి.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్ మాట్లాడుతూ.. జిల్లాలో మూడు రహదారుల పనులు జరుగుతున్నాయన్నారు. వర్షాలు పడుతుండటంతో కొంత ఆలస్యమవుతున్నాయని.. త్వరగా పూర్తి చేయిస్తామన్నారు.

## జాతీయ రహదారి 716జీ రెండో విడత పనులు మొదలు



గోరంట్ల : కడప జిల్లా ముద్దనూరు నుంచి హిందూపురం వరకు సుమారు 150 కిలోమీటర్ల దూరాన్ని 716జీ జాతీయ రహదారిగా నాలుగు వరుసల నిర్మాణానికి రూ.2,700 కోట్ల అంచనాలతో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శ్రీసత్యసాయి జిల్లాలో రెండు దశల్లో 91 కిలోమీటర్ల నిర్మాణానికి రెండేళ్ల కిందట పనులు ప్రారంభించారు. మొదటి విడత పనులు తలుపుల మండలం బి.కొత్తపల్లి నుంచి గోరంట్ల వరకు 57 కిలోమీటర్లు రూ.840 కోట్ల అంచనాలతో దాదాపుగా పూర్తికావచ్చాయి. ప్రస్తుతం రెండో విడత పనులు గోరంట్ల నుంచి హిందూపురం వరకు ప్రారంభమయ్యాయి. ఇది పూర్తయితే కడప, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి కర్నాటకకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయి.

నాలుగు జాతీయ రహదారులను కలుపుతూ 716జీ ఏర్పడుతోంది. కదిరి సమీపంలో జాతీయ రహదారి 42, గోరంట్ల సమీపంలో అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌హైవే, పాలసముద్రం సమీపంలో 44 మీదుగా హిందూపురం సమీపంలో ఉన్న చెక్‌పోస్టు - శిరా ఎన్‌హెచ్ 544ఈ కలుస్తోంది.

జాతీయ రహదారి: 716జీ

దూరం : 34 కి.మీ

నిధులు: రూ.809 కోట్లు

మార్గం: గోరంట్ల, సోమందేపల్లి, హిందూపురం గ్రామీణ మండలాల మీదుగా

బైపాస్‌లు: 05 (గోరంట్లలో పెద్దది, మల్లాపల్లి, పాలసముద్రం, పత్తికుంటపల్లి, చిన్నగుండంపల్లి, పెద్దగుడ్డంపల్లి గ్రామాలకు కలిపి ఒకటి) ఈ ఏడాది మే 2న ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా పనులు ప్రారంభించారు

పూర్తి చేయడానికి గడువు: 2027

పనులు ప్రారంభమయ్యాయి : నాగరాజు, ఎన్‌హెచ్, డీఈఈ

గోరంట్ల - హిందూపురం మధ్య 716జీ పనులు గుత్తేదారుకు అప్పగించాం. జంగిల్ క్లియరెన్స్ పనులు సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశాలున్నాయి.

## నేతల అండ ఉండగా.. టెండర్లెందుకు దండగ!!




విశాఖపట్నం :ఆంధ్రవిశ్వ విద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కంటైనర్ క్యాంటీన్‌ల హవా కొనసాగుతోంది. 2022లో అప్పటి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి స్టార్టప్‌ల పేరుతో దక్షిణం, ఉత్తరం క్యాంపస్‌లలో 9 క్యాంటీన్లను ఏర్పాటు చేయించారు. నాడు వైకాపా ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేసిన వారికి కట్టబెట్టారు. అప్పట్లో నెలకు రూ.10వేలు అద్దెగా నిర్ణయించారు. టెండర్లు పిలిచి అప్పగించి ఉంటే వర్సిటీకి రూ.లక్షల్లో ఆదాయం వచ్చేది. తర్వాత క్యాంటీన్ల నిర్వాహకులు అద్దెలు చెల్లించక పోయినా తొలగించకుండా వదిలేశారు..**బయటి వ్యక్తుల తిష్ఠ:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలైంది. ఇప్పటికీ కంటెయినర్ క్యాంటీన్‌లను తొలగించలేదు. వాస్తవంగా వీటి గడువు గత ఏడాది జూన్‌తో ముగిసినా అప్పటి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తొలగించలేదు. తర్వాత ఆయన రాజీనామాతో ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు నిర్వహించిన ఆచార్య జి.శశిభూషణరావు వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. పలువురు నేతలు అడ్డుతగలడం తో తాత్కాలికంగా వాటిని కొన్ని నెలలు కొనసాగించాలని భావించారు. క్యాంటీన్‌లు సాయంత్రం 6గంటల వరకు నడుస్తుండటంతో బయటి వ్యక్తులు వర్సిటీకి వచ్చి గంటల తరబడి తిష్ఠ వేస్తున్నారని, ఈవ్‌టీజింగ్ జరుగుతోందని, గంజాయి కేంద్రాలుగా మారాయని ఆరోపణలు వచ్చాయి. దీంతో సమయాన్ని సాయంత్రం 4గంటల వరకు కుదించారు.

**అద్దెలు చెల్లించకుండానే..:** ప్రస్తుత వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మార్పి ఒకటిన బాధ్యతలు చేపట్టారు. ఆయన దృష్టికి ఈ క్యాంటీన్ల విషయం వెళ్లింది.

ఇప్పుడు కూడా ఓ నేత వాటిని తొలగించకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం పేరిట సాయంత్రం 4గంటల నుంచి 5.30గంటల వరకు సమయం పెంచారు. ఫలితంగా బయట వ్యక్తులు యథేచ్ఛగా వస్తున్నారని చెబుతున్నారు. మరో పక్క ఇప్పటికీ 9 క్యాంటీన్ల నిర్వాహకులు వర్సిటీకి అద్దెలు చెల్లించడం లేదు. ఫలితంగా మూడేళ్లలో సుమారు రూ.32లక్షలు వర్సిటీకి నష్టం వాటిల్లింది.

**సెంట్రల్ క్యాంటీన్ ఎప్పుడు తెరుస్తారో..** పూర్వ వీసీ ప్రసాదరెడ్డి హయాంలో... విద్యార్థుల సమావేశానికి సెంట్రల్ క్యాంటీన్ కేంద్రంగా మారుతోందనే ఉద్దేశంతో దాన్ని మూసివే యించారు. ప్రస్తుత వీసీ రాజశేఖర్ దాన్ని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారు. ప్రిన్సిపాళ్ల బృందంతో కమిటీ నియమించి నివేదిక తెప్పించుకున్నారు. దాన్ని బాగు చేసి ఆగస్టు నెలాఖరుకు ప్రారంభిస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు. ఇప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. సెంట్రల్ క్యాంటీన్ అందుబాటులోకి వస్తే విద్యార్థులకు తక్కువ ధరలో ఆహార పదార్థాలు లభిస్తాయని, అప్పుడు కంటైనర్ క్యాంటీన్ల అవసరం ఉండదని పలువురు అధ్యాపకులు చెబుతున్నారు.

## కొనే వరకూ వదలక... రిజిస్ట్రేషనంటే కదలక!!



విశాఖపట్నం : సీతమ్మధారకు చెందిన ఓ చిరు వ్యాపారి ఆనందపురం మండలం పాలవలస లేఅవుట్‌లో 200 గజాల స్థలం కొనుగోలు చేశారు. డబ్బులు విడతల వారీగా చెల్లిస్తే ఆలస్యమవుతుందని ఒకేసారి చెల్లించేశారు. రెండేళ్లు గడిచినా అతనికి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా తిప్పుతున్నారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం జియ్యన్నవలసలో ఓ ప్రభుత్వ ఉద్యోగి 200 గజాల ప్లాట్ కొనుగోలు చేశారు. విడతల వారీగా డబ్బులు చెల్లించి రెండున్నరేళ్లు గడిచింది. రిజిస్ట్రేషన్ కోసం వీఎంఆర్‌డీఏ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించలేదు. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పటికే డబ్బులు చెల్లించి ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూస్తున్న వారికి నిరీక్షణ తప్పడం లేదు. డబ్బులు మొత్తం చెల్లించాం.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలుపెట్టమని కొనుగోలుదారులు ప్రశ్నిస్తే అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకొస్తున్నారు. నిన్నటి వరకు రిజిస్ట్రేషన్ ఛార్జీల తగ్గింపు ఉత్తర్వులు రావాలంటూ నెట్టుకొచ్చారు. ఇప్పుడు అవొచ్చినా ఆలస్యం చేస్తున్నారు.

**ఇదిగో ఇలా..**

విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలో మధ్యతరగతి ప్రజల కోసం వీఎంఆర్‌డీఏ ఆరు చోట్ల స్మార్ట్‌టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేసింది. వాటిల్లో కొనుగోలు చేసిన వారికి ఆ ప్లాట్లు అప్పగించడంలో ఆలస్యమవుతోంది. మొత్తం ప్లాట్లలో సగానికిపైగా విక్రయించగా రిజిస్ట్రేషన్లు 20 శాతం కూడా కాలేదు.

రఘుమండలో 200 ప్లాట్లను విక్రయించేశారు. జియ్యన్నవలసలో వందకుపైగా విక్రయించారు. పాల వలసలో 250కుపైగా అమ్మగా రిజిస్ట్రేషన్లు జరిగినవి అరకొరే.

గరివిడి, అద్దూరు, భోగాపురంలో లేఅవుట్లకు స్పందన అంతంతమాత్రంగా ఉంది.వర్షాలకు రఘుమండ, మరికొన్ని చోట్ల లేఅవుట్లు అధ్వానంగా తయారయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు చేరాయి. కొనేవరకూ కొన్ని రాయితీలతో ఊరించిన అధికారులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని కొనుగోలుదారులంటున్నారు.

ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లు

ఎక్కడెక్కడంటే : విజయనగరం జిల్లా రఘుమండ, జియ్యన్నవలస, గరివిడి. విశాఖలో పాలవలస, అనకాపల్లిలో అద్దూరు, చోడేపల్లి, భోగాపురం.

ఎకరాలు: 204.96. వేసిన మొత్తం ప్లాట్లు : 1280

## చెరువులకు 'జల'సత్వాలు

ఉదయగిరి : జిల్లాలో 853 చెరువులు ఉండగా తొలి విడత 220 చోట్ల ఆధునికీకరణకు వివరణాత్మక నివేదిక (డీపీఆర్) తయారుచేసి ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం అందించింది. నీటి నిల్వ సామర్థ్యం పెంపునకు స్లూయిజ్‌లు, చెక్‌డ్యాములు, మదుముల నిర్మాణం, కట్టల పనులు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేశారు. వాటి పరిధిలో కాలువలనూ బాగు చేయనున్నారు. నీరు చేరే అవకాశం ఉన్నవి, వంద ఎకరాలకుపైగా ఆయకట్టు ఉండేవి, సాగుతో ఆదాయం పెరిగే అవకాశం ఉన్నవి, ఆయకట్టులో ఎస్సీ, ఎస్టీ రైతులు వ్యవసాయం చేస్తున్నవి పరిగణనలోకి తీసుకుని 220 చెరువులు అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు వెచ్చించనున్నాయి. వైకాపా ప్రభుత్వ పాలనలో జలవనరులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీస కేటాయింపులు చేయక, నిర్వహణ లేక చెరువులు అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం వీటి అభివృద్ధికి పూనుకుంది. కేంద్రం సహకారంతో ఆర్‌ఆర్‌ఆర్ (మరమ్మతులు, పునర్నిర్మాణం, పునరుద్ధరణ) పథకంలో అభివృద్ధి చేయనుంది.



**కర్షకులకు వరమే!**

ఎంపిక చేసిన చెరువులు అభివృద్ధి జరిగితే సాగులో కర్షకుల కష్టాలు తీరుతాయి. భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రస్తుతం ఆక్రమణతో నీరు నిండితే కట్టలు తెగి పంటలు మునిగిపోతున్నాయి. ఈ పథకం కింద పనులు చేస్తే వరద ముంపునకు అడ్డుకట్ట పడుతుంది. అభివృద్ధి చేసిన తరువాత ఆక్రమణలు జరగకుండా చుట్టూ మొక్కలు నాటి పటిష్ఠం చేయవచ్చు 'ఒక్కో దాని అభివృద్ధికి రూ. 20 లక్షల నుంచి రూ. కోటికి పైగా నిధులు అవసరమవుతాయి.

**నివేదికలు పంపాం**జిల్లాలో ఒక్కో చెరువు అభివృద్ధికి ఎంత నిధులు అవసరమవుతాయో నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించాం. విడుదల కాగానే త్వరితగతిన పనులు ప్రారంభిస్తాం.

దేశీనాయక్, ఎస్ఈ, ఇరిగేషన్

## తెలూపుతారా? తొలగిస్తారా?

వెంకటాచలం : వెంకటాచలం మండలం గొలగమూడి కొత్తగుంట స్థలం ఆక్రమణల వ్యవహారం కీలక మలుపు తిరిగింది. 40 రోజుల కిందట సర్వే చేసిన రెవెన్యూ అధికారులు ఆక్రమణలు నిజమని తేల్చి.. హద్దులు ఏర్పాటు చేశారు. స్థలాన్ని పరిరక్షించుకోవాలని పంచాయతీ అప్పగించారు. దాంతో పంచాయతీ అధికారులు ఆక్రమణదారులకు రెండు రోజుల కిందట నోటీసులు జారీ చేశారు. గతంలోనూ విషయం నోటీసుల వరకు వచ్చి.. చర్యలకు మీనమేషాలు లెక్కించిన నేపథ్యంలో.. నోటీసులతో సరిపెడతారా? ఆక్రమణలు తొలగిస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

**2.20 ఎకరాల స్థలం**

గొలగమూడిలో అనికేపల్లికి వెళ్లే మార్గంలో సర్వే నంబరు 58లో కొత్తగుంట 2.20 ఎకరాల్లో విస్తరించి ఉంది. కీలక ప్రాంతం కావడం.. అంకణం రూ. 1.50 లక్షల వరకు పలుకుతోంది. దాంతో పైతట్టులో కొందరు గుంటను పూడ్చి.. నిర్మాణాలు చేపట్టారు. ఇంకొందరు ఆక్రమించి ప్రహరీలు ఏర్పాటు చేశారు. కింది వైపు కొంత స్థలం శివాలయం నిర్మాణానికి కేటాయించి.. శంకుస్థాపన చేయగా.. కొంత మిగిలి ఉంది.



**వ్యాజ్యం దాఖలుతో..** కొత్తగుంట ఆక్రమణలపై వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. మరోవైపు గ్రామస్థులు తహసీల్దారు మొదలు కలెక్టర్ వరకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎలాంటి చర్యలు లేకపోవడంతో.. కొందరు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. కార్యదర్శి, వీఆర్వో మొదలు కలెక్టర్ వరకు బాధ్యులుగా పేర్కొన్నారు.

**నాడు సర్వే.. నేడు నోటీసులు**

దాంతో ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని న్యాయస్థానం కలెక్టర్‌ను ఆదేశించింది. ఆయన సూచనలతో 40 రోజుల కిందట రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. మొత్తం 11 మంది 251 అంకణాలు (41.5 సెంట్లు) ఆక్రమించినట్లు తేల్చారు. దాంతో నోటీసులు జారీ చేసిన పంచాయతీ అధికారులు.. 15 రోజుల్లో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించకుంటే నిబంధనల ప్రకారం రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో ఆ పనిచేస్తామని వాటిలో పేర్కొన్నారు. ఈ విషయాలను పంచాయతీ కార్యదర్శి శివశంకర్ ధ్రువీకరించారు.

## విభజన.. పాలన

నెల్లూరు: జిల్లాలోని పంచాయతీలు గ్రేడ్ పరిధిలోకి వచ్చేశాయి. ఇందుకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడంతో తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతామని జిల్లా పంచాయతీ అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర అధికారుల నుంచి సూచనలు రాగానే జిల్లాలో ప్రక్రియ ప్రారంభం కానుంది. పంచాయతీలకు నిధుల కేటాయింపులో, సిబ్బంది నియామకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు పంపే సందర్భంలో గతం నుంచి కష్టర్లుగా పిలిచేవారు. 2010లో అప్పటి ఉమ్మడి జిల్లాను అనుసరించి విభిన్న విభజించారు. పాత ఉమ్మడి జిల్లాలో 961 పంచాయతీలను 447 కష్టర్లుగా విభజించారు. ప్రస్తుతం వీటి స్థానంలో గ్రేడ్ వ్యవస్థను తీసుకొచ్చింది. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు గత మూడు నెలల నుంచి జిల్లాలోని 722 పంచాయతీల జనాభా, ఆదాయం ఆధారంగా చేసుకొని నూతన గ్రేడ్ వారీగా పంచాయతీలను నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. మంత్రివర్గం చర్చించి గ్రేడ్ వ్యవస్థకు ఆమోదముద్ర వేసింది. మొత్తం నాలుగు గ్రేడ్లుగా పంచాయతీలను విభజించారు.?

గ్రేడ్-1 పంచాయతీలు 73 ఏర్పడనున్నాయి. వీటి పరిధిలో 3వేల నుంచి 10వేల వరకు జనాభాగాని.. రూ.30 లక్షల నుంచి కోటి రూపాయలలోపు ఆదాయం వచ్చేలా నిర్ణయించారు. మండల కేంద్రంలో ఉండే పంచాయతీలు గ్రేడ్-1గా విభజించారు. డిప్యూటీ ఎంపీడీవోలను పంచాయతీ అధికారిగా నియమిస్తారు.

గ్రేడ్- 2 పంచాయతీలు జిల్లాలో 183గా ఏర్పాటు కానున్నాయి. వీటి పరిధిలో 2వేల నుంచి మూడు వేల మధ్య జనాభా ఉండాలి.

గ్రేడ్-3.. పంచాయతీలు 451 ఏర్పాటు అవుతాయి. వీటిలో రెండు వేల కన్నా తక్కువ జనాభా ఉన్నవి ఉంటాయి. పంచాయతీ కార్యదర్శిని పంచాయతీ అభివృద్ధి అధికారిగా పేరు మార్చనున్నారు.

చురకలు



# దేవుడి భూములూ దోచేశారు!

ఒంగోలు : సింగరాయకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఆలయానికి 3 వేల ఎకరాలకుపైగా భూములుండగా, ప్రస్తుతం 300 ఎకరాలకు మాత్రమే కౌలు వేలం నిర్వహిస్తున్నారు. మిగిలిన భూములు ఆక్రమితదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆలయాన్ని ఆనుకుని ఉన్న సోమరాజుపల్లి, సింగ రాయకొండ పరిధిలో సుమారు 1,500 ఎకరాలు ఆక్రమణకు గురికాగా, అధికార యంత్రాంగం కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం.

ఒంగోలులోని పాల పరిశ్రమకు ఆలయానికి చెందిన సర్వే సంఖ్య 128లో 12.80 ఎకరాలను ఎలాంటి సంప్రదింపుల్లేకుండా కట్టబెట్టేశారు. ఈ భూములు వెబ్‌ల్యాండ్‌లో పాల పరిశ్రమ ఆధీనంలో ఉన్నట్లు చూపడం గమనార్హం.

నెల్లూరు జిల్లా చెన్నూరులో 1156, 1128 సర్వే సంఖ్యలలో 98.11 ఆక్రమణలో ఉన్నాయి. ఏళ్లుగా వదిలేయడంతో దేవుడి భూములు ఎక్కడున్నాయో అధికారులకే తెలియని పరిస్థితి.

సింగరాయకొండ మండలం కనుమెళ్లలో ఆలయానికి చెందిన 98.11 ఎకరాలను ఏళ్ల కిందట అమ్మేశారు. విక్రయ విలువలో నాలుగో



వంతు మాత్రమే కొనుగోలుదారులు చెల్లించారు. మిగిలిన నగదును ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుత విలువ ప్రకారం రూ.కోట్లలో ఆలయానికి చెల్లించాల్సి ఉంది.

పాత సింగరాయకొండ, సోమరాజుపల్లి పరిధిలో వందల ఎకరాలు చేతులు మారిపోయాయి. ఆయా భూముల్లో రొయ్యల చెరువులు, వివిధ పంటలు పండిస్తుండగా, సింగరాయకొండలో భవంతులు సైతం నిర్మించారు. ఇవన్నీ దేవస్థానం పరిధిలోనే ఉన్నా కనీసం దక్కించుకోవాలనే ఆలోచన అధికార యంత్రాంగం చేయడం లేదు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

సింగరాయకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూముల ఆక్రమణలపై ఇప్పటికే దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పెద్దమొత్తంలో ఇళ్ల నిర్మాణం వంటివి చేపట్టడంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం. పానకాలరావు, జిల్లా దేవాదాయశాఖాధికారి

# రాయవరం.. అక్రమార్కుల పరం!

మార్కాపురం : మార్కాపురం మండలం రాయవరం చెరువును అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యంత్రాలతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో చెరువు తన స్వరూపం కోల్పోయింది. గతంలో ఈ చెరువును ఉపాధి హామీ పథకం కింద రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. ప్రస్తుతం అక్రమార్కులు యంత్రాలతో తవ్వేస్తూ



గుల్లచేస్తున్నారు. ఇక్కడ తవ్విన మట్టిని వెంచర్లకు తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. చెరువులో గుంతలు తీయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో రాకేష్ అనే యువకుడు ఇక్కడ తీసిన గుంతలో పడి మృతిచెందాడు. మట్టి అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అందరికీ నీడ.. పునరావాస మేడ

జంగారెడ్డిగూడెం : పోలవరం పునరావాస కాలనీలు పూర్తి చేసేందుకు కసరత్తు మొదలైంది. వైకాపా ప్రభుత్వం తన పాలనలో పునరావాస కాలనీల నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. పూర్తి చేసిన పనులకు కూడా గుత్తేదారులకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో గుత్తేదారులు సుమారు నాలుగేళ్ల కిందట పనులు ఆపేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసంపై దృష్టి సారించింది. ఇప్పటికే నిర్వాసితులకు పునరావాస పరిహారం విడుదల చేసింది.

గతంలో ఆగిపోయిన దగ్గర నుంచి కాలనీలు, మౌలిక వసతులు, సామాజిక భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గతంలో చేసిన నిర్మాణాలకు పెండింగ్ బిల్లులను గుత్తేదారులకు చెల్లించింది. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు తాజా అంచనాలు వేసి సుమారు రూ.365 కోట్లతో టెండర్లు పిలిచారు. ఏలూరు జిల్లా పరిధిలోని పనులకు సంబంధించి సెప్టెంబరు 8న టెండర్లు తెరిచే అవకాశాలు ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ పరిధిలోని చల్లావారిగూడెంలో 1,505 ఇళ్లు, లేఅవుట్ పరిధిలో మౌలిక వసతులకు సంబంధించిన పనులకు రూ.203 కోట్లకు ఈ నెల 23న టెండర్లు పిలిచారు. వంకావారిగూడెంలో ఎర్రవరం లేఅవుట్ మౌలిక వసతులకు రూ.6.93 కోట్లు, జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం, బుట్టాయగూడెంలో సరుగుడు లేఅవుట్ పనులకు రూ.3.14కోట్లు ఇచ్చారు. బుట్టాయగూడెంలోని 624 ఇళ్లు, కాలనీల్లో వసతులకు సంబంధించి రూ.68.53 కోట్లు, జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో 358 గృహాలకు సంబంధించి రూ.51.39 కోట్లు, బుట్టాయగూడెం మండలం దొరమామిడి లేఅవుట్లో 305 ఇళ్లకు సంబంధించి రూ.30.88 కోట్లకు టెండర్లు పిలిచారు. రాచన్నగూడెంలోని శివగిరి లేఅవుట్లో అసంపూర్తిగా ఉన్న మౌలిక వసతుల కోసం రూ.1.93 కోట్లు చొప్పున టెండర్లు దాఖలయ్యాయి. సిద్ధంగా ఉన్నాం.. టెండర్లు ఖరారైతే పనులు చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గృహ నిర్మాణ సంస్థ ఈఈ కేవీవీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు.

# సాగులో కృషి విజ్ఞాన కాంతులు




ఎమ్మిగనూరు : జిల్లాలో రైతులకు ఆధునిక వ్యవసాయ, అనుబంధ రంగాల సేవలందిస్తూ పంట ఉత్పాదకత పెంపునకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చేయూత అందిస్తున్నారు. పంటలు, చేతికొచ్చిన దిగుబడులు అధిక వర్షాలకు దెబ్బతినకుండా సూచనలు ఇస్తున్నారు. కర్షకులకు వాతావరణ సమాచారాన్ని ప్రసార సాధనాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు చేరవేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులు, చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ వంటి పలు కార్యక్రమాలపై రైతులకు తర్ఫీదు ఇస్తూ ముందుకెళ్తున్నారు. శాస్త్రవేత్తల సేవలకు గుర్తింపుగా ఇటీవల నాలుగు అవార్డులు అందుకున్నారు.

**ఉచితంగా విత్తనాలు అందించి..**

జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు కందులు, మినుములు 15క్వింటాలు రైతులకు ఉచితంగా అందజేశారు. విత్తనోత్పత్తి కింద 65క్వింటాళ్ల వేరుసెనగ విత్తనం ఉచితంగా పంపిణీ చేశారు. కొత్త కొర్ర వంగడ విత్తనం వంద మందికి అందజేశారు. చిరుధాన్యాల పథకం కింద 5క్వింటాళ్ల సజ్జ విత్తనం రైతులకు పంపిణీ చేశారు. 150మంది రైతులకు టార్పాలిన్లు ఉచితంగా ఇచ్చారు. అధిక సాంద్రత పద్ధతిలో 1500 ఎకరాల్లో పత్తి సాగు చేయించి దిగుబడి పెంచేందుకు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

**రైతు సేవలకు గుర్తింపు**

ఎమ్మిగనూరు మండలంలోని బనవాసిఫారం వద్ద 50ఎకరాల విస్తీర్ణంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఒకటిన్నర దశాబ్దం క్రితం ప్రారంభమైంది. జిల్లా పశ్చిమ ప్రాంత రైతులకు పంటల సాగు, అనుబంధ రంగాలపై సలహాలు, సూచనలు అందిస్తోంది. కాలానుగుణంగా వచ్చిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, కొత్త వంగడాలను క్షేత్రస్థాయిలో సాగు చేయించి పంట ఉత్పాదకతను పెంచుతూ వ్యవసాయ రంగం బలోపేతానికి కృషి చేస్తున్నారు. రైతులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఇటీవల నాలుగు అవార్డులు దక్కాయి. తమిళనాడులోని వేలూరులో అటారిజోన్ ఎక్స్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరాతో పాటు ఇతర వ్యవసాయ నిపుణుల ద్వారా అవార్డులు అందుకున్నారు.

జిల్లాలో అపరాల ఆదర్శ గ్రామ పథకం కింద సాగును పెంచేందుకు కృషి చేశారు. సమగ్ర సస్య రక్షణలో భాగంగా ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనస్ వినియోగం, 1.55లక్షల మంది రైతుల డేటా బేస్ సేకరించి వారికి వ్యవసాయ, అనుబంధ, వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయడం, భూసార పరీక్షలు 2,500, నీటి పరీక్షలు 500లు చేసి అవార్డు అందుకున్నారు.

**నికర ఆదాయం పెంచేందుకు కృషి**

రైతులు పంటల సాగులో నికర ఆదాయం పొందేందుకు సాగులో వచ్చిన ఆధునిక వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నాం. వ్యవసాయ అనుబంధ రంగాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలోని రైతులందరికీ ప్రసార, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం అందించేందుకు కృషి చేస్తున్నాం. డాక్టర్ రాఘవేంద్రచౌదరి, సమన్వయకర్త, కృషి విజ్ఞా కేంద్రం

# నిబంధనలకు విరుద్ధం.. చర్యలకు సిద్ధం



నెల్లూరు : జిల్లా ఆక్వా రంగానికి ప్రసిద్ధి. పెద్దఎత్తున రొయ్యలు, చేపల చెరువులు సాగు చేస్తున్నారు. ఇక్కడి నుంచి విదేశాలకు రొయ్యల ఎగుమతి జరుగుతోంది. అయితే ఎక్కువమంది అనుమతులు లేకుండానే సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో రొయ్యలు, చేపల చెరువులు ఉన్నాయి. ఇందులో 17,700 మంది రైతులు రొయ్యలు, 6857 మంది చేపల సాగు చేపట్టారు. ఎక్కువ మంది లైసెన్సులు లేకుండా సాగు చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, విద్యుత్ సర్వీసులు, మార్కెటింగ్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ%రి%్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ప్రతి రైతు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లైసెన్సు తీసుకోవాలని తెలిపింది. అందులో భాగంగా జిల్లాలో మత్స్యశాఖ ప్రత్యేకంగా 30 రోజుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. లైసెన్సులు లేనివారు 16,670 మంది జిల్లాలో ఇప్పటి వరకు లైసెన్సులు లేని రొయ్యల రైతులు 12,500 మంది, చేపల సాగులో లేని వారు 4170 మంది ఉన్నారు. లైసెన్స్ లేని రైతులు నెల రోజుల్లో తప్పనిసరిగా తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలోని సచివాలయంలో మత్స్యశాఖ గ్రామ సహాయకులు ఉంటారు. వారిని సంప్రదిస్తే అర్హత ఉన్న ప్రతి రైతుకు లైసెన్స్ జారీ చేస్తారు. గ్రామ స్థాయిలో మత్స్యశాఖ సహాయకులు స్పందించక పోతే నెల్లూరు నగరంలో ఉన్న జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. రైతులు 94408 14739 నంబరుకు సమస్యలు తెలపవచ్చని అధికారులు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తప్పనిసరిగా తీసుకోవాలి ప్రత్యేక డ్రైవ్‌లో రొయ్యలు, చేపల రైతులు తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శాంతి తెలిపారు. అలా చేయని రైతులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# సోమశిలకు వరద పరవళ్లు



ఆత్మకూరు: సోమశిల జలాశయానికి వరద పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎప్పుడైనా పెన్నానదిలోకి 40వేల క్యూసెక్కులు విడుదల చేయనుండటంతో.. లోతట్టు ప్రాంతాలను జాగృతం చేశారు. మరోవైపు కండలేరులో నీటి నిల్వ 50 టీఎంసీల మార్కును అధిగమించింది.

**ఎగువన వర్షాలతో...**

కర్నూలు, కడప జిల్లాల్లో కురిసిన వర్షాలు.. కందు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో.. ఆదినిమ్మాయపల్లి వద్ద నదిలో 48,800 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా- అన్నమయ్య ప్రాజెక్టు నుంచి మూడు వేల క్యూసెక్కులు విడుదలవుతోంది. దాంతో జలాశయంలోకి వచ్చే ప్రవాహం 50వేల నుంచి 60వేల క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దాంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఎవరూ నదిలోకి దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం సోమశిలలో 73.69 టీఎంసీల నిల్వ ఉండగా- జలాశయంలోకి 37,212 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. 39,281 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

**కండలేరులో 50 టీఎంసీలు**

కండలేరులో నిల్వ 50 టీఎంసీల మార్కును అధిగమించింది. ప్రస్తుతం 50.27 టీఎంసీలుగా ఉంది. జలాశయంలోకి 10,230 క్యూసెక్కులు వస్తుండగా.. 1685 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో మొత్తంగా ప్రస్తుతం 124 టీఎంసీలు ఉండగా.. రోజుకు ఒక టీఎంసీ చొప్పున పెరుగుతోంది. సెప్టెంబరులో 50టీఎంసీల మార్కును దాటడం జలాశయం చరిత్రలో ఇదే మొదటిసారి. దాంతో ఉమ్మడి జిల్లా రైతులు సంతోషంగా ఉన్నారు.

# అలా తెచ్చారు.. ఇలా పోయాయి!

తాళ్లూరు : వైకాపా ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్లు దిష్టిబొమ్మల్లా మారాయి. నాణ్యత లేనివి కావడంతో అనతి కాలంలోనే మరమ్మతులకు గురయ్యాయి. జిల్లాలో 2,180 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వాటిలో సుమారు వెయ్యి పాఠశాలలను తొలివిడతలో ఎంపిక చేసి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కోదానికి రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల్లోపు, ఉన్నత పాఠశాలల్లో రూ.5 లక్షల చొప్పున వెచ్చించారు. ఇలా మొత్తం రూ.15 కోట్లపైగా నిధులు ఖర్చు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసంస్థ ద్వారానే ఆర్వో ప్లాంట్లను సమకూర్చారు. అవి తొందరగానే మూలకు చేరాయి. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు నాడు-నేడు పథకం కోసం ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేస్తే సదరు సంస్థ తరఫున సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసే వారు. అయినా మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. యథావిధిగా ఉపాధ్యాయులు బయట నుంచి నీళ్ల డబ్బాలు కొనుగోలు చేసి విద్యార్థులకు మంచినీరు అందిస్తున్నారు. ఈ కారణంగా ఒక్కో పాఠశాలలో తాగునీటి కోసమే నెలకు సుమారు రూ. 5 వేల నుంచి



రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**పదేపదే చెప్పినా ఫలితం లేదు..**

కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకొని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను బాగుచేయించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. గతంలో వీటిని ఏర్పాటు చేసిన సంస్థ సిబ్బందికి మరమ్మతుల గురించి పదేపదే తెలియజేసినా ప్రస్తుతం ఎవరూ రావడం లేదని చెబుతున్నారు. దీనిపై ఒంగోలు డిప్యూటీ డీఈవో ఎ.చంద్రమౌళీశ్వరరావును వివరణ కోరగా.. పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్ల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

# నాణ్యతపై 'తారు'మబ్బులు

డోన్ : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారి నిర్వహణ అధ్వానంగా మారింది. అక్కడక్కడా దెబ్బతిని గుంతలు పడటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ప్రతి నెలా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతున్నా మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. కర్నూలు నుంచి ప్యాపిలి వరకు 75 కి.మీ. పొడవునా ఉన్న జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. నేషనల్ హైవే కావడంతో వాహనదారులు వేగంగా వెళుతుంటారు. గుంతలు కనపడకపోవడం.. దగ్గరికి వచ్చేసరికి ప్రమాదాన్ని గుర్తించి ఒక్కసారిగా బ్రేకులు వేస్తున్నారు. దీంతో వెనుక వచ్చే వాహనాలతో ముప్పు ఏర్పడుతోంది. డోన్ నుంచి కర్నూలుకు వెళ్లాలంటే గంట ప్రయాణం. రోడ్డుపై గుంతలు ఉండటంతో సుమారు 2 గంటలు పడుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు.

**ఆదాయం సమకూరుతున్నా..**

ప్రతిరోజూ ఎన్‌హెచ్ 44 మీదుగా 20 వేలకుపైగా వాహనాలు తిరుగుతుంటాయి. ఒక్క అమకతాడు టోల్‌ప్లాజా పరిధిలో నిత్యం రూ.5 లక్షలకుపైగా టోల్ వసూలవుతుంది. ఈ ఒక్క టోల్‌ప్లాజా నుంచే నెలకు రూ.1.50 కోటి వరకు ఆదాయం సమకూరుతుంది. అయినప్పటికీ రహదారి నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలున్నాయి. రహదారిపై అక్కడక్కడా వీధి దీపాలు లేకపోవడం.. గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**పైపై మరమ్మతులు**గతంలో జాతీయ రహదారిపై గుంతలు పడటంతో గుత్తేదారులు అక్కడక్కడా ప్యాచ్‌వర్క్ పనులు చేశారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు ప్యాచ్‌వర్క్ వేసిన చోటే తారు లేచిపోయి తిరిగి గుంతలు పడటం గమనార్హం. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి నిర్వహణ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..**

డోన్ పరిధిలో దొరపల్లి వంతెన, ఉడుములపాడు వంతెన, ఓబులాపురం మిట్ట, దేవరబండ స్టేజీ, జగదుర్తి స్టేజీ వద్ద గుంతలు పడ్డాయి. వెల్దుర్తి మండల పరిధిలోని మదార్‌పురం, బొమ్మిరెడ్డిపల్లి, మల్లెపల్లి వద్ద రహదారి అధ్వానంగా ఉంది. కల్లూరు మండలంలోని ఉలిందకొండ, చిన్నటేకూరు, పెద్దటేకూరు, దూపాడు, వెంగన్నబావి నుంచి కర్నూలు వెళ్లే వరకు రహదారి పలు ప్రాంతాల్లో దెబ్బతింది.

# ఆక్రమణల చెరలో చెరువులు

రావికమతం : వందలాది ఎకరాల సాగుకు ఆయువుపట్టుగా ఉన్న చెరువులు ఆక్రమణలతో ఉనికిని కోల్పోతున్నాయి. ఏటికేడు చెరువు గర్భాల విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయి అన్నదాతలకు అష్టకష్టాలు తప్పట్లేదు. రావికమతం మండలం పిల్లవాని పాలెంలోని సర్వే నం. 261-1లోని చినప్పన్న చెరువు గర్భం విస్తీర్ణం 6.07 ఎకరాలు. దీని కింద సుమారు 650 ఎకరాల వరకు ఆయకట్టు రైతులు లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం ఈ చెరువు చిక్కిసగమైంది. చెరువు గర్భంలో వరి, చెరకు సహా ఇతర పంటలు సాగు చేస్తున్నారు. దీంతో సరిపడా సాగునీరు అందక ఆయకట్టు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుపాక రెవెన్యూలోని సర్వే నం. 19-1లోని 3.96 ఎకరాల విస్తీర్ణంగల వియ్యపువాని చెరువుదీ ఇదే పరిస్థితి. మేడివాడ పెద్ద చెరువు విస్తీర్ణం సుమారు 40 ఎకరాల వరకూ ఉంటుంది. ఇందులో 15 నుంచి 20 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. కొత్తకోట, దొండపూడి, రావికమతం, తట్టబంద, మర్రివలస తదితర గ్రామాల్లోని చెరువుల పరిస్థితి అధ్వానంగా ఉంది.

**చర్యలు తీసుకున్నా మళ్లీ మొదటికే..** సుమారు 25 ఎకరాలు విస్తీర్ణం ఉన్న గొంప మిరియాల చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైంది. పలువురు చెరువును ఆక్రమించి సాగుభూమిగా మార్చుకొని వరి, చెరకు, సరుగుడు వంటి పంటలు సాగుచేస్తున్నారు.

# కని'పెట్టె'దెవరు..?!

విశాఖపట్నం: విశాఖ నుంచి గోమాంసాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. కొన్ని రైళ్లలో వ్యూహాత్మకంగా భారీగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. విశాఖ నుంచి బెంగళూరు, దిల్లీ, ముంబయికి వెళ్లే రైళ్లలో అధికంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రైల్వే పార్సిల్ కేంద్రం వద్ద సరైన నిఘా లేకపోవడంతో ఇదంతా జరుగుతున్నట్లు చర్చ సాగుతోంది.తనిఖీలేవి?: విశాఖ రైల్వే స్టేషన్‌లో జ్ఞానాపురం వైపు ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాంపై రైల్వే పార్సిల్ కేంద్రం ఉంది. గతంలో ఇక్కడ రైల్వే పోలీసుల తనిఖీ కేంద్రం ఉండేది. రోజూ ఒకరిద్దరు పోలీసులు అక్కడ విధులు నిర్వహిం



చేవారు. అనుమానిత వస్తువులను తనిఖీ చేసేవారు. సందేహం ఉంటే బిల్లులు పరిశీలించేవారు. ఏం పంపిస్తున్నారో అనేక సార్లు ప్రశ్నించేవారు. పోలీసులు ఉన్నారన్న భయంతో కొందరు వెనుకంజ వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రెండు నెలల కిందట ఆ పాయింట్ తొలగించేశారు. పార్సిల్ బుక్ చేస్తున్న అధికారులు ఆదాయమే లక్ష్యంగా పనిచేస్తున్నారు తప్ప... ఏం పంపిస్తున్నారు, లోపల ఏముందని ప్రశ్నించడం లేదు. దీంతో ఇక్కడి నుంచి రవాణా అవుతున్నవేంటో బయటకు తెలియడం లేదు.బీ కొందరికి పార్సిల్ ఏజెన్సీలను రైల్వే అప్పగించింది. వారు ఏ వస్తువులు పార్సిల్ చేస్తే వాటిని పంపేస్తున్నారు. గోమాంసం అక్రమ రవాణాలో ఇక్కడే అసలు దందా సాగుతున్నట్లు అనుమానిస్తున్నారు. వీరితో చేతులు కలిపి కొందరు అధికారుల అండతో రవాణా సాగుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

## చెరువుల అభివృద్ధికి ఆర్‌ఆర్‌ఆర్

చిత్తూరు: జిల్లాలోని చెరువులకు జీవం రానుంది. వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన జల వనరులకు కూటమి ప్రభుత్వం జవసత్వాలు కల్పిస్తోంది. తాజాగా చిన్ననీటి వనరులు, చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆర్‌ఆర్‌ఆర్(మరమ్మతులు, పునర్నిర్మాణం, పునరుద్ధరణ) పథకం కింద జిల్లాలో 214 సాగునీటి చెరువుల అభివృద్ధికి రూ.132.98 కోట్ల వ్యయ అంచనాలతో సవివర నివేదికల(డీపీఆర్)ను జిల్లా జల వనరుల శాఖ అధికారులు సిద్ధం చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించనున్నారు. చెరువుల ఆక్రమణలతో




పాటు కట్టలు బలహీనం కాగా.. కాలువలు, మొరవలు దెబ్బతిన్నాయి. తద్వారా చెరువులకు నీరు చేరలేదు. వీటిని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేయనున్నాయి. ఒక్కో చెరువుకు రూ.10 లక్షల నుంచి రూ.1.25 కోట్ల వరకు నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపామని జిల్లా జల వనరుల శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వరరాజు తెలిపారు.

## రాయితీ కావాలంటే రిజిస్ట్రేషన్ కావాలంతే!

ఒంగోలు : ఆక్వా రంగంలోని రైతులు చెరువుల రిజిస్ట్రేషన్ల విషయంలో వెనుకబడ్డారు. జిల్లాలోని కోస్తాతీర ప్రాంత మండలాల్లో 1,500 మంది రైతులు 11 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఆక్వా సాగు చేస్తున్నారు. ఇందులో మూడో వంతు విస్తీర్ణానికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఆక్వా జోన్ పరిధిలో సాగు చేస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు వినియోగానికి సంబంధించి యూనిట్‌ను రూ.1.50కే సరఫరా చేస్తోంది. జిల్లాలోని 374 మంది రైతులకు రాయితీపై విద్యుత్తు అందిస్తుండడంతో వారిపై పెట్టుబడుల భారం తగ్గుతోంది. మరో 1100 మందికిపైగా రైతులు 6,649 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆక్వాసాగుపై సమీక్షించారు. రిజిస్ట్రేషన్ విధిగా చేయించాలని, వాటికి విద్యుత్తు రాయితీ ఇచ్చే అవకాశం ఉంటుందని ప్రకటించారు.

**ఎక్కువ విస్తీర్ణం డీకేటీ భూముల్లోనే...**

జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో 30 ఏళ్ల కిందట పేదలకు ప్రభుత్వం అసైన్డ్ భూములను ఇచ్చింది. ఎక్కువ మంది లబ్దిదారులు అప్పట్లో



ఇతరులకు అనాధికారికంగా విక్రయించారు. ఆయా భూములు ఆక్వా సాగుకు అనుకూలంగా ఉండటంతో కాలక్రమేణా టైగర్, వెనామీ రొయ్యల సాగు చేస్తున్నారు. విద్యుత్తు రాయితీ నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా యాజమాన్య హక్కులకు సంబంధించి సాంకేతిక చిక్కులొస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది రైతులు రాయితీ విద్యుత్తుకు దూరమవుతున్నారు. ఏ ఒక్కరైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో చెరువుల రిజిస్ట్రేషన్‌పై సాగుదారులకు మత్స్యశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలోని సముద్రతీర మండలాల్లో ఆక్వా సాగు

మండలాలు : ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, నాగులుప్పలపాడు, సింగరాయకొండ, జరుగుమల్లి

ప్రస్తుతం సాగు విస్తీర్ణం: 11,033 ఎకరాలు

రిజిస్ట్రేషన్ పూర్తయింది: 4,384 ఎకరాలు

# ఉల్లి రైతు కన్నీటి ఘోష



ధర్మవరం : ఉల్లి పంట సాగు చేసిన రైతులు ధర లేక తల్లడిల్లుతున్నారు. చేతికందిన పంటను కోసి విక్రయించుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలలు కష్టపడి పంట పండిస్తే పెట్టుబడి మాట దేవుడెరుగు.. కనీసం కూలీ డబ్బులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి గడ్డలను కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోడంతో రైతులే సొంతంగా ఆటోలు బాడుగకు తీసుకుని ఊరూరా అమ్ముతున్నారు. కొందరైతే హెూటళు, డాబా యజమానులను బతిమాలాడుకుని వంద కిలోల ఉల్లి బస్తాను రూ.70, 80కే ఇచ్చేస్తున్నారు. మరికొందరు నిత్యాన్నదానం జరిగే ఆలయాలకు ఉచితంగా అందిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని అన్ని మార్కెట్‌యార్డుల్లో ఉల్లి విక్రయాలు జరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి పరిమాణాన్ని బట్టి ధరలు ఉంటున్నాయి. వ్యాపారులు రూ.100కు 5 కిలోల నుంచి 8 కిలోల వరకు విక్రయిస్తున్నారు. ఉల్లి నారకు పెట్టిన ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

**తగ్గిన సాగు**

జిల్లా వ్యాప్తంగా సాధారణంగా 500 ఎకరాలకుపైగా ఉల్లి పంట సాగైంది. అయితే ధరలు రానురాను తగ్గుతుండటంతో రైతులు పంట సాగుకు ఆసక్తి చూపించలేదు. కేవలం 210 ఎకరాల్లోనే సాగు చేశారు. ప్రస్తుతం కోత కోయాల్సి ఉంది. ఆశించిన మేరకు ధర లేకపోవడంతో కోయాల వద్ద అనే మీమాంసలో పడ్డారు. మిగతా పంటలతో పోలిస్తే ఎకరా విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దానికితోడు వాతావరణంలో మార్పుల కారణంగా పంటకు తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంటుందని రైతులు ముందుకు రాలేదు.

జిల్లాలోనే రొద్దం మండలంలో అత్యధికంగా వంద ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. చాలా మంది రైతులు సగం కోసి మిగతాది పొలంలోనే వదిలేశారు.

తాడిమర్రి మండలంలోని దాడితోట గ్రామంలో రమణారెడ్డి అనే రైతు రూ.1.30లక్షలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశారు. వారం రోజుల కిందటే ఉల్లిని కోయాల్సి ఉంది. ధర లేకపోవడంతో పొలంనే పంటంతా ఉండిపోయింది.

కూలీ గిట్టుబాటు కాలేదు – నారాయణస్వామి, గౌరాజుపల్లి

రెండు ఎకరాల్లో ఉల్లి సాగుకు రూ.1.25 లక్షలు ఖర్చు చేశా. దిగుబడి బాగానే ఉన్నా.. ధరలేక సగం పంట మాత్రమే కోశా. రూ.40 వేలు చేతికొచ్చింది. మిగతాది అలాగే వదిలేశాను. ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలి.

**ఆందోళన అవసరం లేదు**

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

ఉల్లి పంటకు కష్టకాలమే. గతంలో పోలిస్తే మన దగ్గర ఉల్లి పంట సాగు కొంతమేరకు తగ్గింది. రైతులు ఆందోళన చెందకుండా కొన్ని రోజులు వేచి ఉండాల్సిందే.

# శోధన అటు ఇటైతే.. వేదన



ఆత్మకూరు ఏదైనా సమాచారం కోసం గూగుల్‌లోకి వెళ్లి తమకు కావాల్సిన పదాలను చరవాణిలో టైప్ చేసిన వెంటనే ఫోన్ చేస్తారు.. సార్ మీరు ఈ వస్తువు కోసం ఆన్‌లైన్‌లో వెతికారు. మేం ప్రత్యేక ఆఫర్‌లో మీకు డోర్ డెలివరీ చేస్తామని చెబుతారు. మనం సమాచారం వెతికే సమయంలో ఎక్కడా వివరాలను నమోదు చేయకుండానే ఎలా కాల్స్ వస్తున్నాయన్నది తెలుసుకోవాలి.

**నకిలీ గుర్తించడం ఎలా?**

డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.గూగుల్.కామ్ అని టైప్ చేస్తే ఒక్కోసారి స్పెల్లింగ్ మారి ఉంటుంది. గూగుల్‌లో రెండు ఓఓలు ఉండాల్సిన చోటు రెండు సున్నాలను స్కామర్లు ఉంచుతారు. అసలు వెబ్‌సైట్ మాదిరిగా ఉన్నప్పటికి సైట్ పనితీరు వేరుగా ఉంటుంది. ఓ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సమాచారం వెతికిన తరువాత మరో వెబ్‌సైట్‌లో సమాచారం చూపుతోందంటే అది నకిలీదని గుర్తించాలి. వెబ్‌సైట్ ముందు హెచ్‌టీపీపీఎస్ ఉండి అది సెక్యూర్డ్ అని చూపితేనే నమ్మాలి. కేవలం హెచ్‌టీపీపీ అని ఉన్నా అనుమానించాల్సిందే. స్కామర్లు అసలు వెబ్‌సైట్‌లాగా సృష్టించి చివరలో.కామ్ అని కాకుండా .నెట్ అనో లేక .ఈఎన్ లాంటి పదాలను ఉంచుతారు.

ఉమ్మడి అనంత జిల్లాలో నెలకు పదుల సంఖ్యలో సైబర్ కేసులు నమోదవుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. ఆత్మకూరు మండలానికి చెందిన ఓ యువకుడు.. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి అదనపు సంపాదన చేయడం ఎలా? అని వెతకడం ప్రారంభించాడు. వెంటనే ఓ వ్యక్తి నుంచి ఫోన్ వచ్చి ఫలానా యాప్‌లో పెట్టుబడి పెడితే ఆదాయం వస్తుందని నమ్మించాడు. పది రోజులు అలా లాభాలు ఖాతాలో జమయ్యాయి. నమ్మకం ఏర్పడి రూ.40 వేలు పెట్టుబడి పెట్టాడు. తరువాత వచ్చిన లాభాలు ఖాతాలో జమకాలేదు. ఆరా తీయగా త్వరలో జమఅవుతాయని సూచించారు. కొద్దిరోజులయ్యాక యాప్ ఆన్‌లైన్ నుంచి డిలీట్ అయింది. పెట్టుబడి సొమ్ము పోయింది. సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదనపు సంపాదన ఎలా చేయాలి? అని శోధించినపుడే ఈ అంశంలో తప్పటడుగు పడిందని అర్థమైంది.

**మాయాజాలం** మనం సమాచారం కోసం వెతికే వెబ్‌సైట్ల మాదిరిగానే నకిలీ వెబ్‌సైట్లు ఉంటాయి. ఓ వెబ్‌సైట్ సెర్చ్ ఇంజిన్‌లో పదాలను టైప్ చేసి ఒకే నొక్కిన వెంటనే యాక్సెప్ట్ కుకీస్ అని వస్తూ ఉంటుంది. అవగాహన లేక వెంటనే అలో అని నొక్కుతున్నారు. అలా నొక్కిన వెంటనే మీరు నకిలీ వెబ్‌సైట్‌లో ఉన్నంతవరకూ మీరు ఏం టైప్ చేసినా మూడో వ్యక్తికి తెలిసిపోతుంది. తర్వాత ఫోన్ చేసి ట్రాప్ చేయడానికి ప్రయత్నిస్తారు.

# పురం వ్యాపార పన్నులో మతలబు




హిందూపురం : పురపాలిక పరిధిలో ఏ వ్యాపారం చేసేవారైనా అనుమతి తప్పనిసరి. వ్యాపారాన్ని బట్టి మూడు స్లాబుల్లో పన్ను విధిస్తారు. ఏడాదికి చిన్న దుకాణానికి రూ.600, మధ్యస్థాయి రూ.800, పెద్ద వాటికి రూ.1200 పన్ను కింద మున్సిపల్ పారిశుద్ధ్య విభాగానికి చెల్లించాలి. వారు ఇచ్చే అనుమతి పత్రాన్ని దుకాణంలో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి. ఈ ప్రక్రియ చాలాచోట్ల అమలు కావడం లేదు. వైకాపా పాలనలో పన్ను వసూళ్లను పట్టించుకోకపోవడంతో బకాయి రూ.2.88 కోట్లకు చేరింది. ఈ ఏడాది వసూలు చేయాల్సింది రూ.32 లక్షలు కలిపితే రూ.3.2 కోట్లు అయింది.

విధింపులోనూ నిర్లక్ష్యమే..

పురపాలిక పరిధిలో 44 వేలు భవనాలు ఉన్నట్లు మున్సిపాలిటీ గుర్తించింది. వ్యాపార కేంద్రం కావడంతో నిబంధనల ప్రకారమే 10 శాతం భవనాల్లో వ్యాపారాలు సాగిస్తుంటారని అంచనా.. ఈ లెక్కన 4,400 వ్యాపార అనుమతి లైసెన్స్‌లు ఉండాలి. ప్రస్తుతం 2600 మంది రిజిస్టర్ చేసుకొన్నారు. మిగిలిన వాటికి సంబంధించి పన్ను విధిస్తే అదనంగా ఏడాదికి రూ.18 లక్షల ఆదాయం వస్తుందని తెలిసినా అధికారులు మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

**సిబ్బంది చేతివాటంతో..**


పన్ను వసూలు వదిలేసి, కింది స్థాయి సిబ్బంది కొందరు దుకాణదారులతో ప్రతి నెలా కొంత పుచ్చుకొంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. పన్ను వసూలు చేయకపోవడానికి ఇదే ప్రధాన కారణమని తెలుస్తోంది. మున్సిపల్ ఉన్నతాధికారులు సైతం వ్యాపార పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి.

**సర్వే నిర్వహిస్తాం – మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం**

బకాయిలు ఉన్నది వాస్తవమే. సచివాలయ సిబ్బందితో పట్టణంలో సర్వే చేయిస్తాం. బకాయిల వసూలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం.

# నాడు పన్నాగం..నేడు కబ్జాకు సిద్ధం

శ్రీకాళహస్తి : కబ్జాకోరుల ఆశలన్నీ ఫ్రీహోల్డ్‌పైనే ఉన్నాయి. శ్రీకాళహస్తి మండలం ఇలగనూరు సమీపంలో పరిశ్రమల పరిసర ప్రాంతాల్లోని విలువైన భూములపై భూకబ్జాదారులు కన్నేశారు. వైకాపా హయాంలో ఏర్పాట్లు చేసుకున్న వీరు తాజాగా ఆ భూములను గుట్టుచప్పుడు కాకుండా చదును చేస్తున్నారు. వైకాపా హయాంలో ఫ్రీహోల్డ్ పేరుతో యథేచ్ఛగా కబ్జాలు జరిగాయి. ఇలగనూరులో అపాచీ పరిశ్రమ ఏర్పాటుకు భూములు ఇచ్చి అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన సైతం చేశారు. ఆ సమయంలోనే సర్వే నంబరు 383, 384, 310, 405ల్లో దాదాపు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని ఫ్రీహోల్డ్‌లో ఉంచి కబ్జా చేయడానికి పూనుకున్నారు. ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం రాగానే ఫ్రీ హోల్డ్‌పై నిషేధం విధించింది. ఎప్పుడెప్పుడు నిషేధం



ఎత్తివేస్తుందోనని అక్రమార్కులు ఆశతో నిరీక్షిస్తున్నారు.

ప్రభుత్వ భూములపై కన్ను: ఫ్రీహోల్డ్‌లో కబ్జా చేసేందుకు సిద్ధం చేసుకున్న 25 ఎకరాలకు సమీపంలోని మరో 10 ఎకరాలనూ కబ్జా చేయాలనుకున్నారు. గతంలో కబ్జాలకు ప్రయత్నించిన అక్రమార్కులే మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు.

# పరదా కట్టారు... గోతులు తవ్వారు!

నర్సీపట్నం : బ్రిటిష్ సైనికాధికారుల సమాధులకు సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని కట్టిన ఆకుపచ్చ మ్యాట్ని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర గురువారం తొలగించినప్పటికీ శనివారం ఉదయం మళ్లీ కట్టారు. స్తంభాల కోసం పునాదుల తవ్వకం మొదలు పెట్టారు. ఇది పురావస్తు భూమి అంటూ మూడు రోజుల కిందట హడావుడి చేసిన అధికారులెవరూ ఇటువైపు కన్నెత్తి చూడలేదు. ప్రధాన రహదారి విస్తరణ సమయంలో రెండేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే గణేష్ ఆదేశాల మేరకు ఇక్కడి దుకాణాలను వాటి యజమానులు స్వచ్ఛందంగా తొలగించారు. అప్పట్లో హడావుడిగా తొలగించినా ఇక్కడి వరకు రోడ్డును విస్తరించలేదు. విస్తరణకు మళ్లీ ప్రయత్నించినా అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ సమితి సభ్యులు ఇది పురావస్తు భూమి అంటూ కలెక్టర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదులు పంపడం, అధికారులొచ్చి హెచ్చరికలు చేస్తుండంతో ఇన్నాళ్లూ నిర్మాణాలు చేపట్టలేదు. సమితి ప్రతినిధులు మండల న్యాయసేవాధికార కమిటీ ద్వారా కోర్టు దృష్టికి తీసుకురావడంతో సీనియర్ సివిల్ జడ్జి పటాన్ షియాజ్‌ఖాన్ ఈ ప్రదేశాన్ని ఇటీవల అధికారులతో కలిసి పరిశీలించి వెళ్లారు. మూడు రోజుల కిందట కొందరు ఆకుపచ్చ మ్యాట్ కట్టడంతో కమిషనర్ సురేంద్ర సిబ్బందితో వచ్చి తొలగించారు. సమాధుల ప్రాంతాన్ని తామేమీ ఆక్రమించలేదు. దశాబ్దాలుగా తాము వ్యాపారాలు సాగిస్తున్న దుకాణాలను రోడ్డు విస్తరణ కోసం తొలగించాం. ఇప్పుడు అదే ప్రదేశంలో కట్టుకుంటామని కమిషనర్‌కు పలువురు తెలియజేశారు. ఏదైనా ఉంటే తహసీల్దారు మాట్లాడండి అంటూ వ్యాపారులకు స్పష్టం చేసి కమిషనర్ వెళ్లిపోయారు పనులు జరుగుతున్నా అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ సమితి సభ్యులు, ఆయా శాఖల అధికారులు



ఇటువైపు రాలేదు.

**పురావస్తు సంపదగా నోటిఫికేషన్**

ఈ స్థలానికి సంబంధించి స్పష్టమైన స్కెచ్‌మ్యాప్, సరిహద్దుల సమాచారం పంపాలని పురావస్తు, మ్యూజియంల శాఖ సహాయ సంచాలకులు ఆర్.ఫల్గుణరావు పదిరోజుల కిందట తహసీల్దారు రామారావుకు లేఖ పంపారు. రెవెన్యూ అధికారుల నుంచి ఈ వివరాలు అందిన తర్వాత స్మారక చిహ్నాలు, పురావస్తు చట్టం-1960 ప్రకారం చర్యలు చేపట్టాల్సి ఉంది. పురావస్తు సంపదగా 2011 జనవరి 5న నోటిఫికేషన్ ఇచ్చినా ఆచరణపై అప్పటి అధికారులు శ్రద్ధ చూపలేదు. 1922-24 నడుమన బ్రిటిష్ పాలకులను సవాల్ చేస్తున్న మన్యం పితూరీని అణచి వేయడానికి అప్పటి ప్రభుత్వం గెరిల్లా యోధులైన సైనికాధికారులు లియోనెల్ నెవెల్లీ హైటర్, క్రిస్టోఫర్ విలియం స్కాట్ కవర్డ్‌లను రప్పించింది. వీరిని 1922 సెప్టెంబరు 24న దామనాపల్లి ఘాట్‌లో అల్లూరి వీరిని హతమార్చారు. మృతదేహాలను నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ బంగ్లాకు సమీపంలో కేటాయించిన భూమిలో ఖననం చేసిన బ్రిటిష్ పాలకులు పాలరాతి సమాధులు నిర్మించారు. కాలక్రమేణా ఇక్కడ ఇళ్లు, దుకాణాలు వెలిశాయి. కొందరికి అప్పట్లో పట్టాలిచ్చారని చెబుతున్నారు.

## వడివడిగా ఉక్కు అడుగులు

నక్కపల్లి : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో ప్రస్తుతం అందరి దృష్టి ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమపైనే ఉంది. ఇది ఏర్పాటైతే వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, దీని పరిసర ప్రాంతాలన్నీ ఆర్థికాభివృద్ధి దిశగా పరుగులు పెట్టనున్నాయి. తాజాగా రైల్వే లైను కోసం 111 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందనేది తెలుస్తోంది.

తెదేపా హయాంలోనే సిద్ధంచేసిన సుమారు 4,300 ఎకరాల భూముల్లో ఇప్పటికే 1800 ఎకరాల వరకు బల్క్ డ్రగ్ పార్కుకు ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఈ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇవి శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు ఉక్కు పరిశ్రమను రాష్ట్రానికి రప్పించడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. దీనికోసం నక్కపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా కేటాయించడంతోపాటు దీని పనులు ప్రారంభానికి సంబంధించి అవసరమైన అనుమతులు ఇవ్వడానికి కేబినెట్‌లోనూ తీర్మానించారు. దీని తర్వాత నుంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు వేగమయ్యాయి. ఇప్పటికే టౌన్‌షిప్ నిమిత్తం సుమా రు 500 ఎకరాలు, రెండో విడతలో అదనపు భూములకోసం మూడు వేల ఎకరాలకు పైగా అవసరం కాగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొద్దిరోజుల క్రితం రెండోవిడత సేకరణ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం రైతుల నుంచి దీనిపై అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో వారితో చర్చించి ముందుకెళ్లేలా మంత్రి వంగలపూడి అనిత చర్చలు ప్రారంభించారు. మరోవైపు మిత్తల్ పరిశ్రమను వీలైనంత వేగంగా మొదలు పెట్టేలా మరో అడుగు ముందుకు వేసింది. ఆ మేరకు రైల్వే స్లైడింగ్‌కు (ప్రధాన లైను నుంచి పరిశ్రమలకు వేసే లైను) 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

గుల్లిపాడు నుంచే! ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం కచ్చితంగా అవసరమైన రవాణా సదుపాయం కావాలి. ప్రస్తుతం కేటాయించిన భూములు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉండటంతో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో పాటే ఇప్పుడు రైల్వే లైను ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆ మేరకు 111 ఎకరాలను కేటాయించారు. ప్రస్తుతం నక్కపల్లి మండలానికి సంబంధించి గుల్లిపాడు రైల్వేస్టేషన్ ఉండగా, ఇక్కడ ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయి. ఈ స్టేషన్ అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితం చేపట్టారు. ఇవన్నీ తుదిదశకు చేరుకుంటున్నాయి. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే... దీనికి పది కిలో మీటర్ల లోపే ఈ స్టేషన్ ఉంటుంది. దీని ద్వారా ప్రత్యేక లైనువేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. స్టేషన్ నుంచి లైను వేస్తే చినదొడ్డిగల్లు, వేంపాడు రెవెన్యూల పరిధిలోనే దాదాపుగా తీసుకోవచ్చని తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో దీనికి సంబంధించిన భూముల పరిశీలించినట్లు తెలియవచ్చింది. కాగా మధ్యలో జాతీయ రహదారి ఉండటంతో దీన్నెలా దాటిస్తారనేది సందేహంగా మారింది. జాతీయ రహదారి దాటే ప్రాంతంలో వాహనాల కోసం పై వంతెన వేస్తారని రైల్వే ఇంజినీర్ ఒకరు తెలిపారు.

## చీరకట్టులో మరింత అందంగా మారిన రాశిఖన్నా!

ప్రస్తుత కాలంలో హీరోయిన్లు ఒకవైపు ఫాలోవర్స్ ను పెంచుకుంటూనే.. మరొకవైపు తమ సినిమాలను ప్రమోట్ చేయడానికి సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉంటున్నారు. ఈ క్రమంలోనే చాలామంది హీరోయిన్స్ ఇలా తమ గ్లామర్ తో ఆకట్టుకుంటూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. పైగా సినిమాలకు సంబంధించిన పలు విషయాలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా తన మూవీ ప్రమోషన్స్ లో భాగంగా గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ప్రముఖ హీరోయిన్ రాశీ ఖన్నా. తన అందంతో.. అమాయకత్వంతో.. అంతకుమించి ఆకట్టుకునే నవ్వుతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం సిద్దు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టిలతో కలిసి 'తెలుసు కదా' అనే సినిమా చేస్తోంది. అక్టోబర్ 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది ఈ సినిమా. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో.. ప్రమోషన్స్ లో జోరుగా పాల్గొంటుంది. అందులో భాగంగానే ప్రమోషనల్ ఇంటర్వ్యూలలో తన వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలను పంచుకుంటున్న ఈమె..ఇటు సోషల్



మీడియా ద్వారా గ్లామర్ డోస్ పెంచేసి అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. తాజాగా తెలుసు కదా సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చీర కట్టులో దర్శనమిచ్చింది రాశి ఖన్నా.. క్రీమ్ కలర్ ప్రింటెడ్ చీర కట్టుకున్న ఈమె.. ఆ చీర పై ఆరెంజ్ రెడ్ కలర్ మిక్స్ కాంబినేషన్ లో ఫ్లవర్స్ తో చాలా అందంగా డిజైన్ చేశారు. దీనికి కాంబినేషన్లో బ్లౌజ్ ధరించిన ఈమె.. స్లీవ్ లెస్ అందాలతో అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేసింది. తాజాగా రాశి ఖన్నా షేర్ చేసిన ఈ సింపుల్ లుక్ ఫొటోస్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. రాశి ఖన్నా సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తెలుసు కదా సినిమాలో నటిస్తున్న ఈమె.. మరొకవైపు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇందులో పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తుండగా.. శ్రీలీల హీరోయిన్గా నటిస్తోంది. అంతేకాదు హరీష్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో రాశిఖన్నా కోసం ఒక ప్రత్యేకమైన పాత్రను డిజైన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రంతోపాటు బాలీవుడ్ లో 120 బహదూర్ అనే సినిమాతో పాటు మరో మూడు చిత్రాలకు అక్కడే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. రాశిఖన్నా కెరియర్ విషయానికొస్తే మద్రాస్ కేఫ్ సినిమా ద్వారా సహాయక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులో 2014లో వచ్చిన ఊహలు గుసగుసలాడే సినిమాతో పరిచయమైంది. మొదటి సినిమాతోనే ఉత్తమ మహిళా అరంగేట్రం విభాగంలో సైమా అవార్డును కూడా దక్కించుకుంది. ఆ తర్వాత బెంగాల్ టైగర్, సుప్రీం, జై లవకుశ, తొలిప్రేమ, వెంకీ మామ, ప్రతిరోజు పండగే ఇలా చెప్పుకుంటూపోతే చాలా చిత్రాలలో నటించింది ఈ ముద్దుగుమ్మ. తెలుగులోనే కాదు తమిళ్, హిందీ భాషల్లో కూడా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది.

## ఎన్టీఆర్ లేటెస్ట్ లుక్.. ఫ్యాన్స్ ఏమంటున్నారు?

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్.. ఎన్ని సినిమాలు చేసినా.. ఎన్ని వర్కౌట్లు చేసినా.. ఎంత బరువు తగ్గినా ముఖంలో కళ అలాగే ఉంటుంది. ఇది ప్రతి ఒక్క సినీ ప్రియుడికి, అభిమానికి తెలిసిందే. అప్పట్లో కంత్రి సినిమాకు గాను ఎన్టీఆర్ బాగా బరువు తగ్గారు. కానీ ఫేస్ లో గ్రేస్ పోలేదు. యమ దొంగ తర్వాత స్టైలిష్ లుక్ లోకి చేంజ్ అయ్యారు. ఆ తర్వాత నుంచి మూవీ మూవీకి.. వెయిట్ ను పెంచుకుంటూ వెళ్లారు.. తగ్గించుకుంటూ వచ్చారు.. కానీ అభిమానులు మాత్రం అసంతృప్తికి గురికానివ్వకుండా మెయింటైన్ చేస్తూ వచ్చారు. బ్లాక్ బస్టర్ హిట్ ఆర్ ఆర్ ఆర్ సినిమా కోసం బరువు పెరిగారు. ఆ తర్వాత చేసిన దేవర మూవీ కోసం తగ్గారు. వార్-2 మూవీ కోసం ఇంకా బరువు తగ్గిపోయారు. ఫేస్ లో మాత్రం ఎన్టీఆర్ తన కళ పోనివ్వలేదు. కానీ ఇప్పుడు అలా లేదు. డ్రాగన్ కోసం ఎన్టీఆర్ బాగా బరువు తగ్గారు. కళ మాత్రం మిస్ అవ్వడం ఫ్యాన్స్ ను ఆందోళన చెందేలా చేస్తుంది. వార్-2 మూవీ టైమ్ లో కొద్దిగా పర్లేదనిపించినా.. ఇప్పుడు పూర్తిగా బక్కి



చిక్కి కనిపిస్తున్నారు. రీసెంట్ గా జరిగిన బావమరిది పెళ్లిలో తారక్ చాలా సన్నగా కనిపించారు. ఆ తర్వాత ఇటీవల ఓ ఫ్యాన్ తో ఫోటో దిగారు. బావమరిది నార్నే నితిన్ పెళ్లిలో మెరిసిన ఎన్టీఆర్ కు.. ఇప్పుడు ఫ్యాన్ తో కలిసి దిగిన పిక్ లో ఉన్న తారక్ కు చాలా డిఫరెన్స్ ఉందని చెప్పాలి. దీంతో ఆ విషయం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అనేక మంది తారక్ అభిమానులు, సినీ ప్రియులు, నెటిజన్లు ఇప్పుడు రెస్పాండ్ అవుతున్నారు. సన్నగా ఉన్నా కూడా పర్లేదని, కానీ ముఖంలో అసలు కళ లేదని కామెంట్లు పెడుతున్నారు. సినిమాలో రోల్ కోసమే అంత తగ్గారా అంటూ క్వశ్చన్ చేస్తున్నారు. అదే సమయంలో టైటిల్ లుక్.. ఇప్పటి లుక్ కు ఎలాంటి సంబంధం లేదని అంటున్నారు. ఇంకొందరు ఫ్లాష్ బ్యాక్ లో వచ్చే సీన్స్ కోసం ఇలా సన్నగా అయ్యారేమోనని అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ఇలా తారక్ ను చూడలేకపోతున్నామని పలువురు కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు సినిమా కోసం అయితే పర్లేదు.. జూనియర్ ఎన్టీఆర్ డెడికేషన్ అండ్ హార్డ్ వర్క్ కు ఇదే నిదర్శనమని అంటున్నారు. కొత్త మూవీకి ఆల్ ది బెస్ట్ కూడా చెబుతున్నారు. త్వరలోనే తమ అభిమాన స్టార్ ను శక్తివంతమైన, ఆకర్షణీయమైన వ్యక్తిగా తిరిగి చూడాలని ఆశిస్తున్నట్లు చెబుతున్నారు.




## అఖండ 2 - మనశంకర వరప్రసాద్.. బిజినెస్ లో ఎవరి బలమెంత?




తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పుడు రెండు పండుగల బిజినెస్ బజ్ నడుస్తోంది. నటసింహం బాలకృష్ణ నటించిన 'అఖండ 2' డిసెంబర్ 5న రాబోతుండగా, మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా సంక్రాంతి బరిలో దిగుతోంది. రెండు వేర్వేరు పండుగలకు వస్తున్న ఈ చిత్రాల థియేట్రికల్ బిజినెస్ అంచనాలు హాట్ టాపిక్ గా మారాయి. ఈ బిజినెస్ పోరులో ఎవరు సేఫ్ గేమ్ ఆడుతున్నారు? ఏ సినిమాకు ఎక్కువ డిమాండ్ ఉంది అనేది ఆసక్తికరంగా మారింది. డిసెంబర్ 5న విడుదలవుతున్న 'అఖండ 2' సంక్రాంతికి వస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రాలు, వాటి రిలీజ్ డేట్ అడ్వాంటేజ్‌ను వాడుకుంటున్నాయి. అఖండ 2 సినిమాకు డిసెంబర్ మొదటి వారం కావడం వల్ల, సింగిల్ రిలీజ్ అడ్వాంటేజ్ ఉంటుంది. అదే చిరంజీవి సినిమాకు, సంక్రాంతి పండుగ సెలవుల అడ్వాంటేజ్ ఉంటుంది. ఈ రెండు కాంబినేషన్లపైన ప్రేక్షకులకు, డిస్ట్రిబ్యూటర్లకు ఉన్న నమ్మకం వల్లే భారీ స్థాయిలో బిజినెస్ బజ్ పెరిగింది.

**మెగాస్టార్ అనిల్.. కాంబినేషన్ బలం....** ?చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకు సంబంధించిన అంచనాలు చూస్తే.. కేవలం ఆంధ్ర బిజినెస్ రేషియోనే 63 కోట్లుగా ఉంది. అలాగే, నైజాం ప్రాంతంలో కూడా ఈ సినిమాకు 45 కోట్లు కోట్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. సంక్రాంతి సీజన్‌కు, అనిల్ రావిపూడి మార్క్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌పై మెగాస్టార్ వేసిన ఈ ప్లాన్.. ఆంధ్రా ప్రాంతంలో అనూహ్యమైన డిమాండ్‌ను పెంచింది.

**బాలయ్య, బోయపాటి ఫార్ములా...** మరోవైపు, బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న 'అఖండ 2' సినిమా బిజినెస్ పై అంచనాలు కూడా గట్టిగానే ఉన్నాయి. ఈ సినిమాకు ఆంధ్ర బిజినెస్ రేషియో 54 కోట్లుగా, నైజాంలో 36 కోట్లుగా అంచనా వేస్తున్నారు. డిసెంబర్ 5న వస్తున్నప్పటికీ, 'అఖండ' సృష్టించిన రికార్డులు, బోయపాటి మార్క్ మాస్ యాక్షన్పై ఉన్న నమ్మకం వల్లే ఈ రేంజ్ బిజినెస్ అంచనాలు ఉన్నాయి.

**ఆంధ్రాలో చిరంజీవి జోరు....** ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం, ఆంధ్ర ప్రాంతంలో చిరంజీవి సినిమాకు (63 కోట్లు) బాలకృష్ణ సినిమా (54 కోట్లు) కంటే ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం, అనిల్ రావిపూడి ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ ఫార్ములా, సంక్రాంతి సీజన్‌కు బాగా నప్పుతుందని డిస్ట్రిబ్యూటర్లు భావిస్తున్నారు. అలాగే, నైజాంలో కూడా చిరంజీవి సినిమాకే (45 కోట్లు vs 36 కోట్లు) మెరుగైన అంచనాలు ఉన్నాయి. ఈ బిజినెస్ అంచనాలు సినిమా విడుదలయ్యే సమయానికి మారే అవకాశం ఉన్నా, ఈ రెండు సినిమాలు కూడా వాటి కాంబినేషన్ క్రేజ్‌ను బలంగా వాడుకుంటున్నాయి. 'మన శంకరవరప్రసాద్ గారు'కు పండుగ సీజన్ అడ్వాంటేజ్ ఉంటే, 'అఖండ 2'కి సోలో రిలీజ్ అడ్వాంటేజ్ ఉంది. మరి ఈ రెండు చిత్రాలు తెలుగు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తాయో చూడాలి.

## షిర్డీలో రష్మిక సందడి.. ఆయనతో కలిసి ప్రత్యేక పూజలు!




ప్రముఖ సినీ నటి రష్మిక మందన్న తాజాగా షిరిడీలో దర్శనమిచ్చారు. అక్కడ ఆయనతో కలిసి ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తూ.. ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. ప్రముఖ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తాజాగా నటిస్తున్న చిత్రం థామా.. హార్రర్ కామెడీ బ్యాక్ డ్రాప్ లో వస్తున్న ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్ గా.. ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్నారు. మాడాక్ ఫిలిమ్స్ బ్యానర్ పై దినేష్ విజన్, అమర్ కౌశిక్ ఈ సినిమాకు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేష్ రావల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా ట్రైలర్ ఇటీవల విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అక్టోబర్ 21వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో తాజాగా బాబా ఆశీస్సులు పొందడానికి చిత్ర బృందం షిరిడీలో దర్శనమిచ్చారు. వైట్ చుడిదార్ లో చాలా సాంప్రదాయంగా రష్మిక కనిపించగా.. అటు ఆయుష్మాన్ ఖురానా కూడా కుర్తీలో మరింత ట్రెడిషనల్ గా కనిపించారు. ఇక స్వామివారి పాదాల ముందు తలవాల్చి తమ సినిమా సక్సెస్ కావాలని కోరుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా థామా సినిమా విడుదల సందర్భంగా ఇలా చిత్ర బృందం మొత్తం షిరిడీలో సాయిబాబాను దర్శించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది.ఇది చూసి.. బాబా ఆశీస్సులు ఎప్పుడూ మీపై ఉంటాయి.. ఖచ్చితంగా సినిమా హిట్ అవుతుంది అంటూ అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. రష్మిక విషయానికి వస్తే.. కన్నడ ఇండస్ట్రీకి చెందిన ఈమె.. 2014లో మోడలింగ్ ప్రారంభించింది. అదే సంవత్సరం క్లీన్ అండ్ క్లియర్ ఆఫ్ ఇండియా టైటిల్ గెల్చుకున్న ఈమె.. క్లీన్ అండ్ క్లియర్ బ్రాండ్ అంబాసిడర్ గా పనిచేసింది. ఆ తర్వాత కిరిక్ పార్టీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈమె.. తెలుగులో తొలిసారి ఛలో సినిమా ద్వారా పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఆ తర్వాత గీతాగోవిందం, దేవదాస్, డియర్ కామ్రేడ్ , సరిలేరు నీకెవ్వరు అంటూ వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది.

అల్లు అర్జున్ - సుకుమార్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప సినిమాతో 2021 లో సంచలనం సృష్టించిన ఈమె.. ఆ తర్వాత నుంచి చేస్తున్న ప్రతి సినిమా కూడా ఈమెకు మంచి విజయాన్ని అందించింది. అలా పుష్ప 2, ఛావా, యానిమల్, కుబేర ఇలా వరుస చిత్రాలతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అంతేకాదు ఈ చిత్రాలతో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద మూడువేల కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి సంచలనం సృష్టించింది. ప్రస్తుతం ఈమె చేతిలో గర్ల్ ఫ్రెండ్, థామా, రెయిన్బో, మైసా వంటి చిత్రాలు ఉన్నాయి. అలాగే వెంకి కుడుముల దర్శకత్వంలో కూడా ఒక సినిమా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఎక్కువగా తెలుగు, తమిళ్ భాషల లో ఫోకస్ పెడుతున్న ఈమె ఈమధ్య హిందీ పై కూడా ధ్యాస పెట్టింది. అక్కడే పలు చిత్రాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది.

## రెడ్ డ్రెస్‌లో మెరుపులు కురిపిస్తోంది

తెలుగు సినిమా 'తూనీగా తునీగా'తో ఇండస్ట్రీకి పరిచయం అయిన రియా చక్రవర్తి బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తున్న సమయంలో అనూహ్యంగా హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం కారణంగా కెరీర్ తలకిందులు అయింది. రియా చక్రవర్తి ఆ కేసు కారణంగా దాదాపు మూడు నాలుగు ఏళ్ల ఇండస్ట్రీలో కనిపించలేదు. తిరిగి ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా సోషల్ మీడియాలో మునుపటి ఉత్సాహంతో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. ఇటీవల వరుసగా రియా చక్రవర్తి ఫోటో షూట్స్ గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతున్న విషయం తెల్సిందే. ఇటీవలే మనం కూడా ఆమె అందాల ఆరబోత ఫోటోల గురించి మాట్లాడుకున్నాం. ఇంతలో మరోసారి తన అందమైన ఫోటో షూట్ కారణంగా రియా చక్రవర్తి సోషల్ మీడియాలో, వార్తల్లో నిలిచింది.



**రెడ్ డ్రెస్‌లో అందాల రియా చక్రవర్తి...** ఈసారి రియా రెడ్ డ్రెస్‌లో అందంగా కనిపించింది. క్లీ వేజ్ షో చేస్తూ, నడుము అందాలను చూపించడం ద్వారా రియా చూపు తిప్పనివ్వడం లేదు. రెడ్ డ్రెస్‌లో నెటిజన్స్ హృదయాల్లో మెరుపులు మెరిపిస్తున్న ఈ అమ్మడు సినిమాల్లో ఖచ్చితంగా గట్టి రీ ఎంట్రీ ఇవ్వడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇలాంటి అందమైన ఫోటోలను ఫిల్మ్ మేకర్స్ చూస్తే గతంతో సంబంధం లేకుండా ఖచ్చితంగా వరుస సినిమా ఆఫర్లు ఇవ్వడం ఖాయం అని కూడా కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రియా చక్రవర్తి పాపం కెరీర్ అర్థాంతరంగా నాశనం అయింది. ఆ సంఘటన జరిగి ఉండకుంటే ఖచ్చితంగా బాలీవుడ్‌లో ఇప్పటి వరకు టాప్ హీరోయిన్స్ జాబితాలో నిలిచేది అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి రియా చక్రవర్తి రెడ్ హాట్ డ్రెస్ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.

## రాజా సాబ్ లేట్ అందుకేనా? జక్కన్న కూడా జాగ్రత్తపడ్డారా?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్ లో నటిస్తున్న హారర్ కామెడీ ఎంటర్టైనర్ రాజా సాబ్. టాలీవుడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నారు. ఇటీవల రాజా సాబ్ మేకర్స్ విడుదల చేసిన టీజర్ లో హారర్ అంశాలతో పాటు ప్రభాస్ పండించిన కామెడీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో సినిమాపై ఆడియన్స్ లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అంతా మూవీ కోసం వెయిట్ చేస్తున్నారు. అయితే మూవీ ఇప్పటికే రిలీజ్ కావాల్సి ఉంది. కానీ వాయిదా పడుతూనే వచ్చింది. 2025 ఏప్రిల్ 10వ తేదీన సినిమా రిలీజ్ అవుతుందని మేకర్స్ ముందు అనౌన్స్ చేశారు. కానీ ఆ తర్వాత వాయిదా వేస్తూ వచ్చారు. అనేక వాయిదాల తర్వాత ఇప్పుడు వచ్చే ఏడాది జనవరి 9న సంక్రాంతి పండుగ సందర్భంగా థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే సినిమా ఆలస్యం వెనుక



ప్రొడక్షన్, ప్రభాస్ బిజీ షెడ్యూల్ కారణమని అంతా భావించారు. కానీ అది నిజం కాదని తెలుస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్- %ఎఖీశ% విభాగంలోని ప్రధాన సమస్యల వల్ల సినిమా లేట్ అయింది. ఇటీవల నిర్మాత విశ్వప్రసాద్ ఆ విషయాన్ని తెలిపారు. రాజా సాబ్ కు వర్క్ చేస్తున్న ఓ సీనియర్ వీఎఫ్ఎక్స్ సూపర్వైజర్.. నెలల తరబడి వర్క్ చేశారని తెలిపారు. ఒక్క వీఎఫ్ఎక్స్ షాట్ కూడా ఇవ్వలేదని చెప్పారు. సినిమాకు సదరు టెక్నీషియన్ తో పనిచేయడం కష్టమైందని చెప్పిన విశ్వ ప్రసాద్.. వీఎఫ్ ఎక్స్ షాట్ కోసం ప్రెజర్ చేయగా తప్పుకుంటానని అనేవారని పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు నుంచి తప్పించేందుకు నిర్ణయించామని కూడా చెప్పారు. అందుకే సినిమా లేట్ అయినట్లు పరోక్షంగా విశ్వప్రసాద్ తెలిపారు. దీంతో ఇప్పుడు ఆ విషయం హాట్ టాపిక్ గా మారింది. అయితే సదరు టెక్నీషియన్ ను దర్శకధీరుడు రాజమౌళి కూడా మహేష్ బాబుతో చేస్తున్న సినిమాకు గాను బోర్డులోకి తీసుకున్నారని తెలుస్తోంది. కానీ కొన్ని కారణాల వల్ల జక్కన్న కూడా ఆయనను తప్పించారని సమాచారం. మొత్తానికి రాజా సాబ్ తో పాటు %బావీదీ% 29 మేకర్స్ ఆ టెక్నీషియన్ ను తప్పించారు. ఏదేమైనా రాజా సాబ్ ఆలస్యానికి కారణం ఆయనేనని తెలుస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536